# ముత్యాల గొడుగు

నండూరి
రామ కృష్ణమాచార్య

# ముత్యాల గొడుగు

కృతి కర్త

నందూరి రామ కృష్ణమాచార్య

-: కృతి భర్త :-

శ్రీశ్రీశ్రీ బైర్రాజు సత్య నారాయణ రాజు గారు.

రచయిత=Author :

డాక్టరు నందూరి రామ కృష్ణమాచార్య :

**Dr. N.V.R. KRISHNAMACHARYA, M.A., Ph. D.**

420 P.G. Road 420 పి.జి.రోడ్డు

Jawahar Nagar జవాహరు నగర్

Sec' bad 500003 సికింద్రాబాద్ 500003

Phone : 7817397 ఫోన్ : 7817397

Copy Right - Author సర్వ స్వామ్యములు రచయితవి.

Copies 3000 ప్రతులు 3000

Name of the Book గ్రంథము పేరు

**Mutyala Godugu** "ముత్యాల గొడుగు"

Publication October 99 ప్రచురణ అక్టోబరు 99

Telugu poems తెలుగు పద్య కవితలు

Price : Rs **100/-** వెల : నూరు రూపాయలు

**ముద్రణ :**

**ఆర్. కె. ప్రింటర్స్**

11-6-418, నాంపల్లి,

హైదరాబాద్. ఫోన్ : 21 41 33

**టైప్ సెట్టింగ్ :**

కె. కామేశ్వరి

**ఆర్. కె. ప్రింటర్స్**

11-6-418, నాంపల్లి,

హైదరాబాద్. ఫోన్ : 21 41 33

Dadicated to the Royal PATRON -: అంకితము :-

**Sri. B. Satyanarayana Raju garu**

Chairman, Satyam Corporate Group

Residence 2-74 Satyam Enclave

N. H.No : 7 Medchal Road, **Jeedimetla** (v)

Sec'bad 500 855 Ph. 3095883

కృతి పతి : శ్రీశ్రీశ్రీ బైర్రాజు సత్య నారాయణ రాజు గారు

జీడిమెట్ల - 500 855 రంగారెడ్డి జిల్లా. ఫోను 3095883

# -: నా సాహితీ ప్రస్థానము :-

నండూరి రామ కృష్ణమాచార్య

కాకినాడ పీఠికా పురాధీశ్వర కళాశాల అధినేతగా 30-4-1976 తేదీన ఉద్యోగ విరమణ చేసినాను. అధ్యాపకులు - విద్యార్థులు - నాకు సన్మాన పరంపరలు చేశారు. అంతే గాక పౌర సంఘాలు చేరి ఒక సమాఖ్య సత్కారం నాకు పుర మందిరంలో పెద్ద యెత్తున చేశారు. డాక్టరు శామ్యూల్ రత్న కుమార్, శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యులు ప్రభృతులు చూపిన అనురాగ పరంపరలు వర్ణనాతీతములు. దళిత సంఘంవారు కూడా ఆప్యాయంగా సన్మానించారు. కాకినాడ పీఠికా పురాధీశ్వర కళాశాలలో నా జీవితం ఒక మృదు మధుర మనోహర స్వప్నంగా గడచి పోయింది.

ఉద్యోగ విరమణ చేసి - కాకినాడ నుండి, సకుటుంబంగా నా కారులో సికింద్రాబాదు లోని స్వగృహం చేరుకున్నాను. మార్గ మధ్యంలో శ్రీ గాడేపల్లి కుక్కుటేశ్వర రావు కవి ఆతిథ్యం- బులుసు వారి సన్మానం స్వీకరించి, సరిక్రొత్త జీవిత చరిత్ర - విశ్రాంత యోగం ఆరంభమైనది. శ్రీ గోరా శాస్త్రిగారి ప్రోత్సాహంతో ఆంధ్రభూమి దిన పత్రికలో **"పన్నీటి జల్లు"** వ్యాసాలు వ్రాయటం మొదలు పెట్టాను.

**అభినవ కురుక్షేత్రం :-** ఒక పద్యనాటిక - ప్రహసనం- ఆంధ్రభూమిలో నా రచన పడింది. ఆ నాటికకు నేను ఊహించని స్పందన లభించింది. తెలుగు నేల నాలుగు చెరగులలో ఆ ప్రహసనం - ప్రదర్శింపబడింది-కొన్ని వందల సారులు. - అందు లోని ఇతివృత్తం శ్రీమతి ఇందిరా గాంధి పరాజయం. శ్రీ జయప్రకాశ్ నారాయణ్ విజయం. జనతా పక్ష ప్రభుత్వ స్థాపన. అందలి పద్యాలు - ఉద్యోగ విజయ నాటక పద్యాలకు అనుసరణలు - ప్రఖ్యాత పద్యములకు

పారడీలు. జయప్రకాశ్ అంటాడు రాజ నారాయణ్‌తో –

నర వర, నీచే ! నాచే !
జరిపిన ఎన్నికల చేత! సంజయు చేతన్,
వర జగ్ జీవను చేతను !
అరయంగా ఇంది రోడె-అందరి చేతన్.

రాజ నారాయణ్ ప్రభృతులు – రంగస్థలంపై – నిలిచి తెలుగు పద్యాలు పాడటం చాలా బాగా రక్తి కట్టింది.

ఏల కోరు కొనుట ఈ ప్రజాసామ్యమ్ము ?
దొసగు లిన్ని యున్న దొరతనమ్ము ?
ఇంత కంటె చెడ్డ వితర రాజ్యాంగముల్ !!
గ్రుడ్డి కంటె – మెల్ల – కొంత నయము.

ఈ అభినవ కురుక్షేత్రములో ప్రాచీన సంస్కృత సాహితీ మర్యాదలకు పారడీలు సుస్పష్టం.

సూత్రధారి – నటి పాత్రలు ఉన్నాయి. సూత్రధారి ప్రవేశించి ఢిల్లీని గూర్చి

"ఇచ్చోటనే కదా – ఏకాదశాక్షౌహి
ణీ నేత మీసాలు నేల గలిసె:"

ఈ సీస పద్యం మహాకవి జాషువా గారు వ్రాసిన సుప్రసిద్ధ పద్యం "శ్మశానము" లోని సీస పద్యమునకు పేరడీ. 'మీసా' లు కూడా పేరడీయే.

"ఈ సనాతన ఢిల్లీ పురీంద్ర మందు
తర తరాల ద్రవీ భూత చరిత –యమున:
ఈ మహా ప్రౌఢ కల్లోలినీ మతల్లి,
నడచు నవ్వు కొనుచు నంగనాచి వోలె.

జాషువా కవీశ్వరుని ఈ క్రింది పద్యమునకు పేరడీ.

తొల్లి – నిన్ను గన్న తుంగభద్రా నది,
బ్రదికి యున్న దిపుడు పార్థివేంద్ర!

నేటి తుంగభద్ర- నిన్నెరుంగని యట్లు,
నడచు చుండె -నంగనాచి వోలె:-

ఈ ప్రహసన నాటికలో కవి – తటస్థుడు.
సాక్షి మాత్రుడే. ఇందలి ప్రధాన రసం – హాస్యం.

పాతికేండ్ల వయసు పడుచు గాడిద కంటె
పరుగు నందు – బ్రదుకు పందె మందు;
షష్టి పూర్తి అయిన – జవనాశ్వమే మేలు !
ఏన్గు మేలు-వంద యేండ్ల దైన.

కృపాలనీ నోటి నుండి చిక్కని తెలుగు పద్యాలు వెలువడ్డాయి !

ఆయుధాలు కావు – అణ్వస్త్రములు కావు;
భరత మాత కేది ప్రాణ రక్ష ?
చమురు గనులు కావు – హిమవన్నగము కాదు !
స్వేచ్ఛ కోరు ప్రజల జీవ శక్తి.

దొరతనమ్ము చేయ తోడేళ్ళు సిద్ధమౌ !
మనుజు లెల్ల! గొఱ్ఱె మంద లైన ;
దేశ మందు – ఉన్న తెలివి తేటల బట్టి;
దొరుకు ప్రజకు – తగిన దొరతనమ్ము[1].

ఉద్యోగ విరమణ చేసిన పిదప వచ్చిన ధనముతో ప్రగతి గీతా ప్రెస్సు పెట్టినాను. ఆ ప్రెస్సు రెండేళ్ళలో దివాళా తీసింది. వాఙ్మయ దృష్టి వేరు, వాణిజ్య దృష్టి వేరు.

---

నేను వ్రాసిన ప్రహసనం :- "తెలుగు గడ్డ" అవిభక్త మదరాసు ఎన్.జి.వోల సంఘం ప్రదర్శించినపుడు - ఆ సంఘం అధ్యక్షుడు గుమ్మలూరి సత్యనారాయణగారు ఏతత్ కవి వ్రాసిన - ప్రహసనం కాని నాటకం - ఉన్నదా ? అని గ్రంథాలయాలు వెదకి " ధర్మచక్రం " పట్టుకొని దానిని పలుసారులు యావద్ భారతదేశంలో పెక్కు చోటుల ప్రదర్శించారు. అందులో, శ్రీవారు వేసిన పాత్ర చాణక్యుడు. బహుళ కష్ట వ్యయ ప్రయాసలకు ఓర్చి - "ధర్మచక్రం"- ఆహార్య వస్తు విశేషాలు సమకూర్చుకొని శతాధిక ప్రదర్శనలు ఇచ్చారు.

ఆ ప్రగతి గీతా ప్రెస్సు లోనే నేను వ్రాసిన గ్రంథాలు **తిక్కన భారత దర్శనం 'తారాతోరణం' 'ధర్మచక్రం' 'బుద్ధచరిత్ర' మూడు హాస్యనాటికలు ' ప్రాచీన దక్షిణ భారత చరిత్ర ' ' దశరూపకములు'** నృత్యనాటికలు **'జోత్స్నాభిసారిక' 'గోదావరి'**-మున్నగునవి అచ్చువేశాను -

శ్రీ. జి.కృష్ణమూర్తిగారు -ప్రగతి గీతా ప్రెస్సును కొన్నారు. కాని ప్రెస్సు పేరు మార్చలేదు.

ఆంధ్రభూమి సంపాదకుడు ప్రియమిత్రుడు శ్రీ గోరా శాస్త్రి దివంగతులైనాడు, మా అబ్బాయి శ్రీ నందూరి గోవిందరాజు - జబ్బలుపూరులో రక్షణశాఖలో ఇంజనీరు ఆహ్వానంపై నేను నా శ్రీమతి సుభద్ర అక్కడకు వెళ్లి సుమారు పదినెలలు ఉన్నాము 1981 సంవత్సరంలో అప్పుడు నాకు అంతా తీరికే . జబ్బలుపూరులో ఆంగ్లంలో ' **"మహాభారతం"** సంస్కృత మూలం అనుసరించి వ్రాశాను. ఆ బృహద్ గ్రంథం ముద్రించడం ఎట్లా? తిరుపతి వెళ్ళాను. తిరుమల తిరుపతి దేవస్థానం - కార్యనిర్వహణాధికారి అప్పుడు శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్ ఐ.ఏ.ఎస్ .

శ్రీ ప్రసాదు గారు చేసిన మేలు ఆజన్మము మరువరానిది. నా ఆంగ్లమహాభారతం ప్రసాదుగారి పురుషకారం వల్ల - ప్రచురించుటకు తి.తి. దేవస్థానం వారు అంగీకరించారు. శ్రీ ప్రసాద్ గారు నాకు ప్రచురణల సంపాదకునిగా ఉద్యోగం ఇచ్చారు. ఉచిత వసతితో. అచట నా పర్యవేక్షణ లోనే నా ఆంగ్ల **మహాభారతం** అచ్చయింది 1982 సంవత్సరం లో.

శ్రీ ప్రసాదు లోన - హృదయమ్ము మేధతో;
గంగ యమున లట్లు సంగమించె !
అతని లోని - ఐదు ప్రాణాలు - గణియింప,
సేవ - సేవ - సేవ - సేవ -సేవ.

ఆయన పరోపకార పారీణుడు.

శ్రీ ప్రసాద్ గారిని విజ్ఞులు పలువురు **" అభినవ విక్రమాదిత్యుడు"** అనేవారు. ఆయన కొలువు కూటంలో - అభినవ నవరత్నాల" ను చేర్చారు. అంతే

కాదు ఆయన గ్రంథకర్తలకు అందించిన ఆదరాభిమానాలు ఆర్థిక సాహాయ్యం - చారిత్రాత్మకం. ఆ సంఘంలో నేను ఒక సభ్యుడను. అది నా అదృష్ట విశేషం. కొన్ని లక్షల రూపాయలు ఆర్థిక సాహాయ్యం రచయితలకు అందించింది తి.తి. దేవస్థానం. ఆ ప్రణాళిక ఇంకా కొనసాగు చున్నది శ్రీ ప్రసాద్ గారు బదిలీ అయినారు. నేను ఆ పదవికి రాజీనామా చేశాను[1]. నా పర్యవేక్షణలోనే తి.తి. దేవస్థానం వారు ఆంధ్ర భాగవత ప్రణాళిక చేపట్టినారు. (ఆంధ్ర మహాభారతం ప్రణాళికకు కూడ అంకురార్పణ చేసింది నేనే).

ఆ ప్రణాళికలో తదుపరి ఆంధ్ర మహాభారతంలో అరణ్యపర్వము లోని పద్యములకు నేనే ప్రతిపదార్థ టీకా వ్యాఖ్యానములు వ్రాసినాను. భీష్మపర్వంలో ఒక ఆశ్వాసమునకు. ఆబృహత్ గ్రంథ పరంపర టి.టి. దేవస్థానంవారు తదుపరి అచ్చు వేయుచున్నారు.

తిరుపతి నుండి జంట నగరాలలో ఇంటికి వచ్చి ఒక సంవత్సరం పైచిలుకు విశ్రాంతిగా ఉన్నాను. మరల తి.తి. దేవస్థానం వారు పిలిచి - నాకు ధర్మ రక్షణ పరిషత్తు హైదరాబాదు విభాగంలో ప్రత్యేక సూత్రధారిగ - ఉద్యోగం ఇచ్చారు. 1984- 1987 వరకు ఆ ఉద్యోగంలో ఉన్నాను. నా కర్తవ్యాలు :- పండిత ప్రసంగాలు, హరికథలు , జంట నగరాల దేవాలయాలలో ఏర్పాటుచేయటం. 'అత్త సొమ్ము అల్లుడు దానం చేయటం' - పరిహాస రసికుడు ఏ మహానుభావుడు కల్పించిన సామెత యో - శ్రీ వేంకటేశ్వర స్వామి ధనం పాత్రదానం చేసే అవకాశం నాకు లభించింది. ఆ పర్యవేక్షణ సంఘం- అధ్యక్షుడు శ్రీ పల్లెంపాటి వేంకటేశ్వర్లు గారు మహానుభావుడు. పరమ భాగవతోత్తముడు. ఆయన - ఆ యజ్ఞహోమ కుండంలో ఆజ్యదాత. ఆ త్యాగ యోగి లోని పండిత పక్షపాతం వర్ణనాతీతం. అది నమ్మ లేని నిజం. దేవస్థానం వారు నాకు కొన్ని విధి నిషేధాలు

---

*1. నా సూచనమేర ఆ పదవి కరుణశ్రీ శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి గారికి తి.తి. దేవస్థానం వారు ఇచ్చారు.*

నిర్దేశించారు. ఏ పండితునకూ ఒకే నెలలో 300 రూకలు మించి ఇవ్వరాదు. శ్రీ పల్లెంపాటి వేంకటేశ్వర్లుగారు పలువురకు పండితులకు తన సొంత జేబునుండి 700 కలిపి వేయి రూకలు ఇచ్చారు. వేయి రూకలు నెలసరి ఇచ్చిన నెర దాత పల్లెంపాటి వేంకటేశ్వర్లు సజీవ రక్తమాంసల జంగమ చర్మ విగ్రహం చూస్తే చాలు నాకు కనుల పండువ అనిపించేది. అసలు ఆ తిరుమల వేంకటేశ్వర స్వామి నోరు విప్పి మాటాడని శిలా విగ్రహము కదా ? నేను చేసిన కొలువు దొర ఏడు కొండలవాడు అటు - ఇటు పల్లెంపాటి వేంకటేశ్వరుడు. ఆ సంఘంలో ఒక సభ్యుడు. ఆర్షపుత్ర శతక కర్త, పద్య కవి అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనం ప్రముఖ కార్యకర్త డాక్టరు టి.వి. నారాయణగారు. ఆయనకు ఉపనిషత్తులపై అమిత భక్తి ప్రపత్తులు. ఆయన వ్రాసిన **"ఆర్షపుత్ర శతకముకు"** నాచే 'పీఠిక' వ్రాయించుకున్నారు. ఆయన ఆంగ్ల విద్యాధికుడు. తెలుగు పండితుడనైన నన్ను అభిమానించిన సహృదయ చక్రవర్తి. ఆయన ఒక నాడు బాలాజీభవనంలో ఏకాంతంగా కుర్చీలో కూరుచున్న నా దగ్గరకు వచ్చి కాశ్మీరు శాలువ నాకు కప్పి సత్కరించి సంతోష తన్మయత్వంలో తిరిగి వెళ్ళారు ! ఆంధ్రప్రదేశ్ సర్వీసు కమీషనులో కొంత కాలం ఆయన సభ్యుడు. విద్యావేత్త. గుండె పండిన ఆంగ్ల పండితుడు నావంటి ఒక తెలుగు పండితుడు ఆంగ్లలో వ్రాసిన మహాభారతం మెచ్చటం నాకు గర్వకారణం.

తి.తి.దేవస్థానంవారు - పురాణ పాత్రలు 500 ఏరి చిరు పొత్తములు వ్రాయింపచేశారు వివిధ విద్వాంసులచే.

**"శ్రీకృష్ణుడు"** శీర్షికపై వ్రాయమని వారు నన్ను కోరినారు. శ్రీ కృష్ణుని పాత్ర - నాకు లభించటం నా అదృష్ట విశేషంగా భావించి వ్రాసినాను. వారు కొన్ని వేల ప్రతులు ప్రచురించినారు. నేను వ్రాసిన విషయాలు ఎన్నో సంక్షేపించారు. శ్రీ కృష్ణపాత్రపై మరి యొక గ్రంథం వ్రాయాలని నాకు సంకల్పం కలిగింది.

నేను ఆగ్లంలో వ్రాసిన మహాభారతమును మెచ్చిన వారిలో రామకృష్ణ మఠం అధిపతి స్వామి రంగనాథానందగారు ఒక రగుటె నాకు గర్వ కారణం. సాహితీ సహృదయుడు చీరాల కళాశాలాధి నేత శ్రీ పోలవరపు జగదీశ్వర రావు గారు ఆ గ్రంథం నోబెలు సారస్వత బహుమతికి తగినది అని ఉగ్గడించారు.

## అష్టావధాని శ్రీ ఆశావాది ప్రకాశరావు

16-8-1981 తేదీన నా 'షష్టిపూర్తి' అనంతపురంలో జరిగింది. ఏతదుత్సవ సూత్రధారి అష్టావధాని శ్రీ ఆశావాది ప్రకాశరావు. అనంతపురం ప్రభుత్వకళాశాలలో నాకు శిష్యుడు. అతడు వ్రాసిన " మెఱపు తీగలు" నాకు అంకితం ఇచ్చారు అతని గురు భక్తి ఆదర్శప్రాయమైనది.

**'మెఱుపు తీగలు'** -నాకు అంకితం చేస్తూ శ్రీ ఆశావాది వ్రాసిన పద్యాలు.

అతడు శ్రీ రామకృష్ణమాచార్య గురుడు;
ప్రగతి గీతా ప్రవక్త - పుంభావ విద్య,
ఋషి - మనీషి - సత్కవితా కిరీట ధారి;
ఆంధ్ర సాహితీ సూక్తి రత్నాకరుండు.

నను మేల్పాదున పెట్టి దోహదము కావించి నీర్పోసి పూ
చిన కన్గొంచు ప్రమోద మంది విమలాశీర్వాదమున్ కూర్చు ప్రా
జ్ఞనకున్ కోసి శరీర మిచ్చినను హెచ్చుం గాదు మత్ పద్య గు
చ్ఛ నికాయంబును రామ కృష్ణ కవితాచార్యా ! గ్రహింపంగదే.

శ్రీ ఆకాశావాది దళిత వంశములో పుట్టి బ్రహ్మర్షి కాగల్గినాడు.

## ఆచార్య శ్రీ తంగిరాల సుబ్బారావు

ఆచార్య శ్రీ తంగిరాల సుబ్బారావు బెంగుళూరు విశ్వ విద్యాలయంలో ఆంధ్ర శాఖాధ్యక్షుడు. ఒకనాడు భీమవరం కళాశాలలో విద్యార్థి. తెలుగు విద్వాంసులు పలువురుండవచ్చు. కవులు తెలుగులో తామర తంపర. డాక్టరు తంగిరాల సుబ్బారావు " కవితా లోలుడు" అతడు **"చైతన్య కవిత"** అనే తెలుగు త్రైమాసిక పత్రిక బెంగుళూరు నుండి నడుపుచున్నాడు. అతడు ధన్యజీవి.

అతడు **"చైతన్య కవిత"** నా మీద ఒక ప్రత్యేక సంచిక ప్రచురించాడు. (అక్టోబరు 1996)

ఆ సంచిక సంపాదకీయం లోని వాక్యాలు :- "దిగుమర్తి గురు దేవులు చెప్పినట్లు తెలుగు అధ్యాపక లోకంలో ఇద్దరే ఇద్దరు అదృష్టవంతులు. ఒకరు పింగళి

వారు. రెండవవారు నండూరి వారు". మా గురు దేవులు పింగళి లక్ష్మీకాంతం గారి సరస నాకు పెద్ద పీట వేశాడు మా తంగిరాల. నాకు సంతోషమే. ఆ వాక్యం అన్నది "యదార్ధవాది" సాహిత్య సత్యసంధుడుగా పేరొందిన నా సహవ్రతుడు శ్రీ దిగుమర్తి సీతారామస్వామి గారు. శ్రీ గోవర్ధనం ఫణీంద్రకవి అన్న మాట "ఆధునిక యుగంలో గురుకులములు వినిర్మించుకొన్న కీర్తి చెళ్ళపిళ్ళ వారు పింగళి వారు నండూరి వారు కవితా గురుపరంపరగా ఆంధ్రవాఙ్మయ చరిత్రలో చిరస్థాయిగ నిలుస్తారు."

ఆచార్య శ్రీ తంగిరాల సుబ్బారావుకు నా ఆశీరభివందనములు

**ఓ యభిమాన సంభృత మహోదయ ! సంచిక వేసి, సాహితీ**
**న్యాయము కూర్చినాడవు గదా - చరితార్థుడ - తెల్గులో ఉపా**
**ధ్యాయుడ నౌట నా బ్రదుకు ధన్యము - శిష్యుడ వీవె గా - రస**
**స్థాయికి చేర్చినావు - గురు దక్షిణ-మెచ్చితి - సుబ్బరాట్ కవీ!**

## స్వర్గీయ కలుగోట్ల విజయాత్రేయ

నాకు గల ఏకలవ్య శిష్యులలో ప్రాగ్రసరుడు కవి కలుగోట్ల విజయాత్రేయ. అతడు బహు పద్యకావ్యకర్త. ప్రతికావ్యంలో గురుస్తుతి నాపై పద్యాలు వ్రాశాడు. తెలుగు కవులలో ధారాశుద్ధి గల అవధానులు పలువురు. శత ఘంటకవులు ఉన్నారు. శ్రీ కలుగోట్ల విజయాత్రేయ, లోని విశేషం అతని ధారాసిద్ధి. అతని స్వగ్రామం కర్నూలు నంద్యాల మధ్య నున్న గని. ఆగనిలో ఉద్భవించిన కవితారత్నం అతడని అభివర్ణించ వచ్చు. అతని కవిత్వం సెలయేరు కాదు. " అతని కవిత ఒక రమణీయ జలపాతం " ఆంధ్రపద్యకవితా నయాగరా" అనే బిరుదుకు విజయాత్రేయ అర్హుడు.

కవి కలుగోట్ల విజయాత్రేయ నంద్యాల ఎస్.పి.వై రెడ్డిగారి ఆస్థాన కవియై శ్రీవారికి కొన్ని కావ్యాలు అంకితం చేశాడు. ఆ విధంగా గురువుగారైన నన్ను

నంద్యాల నంది పైపులదొర ఎస్. పి. వై. రెడ్డిగారికి పరిచయం చేశాడు. నేను వ్రాసిన

**"తెలుగె పద్య శిల్పం"**

శ్రీ రెడ్డి గారికి అంకితం ఇచ్చాను. ఆ సాహితీ జామాత నేను నిర్వహించిన కార్యక్రమాలు పెక్కింటికి సాయంచేశారు. ఆంధ్ర పద్య కవితా సదస్సు ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా ఉండి – ఆర్థిక సహకారం అందించారు.

తథా :– **ఆలోచనము** కావ్యం ముద్రణకుగూడ శ్రీ ఎస్.పి.వై. రెడ్డిగారు సాయం చేశాడు. నేను వ్రాసిన శ్రీ కృష్ణదేవరాయలు (1999) రంగస్థల నాటకం శ్రీ రెడ్డిగారికి అంకితం చేశాను.

మదరాసులోని ఆంధ్రులు నంద్యాల నంది పైపుల దొర రెడ్డిగారిని "వదాన్య శేఖరుని" గా గుర్తించి బహుమతి ప్రదానం చేశారు.

**ఆచార్య శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తి**

భీమవరం కళాశాలలో నాకు ప్రత్యక్ష శిష్యుడు. "నన్నెచోడుని కుమార సంభవం – ప్రాచీన కావ్యమా" అనే పుస్తకం వ్రాశారు. నాకు అంకితం ఇస్తానన్నారు. నన్నెచోడుని కుమార సంభవంగా ప్రసిద్ధి కెక్కిన కావ్యము – మానవల్లి రామకృష్ణకవి వ్రాసి నన్నెచోడుని పేరు పెట్టాడని శ్రీరామమూర్తి వాదం."ఆ సిద్ధాంతం నమ్ము వారెవరు ? ఋజువు చేయగల రచయిత ఎవడు ?" అని నా భయం. అట్టి వివాదగ్రస్త గ్రంథమును నేను అంకితం పుచ్చుకొనుటకు మొదట అంగీకరించలేదు. శ్రీరామమూర్తి నే నప్పుడు ఉన్న తిరుపతి వచ్చి ఆ రచన నాకు చదివి వినిపించాడు. నా ఆశ్చర్యమునకు తదుపరి నా ఆనందమునకు మేర లేదు.

ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి – అత్యద్భుత పరిశోధన చేశాడు, "సత్యం" వెలికి తీశాడు. అతనికి – పరిశోధనలో ఓనమాలు నేర్పిన గురువును నేను కావచ్చు. ఇట్టి గొప్ప పరిశోధన గ్రంథం అతడు నాకు అంకితం చేయటం సముచితం. కృతి స్వీకారమునకు నేను సంతోషంతో అంగీకరించాను. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర పరిశోధనలో ఇది అగ్రగణ్య గ్రంథం. అర్ధ శతాబ్ది – యావదాంధ్ర

విద్వల్లోకం కనిపెట్ట లేక పోయిన ఒక సత్యమును మూడు వందల పుటల మిమర్శ గ్రంథం వ్రాసి కొర్లపాటి శ్రీరామమూర్తి క్రొత్త చరిత్ర సృష్టించాడు. ఇట్టి రచన తెలుగు సాహితీ పరిశోధనలో

**నభూతో న భవిష్యతి** అని నా అభిప్రాయం ఇది "నమ్మ లేని నిజము "

ఆచార్య శ్రీ కొర్లపాటి అత్యద్భుత పరిశోధన " నన్నిచోడుని కుమార సంభవము ప్రాచీన కావ్యమా ?" అను గ్రంథమునకు నేను కృతి పతిని కావటం నాకు గర్వ కారణం. 1983 లో ఈ గ్రంథం ముద్రింప బడింది. చాలకాలం క్రితమే యవనికాభ్యంతరంలో – ఆచార్య శ్రీ కొర్లపాటి సారస్వత పరిశోధనలో గుప్త తపస్సు చేయసాగారు. ఏతత్ తపః ఫలం అతడు వ్రాసిన–: **తెలుగు సాహిత్య చరిత్ర :–**

నాలుగు భాగాలు పరమ ప్రామాణిక గ్రంథాలుగ తరతరాల విద్వాంసులకు వెలుగుబాటలుగ ఉపకరింపగలవు. ఆచార్య శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తి " కారణ జన్ముడైన" సాహిత్య పరిశోధకుడు. నన్ను గురువుగ సంభావించుట నా అదృష్ట విశేషము.

"ప్రమిద" పలు కాగడాలను ప్రజ్వలింపచేయవచ్చు.

---

## పరిశోధనము

నా సాహిత్యంపై పరిశోధన సలిపి - సిద్ధాంత గ్రంథాలు వ్రాసి "**డాక్టరేటు పట్టము**' పొందినవారు.

*1. మునిరత్నం పిళ్ళె - (శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి)*

*2. శ్రీమతి వింజమూరి లక్ష్మి (ఆంధ్రవిశ్వకళాపరిషత్తు నుండి)*

*3. శ్రీమతి నాగలక్ష్మి - ఎం.ఫిల్. - ఉస్మానియావిశ్వవిద్యాలయం*

*4. శ్రీమతి మంగళగిరి ప్రమీలాదేవి - గేయనాటికలపై అందు రెండు నేను వ్రాసినవి.*

*" జ్యోత్స్నాభిసారిక" "గోదావరి "*

*నండూరి రామ కృష్ణమాచార్య కు లభించిన పురస్కారాలు*

*1. తెలుగు భాషా సమితి-బహుమతి " కవిత్రయ గ్రంథమునకు"*

*2. దాశరథి స్మారక పురస్కారం*

*3. మధునాపంతుల స్మారక పురస్కారం*

*4. కరుణశ్రీ స్మారక పురస్కారం మున్నగునవి.*

ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తికి నా ఆశీరభినందనములు నా జేజేలు

పెక్కు మంది - ఏటి పిల్ల కాల్వల బోలు
వాఙ్మయ కథ లెన్నొ - వ్రాసినారు !
కోన సీమ సప్త గోదావరిని బోలు
గొప్ప రచన గూర్చె - కొర్లపాటి.

**శ్రీ శనగన నరసింహ స్వామి కవి**

నిరుపమాన పద్యశిల్పి శ్రీ శనగన నరసింహస్వామి - భీమవర కళాశాలలో విశిష్టి తెలుగు విద్యార్థి - విజయవాడ లయోలా కళాశాలలో ఉపన్యాసక పదవిలో ఉద్యోగ విరమణ చేసినప్పుడు - గురుదక్షిణ శీర్షికతో నాపై శిల్ప సౌష్ఠవము గల పద్యాలు వ్రాశాడు. అతనికి నా ఆశీరభినందనములు.

నీవు - సుతాధికుండవు - వినిర్మల చిత్తుడ వీవు - నా వలెన్,
జీవిత మెల్ల అంకితము చేసితి వాంధ్ర సరస్వతీ కళా
సేవకు - ధన్య మయ్యెను గద - శిష్యుడ వౌట మదీయ జన్మ - ఆం
ధ్రావళి మోదమున్ బొరయ ప్రాణము పోయుము పద్య విద్యకున్.

**ఆకాశ వాణి**

ఆకాశవాణితో - నాకు చాల కాలము నుండి సన్నిహితమైన అనుబంధం ఏర్పడినది. పెక్కు కవి సమ్మేళనములలో పాల్గొన్నాను. పెక్కు ప్రసంగాలు చేశాను మదరాసు విజయవాడ - విశాఖపట్నం కడప ఆదిలాబాదు - అనంతపురం మున్నగు కేంద్రాల నుండి ప్రసంగించాను. నేను వ్రాసిన నృత్యనాటకాలను **గోదావరి - వాసవి కన్యకా పరమేశ్వరి - శ్రమ ఏవజయతే :-** ప్రసారం చేసింది. తథా శ్రీ కృష్ణదేవరాయలు. "ఉరికంబం" నాటిక కీ.శే. స్థానం నరసింహారావుగారి పర్యవేక్షణలో **ధర్మచక్రం** నాటకం , శ్రీ బాలాంతపు రజనీకాంతరావుగారి దర్శకత్వంలో ప్రసారం అయ్యాయి చాలానాళ్ళ క్రితం

ఆకాశవాణిలో. - తెలుగు పద్య శిల్ప సౌష్ఠవంపై వరుసగా నేను కొన్ని ప్రసంగాలు చేశాను. అందులో పద్యాలు - మనోహరంగా రాగయుక్తంగా పాడి-రక్తి కట్టించిన విదుషీమణి మధురాతి మధుర మనోహర గాయని శ్రీమతి డాక్టరు జ్యోతిర్మయిగారు.

## సభలు

నే ప్రసంగించిన సభలు సహస్రాధికములు. తథా పొందిన సత్కారాలు. పాల్గొనిన కవిసమ్మేళనములు శతాధికముల. నేను పాల్గొనిన ప్రథమ కవిసమ్మేలనం -రాష్ట్రస్థాయిలో జరిగినది తెనాలిలో 1944 నవ్య సాహిత్య పరిషత్తు కార్యక్రమం. శ్రీ కాటూరి వెంకటేశ్వర రావుగారు అధ్యక్షుడు. ఆనాటి నుండి విశ్వనాథ సత్యనారాయణ, కరుణశ్రీ - శ్రీ శ్రీ, ఆరుద్ర, దేవులపల్లి కృష్ణశాస్త్రి- బోయి భీమన్న ....... దాశరథి, సి.నా.రె., బెజవాడ గోపాలరెడ్డి ప్రభృతులలో ఎన్నో కవిసమ్మేళనములలో పాల్గొన్నాను. గురువులతో పాటు ఇంచు మించు సమవయస్కులలో పాటు ఒకసారి రవీంద్ర భారతిలో - నా ప్రియశిష్యులు శ్రీ శనగన నరసింహస్వామి కలుగోట్ల విజయాత్రేయా కవులతోపాటు రవీంద్ర భారతిలో. ఎన్నో సారులు - అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనం కవి సమ్మేళనములకు అధ్యక్షత వహించారు. ఈ మధ్య రాంబాబు, రాధశ్రీ ప్రసాద్ - ఆచార్య ఫణీంద్ర ప్రభృతులతో. కవిసమ్మేళనములో నా పాత్రధారణ నా జీవిత చరిత్రలో 65 సంవత్సరములనుండి కొనసాగుచున్నది.

## అధికార భాషా సంఘం - అధ్యక్షత

1987-1990

ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుగారు నన్ను అధికార భాషా కమీషన్ అధ్యక్షునిగా నియమించారు. అర్ధశతాబ్ది పైబడి నేను చేసిన సాహితీ తపస్సు మెచ్చి సరస్వతీదేవి నాకు ఆ పదవి అనుగ్రహించినట్లు నా మిత్రులు అన్నారు.

ఆంధ్ర జాతి కెవడు - ఆత్మగౌరవ ముద్ర,
ఆనవాలు గుర్చి నట్టి - ఘనుడు;
మేటి నాయకుండు మేధావి; తేజస్వి
రామ రావు - తెలుగు సీమ లోన.

నా సాహితీ సేవ - "పుంభావ తెలుగు తల్లి" గుర్తించాడు. అనే సంతృప్తి నాకు కలిగింది.

అధికార భాషా సంఘంలో నా సహవ్రతులు

1. శ్రీ నాగభైరవ కోటేశ్వర రావు;
2. డాక్టరు మల్లెమాల వేణు గోపాల రెడ్డి,
3. ఆచార్య శ్రీ కొలకలూరి ఇనాక్
4. కీ.శే. మధురాంతకం రాజారాం.

వీరు నాకు అక్షరాల సంపూర్ణ సహకారం అందించారు. మధురాంతకం రాజారాంగారు సుప్రసిద్ధ కథానికా రచయిత. ఆయన తమిళ భాషా వేత్త. ఆచార్యశ్రీ ఇనాక్ గారు నాకు అనంతపుర ప్రభుత్వ కళాశాలలో గూడ సహవ్రతుడే. ఆయన వ్రాసిన కథలు అనాడే నాకు నచ్చినవి. డాక్టరు మల్లెమాల వేణు గోపాలరెడ్డి. మృదు మధుర మంజుల మనోజ్ఞ హృదయుడు. వైద్యుడే గాక, ఆయన సుప్రసిద్ధ కవి. చలన చిత్ర నిర్మాత కార్యశూరుడు మల్లెమాల సుందరరామరెడ్డి (ఎమ్.యస్.రెడ్డి) గారి తమ్ముడు. నా యెడ అనురక్తుడు. ఆయన సుకుమార మనస్వి.

శ్రీ నాగ భైరవ కోటేశ్వరరావు గారు ముఖ్య మంత్రికి అంతరంగికుడు. మొదట ఆయనను చూచి నేను భయపడినాను. నేను వ్యాఘ్రవాహనుడను ఔతానేమోనని గజ గజలాడిపోయాను. అయితే ఘోర క్రూర వ్యాఘ్రరాజముగ దూరంలో భాసించిన శ్రీ నాగభైరవకోటేశ్వరరావుగారు దగ్గరకు వచ్చినపుడు - గంగి గోవు వలె కామ ధేనువుగా కన్పించినారు ! చండ ప్రచండ మార్తాండ తేజస్వి దూరంగా ఉన్నప్పుడు. దగ్గరకు వచ్చినపుడు పండు వెన్నెలలు కురిసే నిండు జాబిల్లి. శ్రీ నాగభైరవ కవి వ్యాకరణంలో ఏకవచనం, వ్యవహార జగత్తులో నిత్య బహువచనం. అతడు ఒక

వ్యక్తి మాత్రుడు కాదు. జీవితంలో జంగమ సజీవ సాహిత్య పరిషత్తు. కేవల నిర్హేతుక జాయమాన కరుణతో నన్ను " అన్నగారు"గ మన్నించాడు. నాకు ఔరస సహోదరుడు లేని లోటు పూరించాడు. లక్ష్మణసౌభ్రాత్రసేవ నాకు లభింప జేశాడు.

అప్పుడు అధికార భాషా సంఘకార్యదర్శి- శ్రీ సి. ధర్మారావుగారు. అధ్యక్షుడగు నేను సభ్యులు సహవ్రతులు డొక్క లెగుర వేశాం. అసలు దంచింది కార్యదర్శి ధర్మారావు. కమీషన్ చేసిన తీర్మానాలన్నీ ముఖ్యమంత్రి రామారావు గారు ఆమోదించటం విశేషమని ధర్మారావుగారు ఆనంద చకితులయ్యేవారు. తీర్మానాలు తు.చ తప్పకుండా కార్య రూపంలో పెట్టిన కర్మయోగి శ్రీ ధర్మారావు గారు.

అధికార భాషా సంఘ అధ్యక్షుడుగా నేను సాదించింది ఏమిటో ఏమో !! ప్రభుత్వ వాహన సదుపాయం ఉన్నది. తెలుగు నేల నాలుగు చెరగులు పర్యటించినాను. ముఖ్యమంత్రి రామారావు గారు శ్రీ నాగభైరవ కోటేశ్వరరావు గారిని సంఘంలో సభ్యుడుగా నియమించటం - ఆంధ్ర సామ్రాజ్య సార్వభౌముడు తన పట్ట మత్తేభమును నాకు వాహనంగా ప్రసాదించటంగా పరిణమించింది. అది ఒక మహారాజ యోగ భాగం.

అయితే - ఈ విషయంలో తీర్పు చెప్పదగిన న్యాయమూర్తి అధికార బాషా సంఘం తొలి అధ్యక్షుడు ప్రాతః స్మరణీయుడు! త్యాగ యోగి

**-: శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్య గారే :-**

ఒకసారి - మేము ఇర్వురం ఏక వేదికపై కలిసాము. శ్రీవావిలాల గోపాల కృష్ణయ్యగారు అన్న మాటలు జ్ఞాపకం చేసుకొని వ్రాయుచున్నాను. బైబిలు నుండి ఒక కథ శ్రీవారు ఉదాహరించారు.

'నేను ఎన్నో విత్తనాలను శక్తి వంచన లేకుండా విసరివేశాను. కొన్ని విత్తనాలు చెల్లా చెదరై పడిపోయి చచ్చిపోయాయి అప్పుడే :- కొన్ని రాళ్ల మధ్య మొలక లెత్తి - పిదప చచ్చిపోయాయి! ఎండకు ఎండి వానలు లేక-. అదృష్ట వశాత్తు ఒక విత్తనం మొలిచి ఎదిగి శాఖోపశాఖలతో విస్తరించి పెద్ద వృక్షమైంది. ఈ కథ అధికార భాషా సంఘానికి అన్వయించ వచ్చు. విత్తనాలు విసరిన వాడను నేను.

ఎదిగిన మహావృక్షం - డాక్టరు నందూరి రామ కృష్ణమాచార్య.'

నన్ను మెచ్చిన శ్రీ వావిలాల వారి సహృదయత నేను మరువలేను.

నా సమాధానం:-

**విత్తనమ్ము నౌచు - వృక్షమ్ముగా మారి,**
**ఆవరింప దలతు ఆకసమ్ము !**
**వీలు కాని యెడల - వేరు విత్తున కైన,**
**ఎరువు నగుట కేను ఇచ్చగింతు.**

అధికార భాషగా తెలుగు అభివృద్ధి చెందే పరిపక్వ సమయం ఎప్పుడు వస్తుందో !! ఆ అవశ్యచారిత్రక పరిణామం కోసం సహృదయులు ఎదురు చూచు చున్నారు.

ప్రజల భాషలో పరిపాలన జరుగక పోతే "ప్రజాస్వామికము" సార్ధకము కాదు.

అధికార భాషా కమీషను - నిర్వర్తించిన కర్తవ్యముల తీరుతీయములో శ్రీ విజయరాఘవాచార్యులు సమగ్ర సమీక్ష చేసి "డాక్టరేటు పట్టము" సంపాదించినారు. ఆ గత చరిత్ర అధ్యయనము - వేయబడిన పునాదులు - భావి కాలమునకు ఉపయోగపడవచ్చు.

**నా పదవి గతించింది. భాధ్యతలు కూడ తీరినవి:-**

అయితే - పదవి పోయిన పిమ్మట గూడా యథాపూర్వాభిమానం నాపై చూపించిన మహానుభావుడు "శ్రీ నాగభైరవ కవి" ఆయన నా" శీర్ష మేఖల" కృతిని - వేయి ప్రతులు ప్రత్యేకంగా ముద్రించి - మా యింటికి వచ్చి నాకు ఆ పుస్తకాలు బహూకరించి వెళ్లినాడు. పిదప - నేటి వరకు శ్రీనాగభైరవ కవి నా మీద చూపించే ఆదరాభిమానములు నాకు అనుభవామ్రేడితములు.

అధికారభాషాసంఘం అధ్యక్ష పదవి పోయిన తదుపరి 1990 సంవత్సరంలో కేంద్ర సెన్సార్ బోర్డులో "సభ్యత్వం " నాకు లభించింది. అయితే రెండు నెలలు తిరుగకుండా నేను ఆ ఉన్నత పదవికి స్వచ్ఛందంగా "రాజీనామా" చేసాను. విజ్ఞులలో

విద్యావేత్తలలో చలన చిత్రాలు నిర్వహించే భూమికపై తీవ్రమైన అసంతృప్తి భారత దేశంలో ఉన్నది. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టం. చలనచిత్ర నిర్మాతలకు అనుకూలంగా ఉన్నది.

పలుసారులు ప్రధాన మంత్రులు మొసలి కన్నీరు కార్చుచున్నారు. చట్టం మారాలి. తప్పు - పార్లమెంటుది. చట్టం మార్చితే - భారతదేశం చలన చిత్ర రంగంలో యావత్ ప్రపంచానికి ధ్రువతార కాగలదు. ప్రపంచ చరిత్రలో - భారతదేశం - సాంస్కృతిక గరిమనాభిగ పలుమారులు ప్రసిద్ధి కెక్కింది. కేంద్రసెన్సారుబోర్డులో అసమర్ధ పాత్ర ధరించడం ఇష్టం లేక. ఆ పదవికి రాజీనామా చేసి నా అంతరాత్మకు శాంతి చేకూర్చుకోగలిగాను.

ఈ మధ్య శ్రీ నాగభైరవ కోటేశ్వరరావుగారు నాకు వ్రాసిన 'లేఖ' లోని వాక్యాలు ఉదాహరింపదగినది. "అన్నగారూ, 1995 లో ముద్రణ పొందిన మీ **"పద్యశిల్పం"** 1999 లో నాకు చేరింది. కవితా ప్రారంభకులకు ఈ పుస్తకం ఒక మానిఫెస్టో. ఒక సిలబస్. ఈ కారణంగా కూడా మీది ధన్య తరమైన జన్మ.

నేను వ్రాసిన **"తెలుగు పద్య శిల్పం"** గ్రంథం ఆవిష్కరణ మహోత్సవం జరిపింది ఆంధ్ర సారస్వత పరిషత్తు. ఆవిష్కర్త ఆచార్య శ్రీ సి. నారాయణరెడ్డిగారు. సారస్వతంలో నా స్థానం గూర్చి చక్కని చిక్కని సమగ్ర సుందరమైన ప్రసంగం చేశారు. వారు ఆనాడు వెల్లడించిన ఒక విశేష విషయం శ్రీ నారాయణరెడ్డిగారు విద్యార్థి కార్యదర్శిగా ఉన్నప్పుడు నిజాం కళాశాల ఆంధ్రోత్సవ సభలకు వారు శ్రీ జాషువా కవిని - నన్ను ఆహ్వానించి సత్కరించారు. అది అర్ధ శతాబ్దికి ముందరి సన్నివేశం. శ్రీజాషువా కవిగారికి నామీద, గల అభిమానం మరువరానిది. ఆ రోజులలో జాషువా గారికి నాకు నరసాపురంలో జరిగిన సన్మానం చూచిన ప్రత్యక్ష సాక్షులు కొందరు నేటికి సజీవులై యున్నారు. ఆ విషయం పునః పునః స్మరించి జాషువా సారస్వతసంఘం ఏతత్ సూత్రధారి శ్రీ థియోడరు గారు నాకు 1989 లో అనుకుంటాను నరసాపురంలో సముచిత సన్మానం చేశారు. ఢిల్లీ కేంద్ర సాహిత్య అకాడమీ వారు ప్రచురించిన సమకాల భారతీయ సాహిత్యం అనే ఆంగ్ల గ్రంథంలో

ఆధునిక తెలుగు సాహిత్యంపై వ్రాసిన ఆంగ్ల వ్యాసంలో శ్రీ కోలవెన్ను రామకోటేశ్వరరావుగారు వ్రాసిన వాక్యాలు. (1955) "ఈ మధ్య ఒక సరికొత్త ఉద్యమం ఉద్భవించినది ఆంధ్ర సాహితీ జగత్తులో నూతన సనాతన తత్వం. అయితే నూతన సనాతన వాదులు - నండూరి కృష్ణమాచార్య, జంధ్యాల పాపయ్యశాస్త్రి జాషువా ప్రభృతులు క్రొత్త ఉద్యమం వెల్లివిరియ చేశారు. "సంఘర్షణ" బదులుగా "సామరస్యం" వీరి లక్ష్యం. "సత్యం - సుందరం" ధ్యేయాలకు పునర్వికాస దోహదం కల్పించాలని నూతన సనాతనుల తహతహ. వాస్త వికతను ఆదర్శ పరాణయత్వమునకు పంచభౌతిక ప్రపంచానికి అధ్యాత్మిక జగత్తునకు మధ్య సామరస్య హేతువు నిర్మించుట నూతన సనాతనవాదుల అభీష్టం."

శ్రీ గుర్రం జాషువా శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి ఎన్నెన్నో ఖండకావ్యాలు - వ్రాశారు. "క్రొత్త పాతల మేలికలయిక" నూతన సనాతన వాదుల ప్రత్యేక లక్ష్యం. అసలు ఆ ధ్యేయం శ్రీగురుజాడ అప్పారావు గారిదే అనేమాట మరువరానిది. నా **'తారా తోరణము'**నకు కట్టమంచి రామలింగారెడ్డి పీఠిక శీర్షిక - **క్రొత్త పాతల మేలి కలయిక** అసలు కవిత కేవలం సనాతనము మాత్రమే గాక నిత్య నూతనము."

"పురాణ మిత్యేవ న సాధు సర్వం - న చాపి కావ్యం నవ మిత్యవద్యం " అన్న కాళిదాసు మహాకవి నిత్యనూతన సనాతనుడే.

> " ప్రాత దయిన దెల్ల - బంగారమా ? కాదు;"
> క్రొత్త దైన దెల్ల చెత్త కాదు?"

వివేకులు రెంటిని సమీక్షించి - మంచిని ఎంచుకో గలరు గదా.
కేవల నూతనత్వం - పునాదులు లేని మేడ;
కేవలం ప్రాతదనం మేడ కాన రాని పునాది.
"గట్టి పునాది గల - మేడ " సామరస్యవాదుల ధ్యేయం.

## సత్యం – శివం – సుందరం

నా జీవితంలో – అటు శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి = కరుణశ్రీ, ఇటు " శ్రీ పాలగుమ్మి పద్మరాజుగారు. "పాప" ఉండేవారు. ఆదర్శవాది కరుణశ్రీ. పాలగుమ్మి వాస్తవిక వాది పాలగుమ్మ పద్మరాజు నేను ఆయన సంయుక్త సంపాదకులం –: "మహాంధ్ర" :– మాస పత్రికకు. కొంతకాలము ఉభయుల వ్యక్తిత్వ ప్రభావం – నాహృదయంలో సంగమించాయి. అంతర్వాహినిగా స్వకీయ సరస్వతి ఉండనే ఉంది. విధంగా నా వాఙ్మయ వ్యక్తిత్వం ఒక ఆధునిక ప్రయాగ – త్రివేణీ సంగమమైనది. నాకు బుద్ధభగవానునిపై మార్క్సు మనీషిపై గౌరవ భావం ఉన్నది. గ్రుడ్డి నమ్మకమును నేను నిరసిస్తాను. "నమ్మకము లేదు నాకు నమ్మకము పై "

మార్క్సు మాట యైన – మహమ్మూదు పలుకైన !

వేద మైన – శాస్త్ర వాద మైన;

మార్పు చెంద వలయు – మనుజు లుండెడి చోట;

ప్రగతి కొరకు – నూత్న జగతి కొరకు.

"ఆలోచనము"లు అభిప్రాయములు కావు. స్వేచ్ఛ జిందాబాద్".

నే నే విశ్వాసములును
లేని – స్వతంత్ర సహృదయుడ – లీలా విలస
న్మానవ మాత్రుడ – బ్రదుకున
నా నాలోచనలు మెరయు – నాలో – సతమున్ .

నేను వ్రాసిన నృత్య నాటికలు

–: గోదావరి :– :– శ్రమ ఏవ జయతే –:

నట్టువాంగం నిర్వహించిన నర్తకీ మణి శ్రీమతి శ్రీ లక్ష్మిమోహన్. శ్రీ ధారా కృష్ణ మోహన్ సతీమణి. 'శ్రమ ఏవ జయతే' కూచిపూడి బృందంవారు కూడా ప్రదర్శించారు. నేను ఏబదేండ్ల క్రితం వ్రాసిన రంగ స్థల నాటకం "ఛత్రపతి శివాజీ " సంస్కార భారతివారు పలుసారులు ప్రదర్శించారు. తథా శ్రీకృష్ణ దేవరాయలు నాటక ప్రదర్శనలు. సంస్కార భారతి వారు నాకు సన్మానం చేశారు రవీంద్ర భారతిలో.

నర్తకీ మణి శ్రీమతి లక్ష్మీమోహన్ నాకు దోహదం కల్పించింది నృత్యనాటికా రచనలో. సాహితీ జీవితంలో నేను – " ఆట వెలది" ని స్వీకరించినాను. నిజ జీవితంలో గూడ – ఆట వెలది=నర్తకీ మణి సాక్షాత్కరించి, నా నృత్య నాటికలు హృదయంగమంగా ప్రదర్శింపజేసినది.

నేను వ్రాసిన "నృత్య సరస్వతి" లోని పలుకుల చెలి" పాట పలుమారులు – పాడి – ఆమె నాకు వినిపించి సంతోషింప చేసినది. ఆమె భర్త శ్రీ కృష్ణమోహన్ ఆజానుబాహువు. అందగాడు. అతనికి నా ఆంగ్ల మహాభారతం అంటే మిక్కిలి ప్రీతి. "శ్రమ ఏవ జయతే" లోని – "పని చేయుటయే యజ్ఞము – పని చేయుటయే ప్రార్థన" అనే పాట అతనికి చాలా ఇష్టం. కళా పిపాసువు లైన ఆ దంపతులు నా పై చూపిన ఆదరాభిమానాలు మరువ లేనివి.

## –: ఆంధ్ర పద్య కవితా సదస్సు:–

నిజామాబాదు విశ్వ సాహితీ సభలలో నన్ను "సంప్రదాయ సాహితీ సభాపతిగా" కూర్చోబెట్టినారు. డాక్టరు పోతుకూరి సాంబశివరావుగారు రెండు దశాబ్దుల క్రితం. కారణం నేను ఛందో బద్ధమైన పద్య కవితలు వ్రాయటం కావచ్చు. అయితే నేను కేవలం సంప్రదాయ వాదిని కాను. ఆనాడు సభలో నేను చదివి వినిపించిన పద్యాలు మినీ కవితారాధకులు పలువురు. మెచ్చుకున్నారు.

–: క్రొత్త దనమును కనలేక కుమిలి క్రుంగి
ప్రసవ వేదన పడుచుండు, ప్రాతదనము;
విశ్వ విప్లవ ప్రస్థాన వేధ నుండి,
ఉద్భవించుత నూత్న యుగోదయమ్ము. అంతే గాక

"ప్రగతిగీత" లో ఆలోచనములో నేను వ్రాసిన పద్యాలు అధునాతన భావతరంగిణులు.

"ఎంత మంది చెమట ? ఎందరి నెత్తురు ?
పేర్చ కుండ ఎవడు పేర్చె ధనము ??
దొరలు చేసి నట్టి దోపిడీయే – ఆస్తి ;
అంతరింప వలయు – ఆస్తి హక్కు"

ఆధునిక సాహితీ ప్రియంభావుకులు హేతువాదులు ఎందరో మెచ్చు కున్నారు.

నేను కోరుకునేది – సంప్రదాయ పునరుద్ధరణ కాదు. నా లక్ష్యం **"కొత్త పాతల మేలు కలయిక"**. నేను ఎన్నో గేయాలు వ్రాశాను. అయితే నా రచనలో అధిక సంఖ్య పద్య కవితలే. అందులో సుమారు నాలుగు వేల సంఖ్య పై బడి "ఆట వెలది" పద్యాలు ఉన్నవి. పద్య కవిత యతి ప్రాసలు గణాలలో కష్టం అనే అభిప్రాయ ఉన్నది. అది సరి కాదు.

**పరుగు లెత్తు – రైలు – పట్టాలపై వేగ,**
**చూడ – పద్య విద్య – సులువు సుమ్ము;**
**గగన యాత్ర – వచన కవనమ్ము – కష్టమ్ము;**
**గొప్ప గేయ కవిత – ఘోర తపము.**

గేయ కవితకు వాద్య బృంద సహకారం కావాలి. రాగ తాళ బంధురం అంత్యాను ప్రాపం అనసరం.

పద్య కవిత – ఏకైక నిష్ఠ. రాగం. స్వేచ్ఛ యాదృచ్ఛికం –

ఆ విధంగా స్వేచ్ఛా సౌలభ్యాలను పద్య కవి ఆరాధించవచ్చు కంఠస్థం చేయటం సులువు. మిక్కిలి సులభం.

నన్ను సంప్రదాయ సాహితీ సభాపతి చేసిన వారు ఉన్నారు.

**"విప్లవ కవి"** అన్న పణీంద్ర ఉన్నాడు. సాహితీ ప్రియంభావుకులలో – గడియారం లోని లోలకమును నేను. ఉయ్యాలనే. స్థావర పుష్ప శయ్యను కాను.

నా జీవితంలో నాకు దేని యెడ ఏకాంత భక్తి లేదు.

**"నిండి యుండు జగతి ఖండ సత్యాలతో !**
**పూర్ణ సత్య మేది పుడమి లేదు".**

నేను సదా సమన్వయ వాదిని. హృదయాంతరాళంలో వ్యాస మహర్షికి – తిక్కనకు – కబీరుకు వెన్నెల దేవళం కట్టు కున్న వాడను.

మెదడు లోన మార్క్సు - హృది లోన బుద్ధుడై;
విప్లవమ్ము - కరుణ వింగడించి,
పుట్టు గాక - "సుకవి" - భువనైక పౌరుడై!
ప్రగతి కొరకు - నూత్న జగతి కొరకు.

విజయవాడ వార్షిక సభలో నన్ను రాష్ట్రస్థాయి ఆంధ్ర పద్య కవితా సదస్సుకు అధ్యక్షునిగ ఎన్నుకున్నారు. 1993 విజయవాడ సభలలో పద్య పఠనం బహుమతులు. అయిదు వేల రూపాయల నగదు బహుమతులను నేనే సమకూర్చాను. "కవులకు - బహుమతులు పంచటం ముఖ్యం. పద్య పఠితలకు గాయకులకు అగ్రస్థానం ఏమిటి ?" అనే విమర్శ విసురు వచ్చింది. పద్య పఠన బహుమతులు చేకూర్చు బాధ్యత నాపై ఆనాడు వేశారు. నా కర్తవ్యం నిర్వహించినాను. అంతే.

తదుపరి **ఆంధ్ర పద్య కవితా సదస్సు** జంట నగరాలలో జరిగినది. 1996 మే నెలలో మూడు రోజులు. సభలు - జగజ్జేగీయమానంగా జరిగినవి. ఇరువది మూడు జిల్లాల నుండి ప్రతినిధులు వచ్చారు. కొందరు అభ్యాగతులు. ఈ సారి కవులకు గూడా, బహుమతులు ఇచ్చాము. "స్వ హస్తం వా - పర హస్తం" వా ఆర్థిక బాధ్యత - నా మీదనే పడింది. తెలుగు విశ్వ విద్యాలయం వారు సహకరించారు. " రసమయి" సహకారం - ముఖ్యంగా ఏతధి నేత శ్రీ రాముగారు అందించిన సహకారం చిరస్మరణీయం. సదస్సు సభల నిర్వహించి నా జన్మ ధన్య మైనట్లు ఆనందించాను.

మరల నన్ను అధ్యక్షునిగా - శ్రీ శిష్టా వేంకట్రావు గారిని కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

వివరములు అన్నీ ఆంధ్ర కవితా సదస్సు సావనీరు సంచికలో చూడవచ్చు.

-: సత్యం కంప్యూటర్సు :-

విశ్వ విజ్ఞాన చరిత్రలో ఇది "కంప్యూటరు యుగం " సత్యం కంప్యూటర్సు" విశ్వ విఖ్యాతిని ఆర్జించిన అదునాతన భారతీయ సంస్థ ఈ సంస్థ. నిర్మాత మేధావులలో మేరు శిఖరి - బహు ముఖ ప్రతిభా శాలి - శ్రీ బి. రామ లింగ రాజు గారు.

"పుట్టెను రాచ బిడ్డయయి భూమి ప్రదక్షిణ చేసి వచ్చె - చే
పట్టిన వృత్తి కీర్తి - ప్రతిభా సుషమా పరివేష దీధుతుల్
చుట్టె శిరాన - సత్య శివ సుందర శోభలు - రామ లింగ స
మ్రాట్టు వెలుంగు గాత - శుభ మంగళ తేజముతో - చరిత్రలో.

శ్రీ రామ లింగ రాజు - ప్రఖ్యాత మేధావి;
అమెరికాకు ప్రాకె అతని ప్రతిభ;
ఇంటి కోట బురుజు విల్లాలి పున్నెముల్ !
చిరుత నందన వని పెరట కలదు.

ఆలోచనము" కావ్యం అవతారిక నుండి -

అసలు ఆది మూల కేదారం శ్రీ రామలింగరాజు తండ్రి గారయిన శ్రీ బైర్రాజు సత్య నారాయణ రాజు గారు.

శ్రీ వారు స్వకీయ ప్రతిభతో పైకి వచ్చారు.

ఒక సువిశాల సామ్రాజ్యం - పలు శాఖలలో నిర్మించినారు.

వీరు " సత్యం" పరిశ్రమలకు అధ్యక్షులు. వీరి హస్తవాసి గొప్ప మహిమ గలది. వీరు " సజీవ పరుస వేది".

దేశదేశాంతరాలలో దేదీప్యమానంగా తెలుగు బావుటాను భారతీయ ప్రతిభా ద్వజమును ఎగుర వేయుచున్న శ్రీ రామలింగ రాజుగారి జనకుడు శ్రీ సత్యనారాయణ రాజు గారికి **" ముత్యాల గొడుగు"** పద్య కావ్యం అంకితం.

ఈ కావ్యం లోని ప్రతి పద్యం ఒక "ముక్తకమే" అలంకారికంగా. నేను - ప్రౌఢ నిర్భర వయః పరిపాకంలో వ్రాసినదీ ముత్యాల గొడుగు. విశ్వ సాహితీ

జగత్తులో తెలుగు – ఆణి ముత్యాల గొడుగు అగుగాక . ఒక సారి చాలనాళ్ల క్రితం – విశ్వకవి రవీంద్రుని శాంతి నికేతన్ ఆశ్రమముకు సందర్శించినాను. ఆంధ్ర కవి కుమార బృంద నాయక పాత్ర ధరించి – విశ్వకవి – స్వాగత సూక్తంలో "ఆంధ్రులు విశ్వ సాహితీ జగత్తులో గొప్ప కవితా మార్గ దర్శకులు మౌక్తిక ఛత్ర ధారులు. హాలుడు సారస్వత మౌక్తిక ఛత్రపతి. హాల చక్రవర్తి సంతరించిన గాథా సప్తశతి విశ్వ సాహితీ జగత్తులో ఏకైక ప్రప్రథమ విశ్వవిశాల మౌక్తిక ఛత్రం. ప్రాఙ్నన్నయ యుగాలలో ఆంధ్రులు పఠించిన కావ్యాలు – "కాసట బీసటలు = గాథాసప్తశతి బృహత్కథ అన్న ఎఱ్ఱన మాటలు నా గుండెలో గూడు కట్టుకున్నవి. సాహితీ సమాధిని సమకూర్చు కున్నవి. ఒక అర్ధ శతాబ్ది నుండి. ఏతత్ ఫలితమే నా యీ **-: ముత్యాల గొడుగు :-** సంస్కృతంలో చెప్పితే **"మౌక్తిక ఛత్రం".**

"ముత్యాల గొడుగు " కృతి పతిని శ్రీ బైర్రాజు సత్యనారాయణరాజు గారిని చేకూర్చినది శ్రీ మంతెన వేంకట సూర్య నారాయణ రాజు గారు. ఆయన కృతికర్త. కృతి భర్త – ఈ సాహితీ కళ్యాణ సంధాత. ముత్యాల గొడుగు కృతిపతి శ్రీ బైర్రాజు సత్య నారాయణ రాజు గారికి వరుసకు " బావ" గారు.

" కవితా సంహిత కావ్య కృతిపతి శ్రీ సూరయమామ కవిగారు – కృతిపతి సత్యం గారి పుత్ర రత్నము రామ లింగ రాజు గారిపై వ్రాసిన పద్యాలు ఈ గ్రంథంలో – పుటాంతరములలో ప్రచురితములు.

శ్రీ మంతెన వేంకట సూర్యనారాయణ రాజు రాజకవి. కవి రాజు. ఆ పాదమస్తకము కవి. తర తరాల కృతభర్తల ప్రాతినిధ్యం వహించే సజీవ సహృదయ సమాహార సారస్వత పతాకం !!

ఈ కృతి **"ముత్యాల గొడుగు"** కు కృతిపతియై ముద్రాపకులై " సత్యం దొర గారికి" నా ఆశీరభినందనలు. జే జేలు.

**-: ముత్యాల గొడుగు :-** లోనివి అన్నీ చాటు పద్యములే. హృదయము నుండి పెల్లుబికి పైకి చిమ్మిన ఊట నీటి పోటు పొంగులే. సాహితీ స్వయంభువ సాక్షాత్కారములే.

సూక్ష్మ దర్శన పటు సుషమా నిదిధ్యాన, గొప్ప సూక్తి హృదికి కూర్చ గలదు;

**చాటు పద్య కవిత " సచ్చి దానందమే" !!**
**రస విరాట్టు నృత్య రంగ శాల.**
**ఒక తటిత్ ప్రభాస – ఒక చమత్ విక్రాంతి**
**ప్రతిభ కూర్చు నట్టి – రస సమాధి**

**కవిత నుయ్యి కాదు – కాదొక్క సెలయేరు !**
**కవిత – పూవు టమ్ము కాదు కాదు;**
**నేల నాభి వెదలి – నింగి చుక్కలు దాకు**
**ఊట నీటి సూటి పోటు కవిత.**

జీవితంలో వృద్ధాప్యం దుర్భర మని అంటారు. నా వయస్సు 79 సంవత్సరాలు. నిత్యం పద్యాలు వ్రాయుచున్నాను. ఈ మధ్య ఆచార్య ఫణీంద్ర – నాకు తన కావ్యం **"పద్యప్రసూనాలు"** అంకితం చేశారు. ఫణీంద్ర తెలుగు పద్యం చిరంజీవి – అని నిరూపించిన కవి. తథా డాక్టరు. డి.వి. ఆర్.కె. ప్రసాద్ నాకు తన కావ్యం **"రస బుక్కలు"** అంకితం చేశారు. అందలి కవితలు మెరపు తీగెలు – భూకంపాలు. "వాక్యం రసాత్మకం కావ్యం" పలువురకు ఆమోదం కలిగించే కవితా నిర్వచనం. డాక్టరు ప్రసాద్ రస బుక్కలో చదివిన సహృదయుడు – అభినవ కవితా నిర్వచనం **"ఏకైక పదమేవ రసాత్మకం కావ్యం"** అన వచ్చు.

నా ఆరోగ్యం బాగా ఉన్నది. శిష్యులే గాక వైద్య శిఖామణులు నాకు షోడశాధికోపచారాలు అందించుచున్నారు. డాక్టరు రఘురామి రెడ్డి – ఉస్మానియా వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపలు – అగ్రగణ్య మేధావి. రోగుల పాలిట కల్ప లత అరవింద వైద్య సత్రశాల అధినేత డాక్టరు లక్ష్మీ నారాయణ శర్మ, దంత వైద్య నిపుణుడు – స్వతంత్ర సాహితీ ప్రియంభావుకుడు డాక్టరు తేజేశ్వ రావు. – నాకు శిష్య నిర్విశేషులు. ఉదార హృదయులు.

శ్రీ వెనిగెళ్ల రాంబాబు కవి - అదునిక శతఘంట కవి - ప్రభృతులు నాకు పుత్ర నిర్విశేషులు. ప్రత్యేకంగా పేర్కొన దగిన ప్రతిభాశాలి - ఆంధ్ర తుంబురుడు గజలు శ్రీనివాసు. సంగీత సాహితీ జంగమ సజీవ గంగా యమునా సంగమం ! ప్రస్తుతం నేను వార్ధక విజేతను. నా యావజ్జీవితం తెలుగు తల్లికి అంకితం చేశాన అరువది సంవత్సరాల నుండి నా మెడలో పూల దండలు పడుచున్నవి.

**-: కోరి పూల దండ కొరకె - సర్వస్వమ్ము;**
**పణము పెట్టినాను బ్రదుకు లోన !**
**మెడకు పూల దండ పడక - వారము చాలు;**
**గడవ - చుట్టు ముట్టు ఎడద - బెంగ.**

ఆచార్య శ్రీ బేతవోలు రామ బ్రహ్మంగారు ఆంధ్ర భూమి వార పత్రికలో నన్ను గూర్చి "గొప్ప గురువుల శిష్యుడు. గొప్ప శిష్యలకు గురువు" అని ఛలోక్తి విసిరినారు. ఆవాక్యం నా జీవిత చరిత్ర సంగ్రహం.

నేటికి కూడ వయోవృద్ధులైన సత్కవీశ్వరులు

శిష్య శేఖరులు శ్రీ మంతెన సూర్యనారాయణరాజుగారి వంటి వారు "తవ యోగ క్షేమం వహామ్యహం" అంటు చేరుచున్నారు శ్రీ ఏకాంబరాచార్యులవారు మూర్తీభవించిన పద్య కవిత. **"పొట్ట గాదది పద్యాల పుట్ట గాని"** సమగ్ర సాహితీమూర్తి శ్రీ పిచ్చయ్యగారు, పరిపక్వ కవితా శిల్ప సౌష్ఠవ మూర్తి ఆచార్య వి.యల్. యస్ భీమశంకరం, **"కవితా ప్రభాస"** గరుకుల సంఘ సభ్యులే.

జీవితంలో సంపూర్ణ సంతృప్తి చెందిన వాడను నేను.

**వెన్నెల సిరి గాను ! వేల్పు విల్లును గాను;**
**వేణు రవళి గాను ! వీణ గాను !**
**కలికి చేత బట్టు ఖడ్గమ్మునా ! కాను;**
**గుండె తాల్చు - పూల దండ నేను.**

## -: గురు దక్షిణ :-

సూక్తి రమ్యతకు
భావ మాధుర్యానికి,
సురుచిర హాస్యానికి,
మారు పేరు - మా గురుదేవులు డా॥ నండూరి వారు ;

ఈ త్రివేణీ సంగమంలో
తడిసి ముద్దవుతున్న రసజ్ఞులు
తెలుగు దేశ మంతటా సాక్షాత్కరిస్తారు.
వీరి పద్యాలను
తమ ఉపన్యాస విన్యాసాలలో,
ఉదాహరించే మహా వక్తలు,

తమ వ్యాసాలకు
ఇతోధిక దీప్తి కలిగించుకోవటం కోసం
ఉటంకించే విమర్శకులు;
అనేకానేకులు -

ఏది గొప్ప పద్య మనటానికి
ఎంద రెన్ని నిర్వచనాలు చెప్పినా -
ఒక్క మారు పద్యం వినగానే
సహృదయునకు కంఠస్థ మయ్యేది,

శ్రోతల్ని ఏక సంథా గ్రాహులుగా మార్చేది,
ఇది నిర్ద్వంద్వ సత్యం.

అందుకే – చదవటం తోనే
పఠిత మానసిక ఫలకంపై చెరగని ముద్ర వేసి
ధారణలో నిల్చిపోగల కొన్ని పద్యాలు
ఈ సంకలనం ద్వారా మీ కందిస్తున్నాము.
మా దేశిక సార్వభౌములకు
రత్నాలు రాళ్ళు మాణిక్యాలు మసి బొగ్గులు సమం !!
వారికి మే మీయగలము? అందుకే,
ఈ అక్షర " గురు దక్షిణ " సమర్పించుకుంటూ
అంజలి సంఘటిస్తున్నాము.

– ఆశావాది ప్రకాశరావు

నందూరి శిష్య సమితి – ప్రతినిధిగా.

## గురు స్తవము

తన కంచంబున భోజనం బొసగె వాత్సల్యంబు, ఆదర్శ వ
ర్తనయుం దోపగ నాకు – నే నతిథినై రాగా, అదే కంచ మం
దున మర్నాడు భుజించె తాను " గురు" వెంతో చెల్మితో – నాదు ప్ర
క్కన కూర్చుండి విశాల విశ్వ మయ సంస్కారంబు కాంతిల్లగన్.

– షేక్ మహబూబ్ బాషా కవి

## గురు దక్షిణ

– ఆచార్య ఫణీంద్ర

శ్రీ నందూరి కులైక భూషణుడు– నిశ్శేషాంధ్ర సాహిత్య సు
జ్ఞానానంద మయుండు – స్వచ్ఛ మగు బంగారంపు పద్యంబులన్
నానా రీతుల కావ్య భూషలుగ తా నందించి ఆంధ్రాంబకున్,
ఈ నాడందెను రాష్ట్ర పద్య ఘన సంస్థేశుండుగా మన్ననల్.

'రామ కృష్ణమాచార్య' సన్నామధేయు
డెపుడొ, ఏబదేడుల నుండి ఏకధాటి,
పద్య కవితలన్ సృజియించి పండిపోయె !
మహిని పద్యమ్మున కతండు మారు పేరు.

కువలయమున నున్న కుటిల నీతిని ఎత్తి ;
కుండ బ్రద్ద లట్లు కొట్టి చూపి,
అభ్యుదయ పథమ్ము "నాలోచనము" పేర,
వెలయ జేసినట్టి "విప్లవ కవి" !

అతుల కవీశ్వరుండు – కవితాంబకు ముద్దుల పట్టి – పండిత
స్తుత ఘన సాహితీ కుసుమ శోభన వాటిక యందు మేటి క
ల్ప తరువు – మాధురీ రసమపారము నిండిన పద్య శిల్పముల్
శతములు చెక్కుచున్, పలుకు శాసనమౌ "గురు దేవు" మ్రొక్కెదన్.

# - :"గురు పూజా మహోత్సవం" :-

నందూరి రామ కృష్ణమాచార్య రచించిన **"అలోచనము"** గ్రంథావిష్కరణ సభా కార్యక్రమంపై - సమీక్ష

**- ఆచార్య ఫణీంద్ర**

ఆంధ్ర పద్య కవితా సదస్సు రాష్ట్ర స్థాయి అధ్యక్షుల డా॥ నందూరి రామ కృష్ణమచార్యులు గారు రచించిన బృహత్కావ్యం - " ఆలోచనము" గ్రంథావిష్కరణ సభ శ్రీవారి శిష్యాగ్రగణ్యులు బృహత్ ద్విసహస్రావధాని డా॥ మాడుగుల నాగ ఫణి శర్మ గారి అధ్యక్షతన, రామ కృష్ణమాచార్యుల వారికి వారి శిష్యులు చేసిన గురుపూజా మహోత్సవ సభగా భాసిల్లినది . ఆనాడు 31-12-98 గురు పూర్ణిమ కూడ కావడం విశేషం. హైదరాబాదు లోని సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లే త్యాగరాయ గాన సభలో జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జ్ఞాన పీఠ పురస్కృత మహాకవి డా॥ సి. నారాయణ రెడ్డిగారు గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఎన్నో అధునాతనాంశాలను ఆట వెలదులలో అత్యంత రమణీయంగా ప్రస్తావించిన ఆచార్యుల వారు అభినందనీయులని ప్రశంసించారు. "శీర్షమేఖల" రామకృష్ణమాచార్యులుగా సుపరిచితులైన కవి కలంనుండి కల ఈ కావ్యం వెలువడిందంటే ఆశ్చర్యంగా ఉందన్నారు.

ఉందు - నిజము - దాగి - ఒంటి స్తంభము మేడ !
చేర ఏది కాని - దారి లేదు !
ఎగిరి వ్రాల - మెదడు హృదిని రెక్కలు చేసి ;
కాలి అడుగు జాడ కాన రాదు.

వంటి పద్యాలను ఉదాహరిస్తూ ఆచార్యుల వారు వచన కవితలో కూడ సాధించలేని ఆధునికతను, పద్యంలో సాధించారని కీర్తించారు.

సభాధ్యక్షులు డా॥ మాడుగుల నాగఫణి శర్మగారు మాట్లాడుతూ ఆచార్యుల వారు ఏనాడో లబ్ధప్రతిష్ఠులని, వారికి ఈ సభా కార్యక్రమం వలన క్రొత్తగా ఒకగూడేదేమి లేదని, అయితే తమ గురుదేవులను సత్కరించుకోవడానికి తమతో బాటు శిష్యు లందరికి ఇది ఒక సువర్ణావకాశంగా భావిస్తున్నామన్నారు. డా॥ నాగఫణి శర్మగారు ఆచార్యుల వారిని, వారి సతీమణి శ్రీమతి సుబద్రగారిని స్వర్ణ కంకణంతో, పట్టు వస్త్రాలతో సత్కరించారు. ఈ సభలో విశిష్ట అతిథిగా వాణిజ్య ప్రముఖులు శ్రీ గంజి రాజ మౌళి గుప్త గారు పాల్గొన్నారు.

కావ్య పరిచయం చేసిన సుప్రసిద్ధ కవి డా॥ ఆచార్య తిరుమల గారు " "ఆలోచనము " పేర వెలసిన ఈ కావ్యంలో ప్రతి పద్యం ఎంతో ఆలోచింప జేసేదిగా లోకోక్తి ప్రాయంగా ఉందని అన్నారు.

**ఏను తరచు మార్చి నాను – ఉద్యోగముల్,**
**ఊళ్లు, ఇళ్ళు , కార్లు, కళ్ల జోళ్ళు;**
**మార్చి నాడ నన్ని – మా శ్రీమతిని తప్ప,**
**మధుర కవిత మీది మమత – తప్ప!**

**"లేదు దేవు డనెడు వాడెచ్చటను లేదు–"**
**అనుచు నొక్కి పలికె – నాస్తికుండు!**
**"లేదు ధరణి మీద – లేదుగా కంసాలి"**
**పసిడి ఉంగరమ్ము బదులు పలికె –**

వంటి పదాల లోని హాస్య వ్యంగ్య చమత్కృతిని వివరించి సభను అలరించారు.

" చాల నాళ్ళ బ్రదుకు సమకూర్చెగా నాకు;
పెక్కు అనుభవాలు – విలువ గలవి !
జగతి కిచ్చినాడ – చక్ర వడ్డీ చేర్చి,
పద్య రూప మందు – భద్ర పరచి "

అని ఆచార్యుల వారు చెప్పినది అక్షర సత్యమని, ఆలోచనము' కావ్యం ఒక పరిపూర్ణ జీవితానుభవ సార మని కొనియాడారు.

సభలో ఆచార్యుల వారి శిష్యు లెందరో రాష్ట్రం నలుమూలల నుండి విచ్చేసి, ఆచార్యుల వారిని వస్త్రాలతో పుష్ప మాలలతో సత్కరించడమే కాక - పంచ రత్నాలతో, పద్య పుష్పాలతో అక్షరాంజలి ఘటించారు. డా॥ వి.యల్. ఎస్. భీమశంకరం గారు డా॥ మంతెన సూర్యనారాయణరాజు గారు ఢా॥ రఘురామ రెడ్డిగారు, శ్రీ ఏకాంబరాచార్యగారు, డా॥ తేజేశ్వరరావు గారు, డా॥ రాధశ్రీ గారు తదితర ప్రముఖులంతా ఈ శిష్యగణంలో ఉన్నారు. ఈ సభకు శ్రీ వెనిగెళ్ళ రాంబాబు గారు ఆశు కవితా స్వాగతం పలికారు. సభాకార్యక్రమానికి ముందు ప్రముఖ గాయకుడు శ్రీ అమలాపురం కన్నారావు గారు 'ఆలోచనము' గ్రంథం లోని కొన్ని పద్యములను పాటలను అత్యంత కమనీయంగా గానం చేసి అలరించారు.

ఆచార్యుల వారు 'ఆలోచనము' గ్రంథంలో వేమన పరిధి దాటి, ఎన్నో అధునాతనాంశాలను స్పృశించి, అత్యంత రమణీయ పద్య రచన కావించారు. "ఆట వెలది" కి అందాన్ని ఔన్నత్యాన్ని సమకూర్చినది వేమన తరువాత ఆచార్యుల వారే అని చెప్పక తప్పదు. రాబోవు శతాబ్దిలో ఆచార్యుల వారి పద్యాలు నిత్యజీవితంలో అడుగడుగునా ఉదాహరించుకొనే ప్రయోజనాత్మక పద్య విహంగాలుగా రెక్కలు విచ్చి ఎగురుతాయని నా నిశ్చితాభిప్రాయం. ఈ సభకు ఆచార్యుల వారి ప్రియ శిష్యుడనైన నేను సమావేశకర్తగా వ్యవహరించే భాగ్యం కలుగడం నా పూర్వ జన్మ సుకృత ఫలంగా భావిస్తాను.

**About the Author :- Dr. Nanduri. V. Rama Krishnnamacharya**

Extract from " **Contemporary Indian Literature"**

Published by the

SAHITYA AKADEMI - NEW DELHI

**THE NEO - CLASSICISTS:**

With in recent years, one notices the beginning of a new movement, the return to classicism. If the Leftists and Surrealists rebelled against the romanticism of the earlier decades of this century, the Neo - Classicists like NANDURI KRISHNAMACHARYULU, Jandhyala Papayya Sastry and G. Jashua are questioning the value of the Surrealism of the years from 1935. Harmony, instead of strife , is their ideal. In the post - war world, an equilibrium. has to be achieved between matter and spirit, between idealism and realism. the **NEO - CLASSICISTS** are anxious to regain for poetry its dignity as ths symbol of all that is beautiful and true.

---

*" Dr. Krishnamacharya is a future tense amongst the modern poets. Telugu literature will reserve a coveted place for him amongst the galaxy of the illustrious poets of Andhra."*

**Prof. G. J. SOMAYAJI** From - Preface to "PRAGATI GEETA".

---

Dr. Krishnamacharya's style is a confluence of the old and new, the best blending of the literary out -looks of the East and the west.

**C.R. Reddy**

---

# Tribute to - Literary Power House -

An eminent poet, a respected professor, an erudite scholar and a powerful orator, all in one- that's Dr. Nanduri Venkata Rama Krishnamacharya. He strode the Telugu literary scene like a colossus for around five decades. He writes, and writes in English too. At seventy plus, even today he wields the pen with aplomb.

**Dr. P. L. N. Rao**

# -: అంకితం :-

## శ్రీ శ్రీ శ్రీ బైర్రాజు సత్య నారాయణ రాజు గారికి

అంకితమ్ము నిచ్చు - ఆచార పరిపాటి
ఆంధ్ర వాఙ్మయమ్ము నందు కలదు;
సహృదయత తెలిపెడి - సత్ సంప్రదాయమ్ము
కూర్చు - కృతిపతి బ్రతుకునకు - తావి.

సత్యము చేతనే ప్రగతి సాధ్యము - సర్వ జగత్తులో సదా
నిత్యము - సత్యమే శుభము - నిల్చు - ప్రపంచ పురోభివృద్ధియున్
సత్యము చేతనే గతు లజస్రము తప్పరు సూర్య చంద్రులున్;
సత్య మటన్న శబ్దము యశస్కరమై పొలు పొందు సర్వదా .

రాజ కులము నందు తేజస్వి - మేధావి,
లలిత చాకచక్య లాలితుండు,
బైరరాజు సత్య నారాయణుడు రాజు,
కొడుకులకును గూర్చె - గొప్పతనము.

మెచ్చెనా ! ఆతండు మిన్నేటి కెరటాల
అభిషేక మొనరించి ఆదరించు !
ఈసడించిన వేళ - ఎంత వానిని గాని,
పాతాళ సీమలో పడగ ద్రోయు,
చేసెనా ! స్నేహమ్ము - జీవితాంతము మేర,
ప్రాణాల నర్పించి రక్ష సేయు!
శత్రువే అయినచో - సార్వభౌముని నైన,
వెన్ను చూపక పోరు - వీరు డగుచు !

ఉక్కు గుండె లున్న - ఉద్దండ పిండమ్ము;
డాండ డడ డడాండ దండి మగడు,
సత్యము దొర - అనిన - శార్దూల సదృశుండు;
మారు పేరు విజయ వీరమునకు.

సత్యము దొర గారు సమకాల జగతిలో,
కార్య శూరు డంచు, గణన గాంచె,
విశ్వ విజయ వీర విక్రమాదిత్యుడై,
తెలుగు వెలుగునకు - ప్రతీక యయ్యె.

'కర్మ యోగి' అతడు - కార్యశూరుల మిన్న;
పట్ట - మట్టి యైన - పసిడి యగును;
నర వరుండు - సత్య నారాయణుడు - రాజు,
పడిన అతని నీడ - ప్రజ్ఞ పెరుగు.

జీవితమ్ము లోన - దైవమ్ము తోడౌను,
మంచి మనసు గలుగు మానవులకు;
సత్యము దొర గాంచె - సంతతాభ్యుదయమ్ము;
మంచి తనము గలిగి మసలు కతన.

చదువ గలడు - ఎదిరి హృదయాల వేవేగ;
కా డతండు పుస్తకాల పురుగు;
లోక యాత్ర లోన - పేకాటలో కూడ,
చెక్కు చెదర నట్టి - ఉక్కు మనిషి.

అతడు సంతతము - స్వయం ప్రజ్ఞ చేతనే,
ప్రగతి గాంచ గలిగె - బ్రదుకు నందు,
అతడు "కర్మ యోగి" - ఆలోచనా శాలి,
సాహసమ్మువలన జయము గాంచె.

స్నేహిత ధీరో దాత్తుడు,
సాహస వీరుడు - మనీషి - సత్యం దొరయే !
ఐహిక విజయుడు - సద్యో
దోహద కరుడై - ప్రజ కిడు తుష్టిన్ పుష్టిన్.

లాస్య మాడు చుండు - లక్ష్మి సరస్వతుల్,
ఎవని ఇంటిలోన - ఏక రీతి ?
ప్రజ్ఞ గలిగి - యెవడు - పాత్ర దానము చేయు,
"ధన్య జీవి" అతడె ధాత్రి లోన.

కనుల తోడ చూడ - కడుపు నిండును గదా!
ముచ్చ టగును సత్యము దొర గృహము,
డెంద మందు కలదు - నందనోద్యానమ్ము;
వేల పూల తావి వెల్లి విరియ.

సామ వేద నాద చతుర సంగీతమ్ము,
సత్యము దొర మాట సంచరించు;
విజ్ఞతా వివేక విద్యా గరిష్ఠుండు !
జనుల మనసు లిట్టె చదువ గలడు.

గొప్ప కవిత లోతు గుర్తు పట్టెడి వాడు,
ప్రతిభ యున్న - మేటి రాచ బిడ్డ,
సాహితీ ప్రతాప చండ మార్తాండుండు;
డెంద మందు గూడ - సుందరుండు.

కోడి పుంజు రవళి - గొంతు లోపల మ్రోగు;
చిమ్మ చీకటి తెర - చెదరి పోవ,
మేలు కొలుపు లయల మిరుమిట్లు మిసమిసల్
విరియ సత్యము దొర విప్పు పెదవి.

చదువు మనిషి మనసు వదనమ్ము దర్శించి,
తరచు గ్రంథ విద్య తప్ప వచ్చు,
రాజు గారి "లో - తరాజు" - తూకము వేయు;
క్షణము లోన ఎట్టి మనిషి నైన.

జంకు గొంకు లేక - ఢంకా భజాయించి,
నగ్న సత్య మతని నాల్క పల్కు;
కఠిను డైన గాని - క్రమ శిక్షణము లోన;
కుసుమ సదృశమ్ము - గుండె కాయ.

సత్యం కంప్యూటరు లిక
నిత్యాభ్యుదయ ప్రగతి నెలకొల్పి సతత
మత్యాధునిక గణిత సా
హిత్యము కూర్చుత - సమస్త పృథివీ స్థలికిన్.

అతని ప్రతిభ వెలుగు నతని పుత్రుల లోన,
విరిసె తెలుగు వెలుగు విశ్వ మెల్ల,
"కార్య శూరు" డిపుడు కంప్యూటరులు వాడు,
జయ శుభ ప్రతీక - సత్య మనిన.

దివ్య తేజ మందు - త్రేతాగ్నులను బోలి,
ముగురు సుతులు సత్యమునకు - కలరు;
తండ్రి గారి మించు - తనయులై జగతిలో,
కాంచినారు వారు - ఘన యశస్సు.

తండ్రి - సత్యము దొర ధార్మిక చ్ఛాయలో
రామ లింగ సోదర త్రయమ్ము;
తెర మరుగున నిల్చి తెలివి తేటల తోడ,
పనులు చేయ గలరు - ప్రజ్ఞ మీర.

రాజ కులాగ్ర గణ్యు లభిరాములు పుత్రులు రాజ తీవిలో
తేజము నందునన్ తెలివి తేటల - విద్యల దేశ దేశ శో
భా జయశీలురైన ప్రతిభా ధ్వజ ధారులు - నిత్య నూత్న నీ
రాజన మంగళాధ్వర విరాజిత మూర్తులు విశ్వ ధాత్రిలో.

విసుగు చెంద కుండ - విశ్రాంతి లేకుండ,
దక్షత మెయి కార్య దీక్ష కలిగి,
రామ లింగ రాజు - శ్రమ కోర్చి పని చేయు;
సాహసించి దిగ్విజయము గాంచు.

గడుప డాత డొక్క క్షణము వ్యర్థమ్మ్మగా,
కార్యశూరు డైన కర్మ యోగి,
రామ లింగ రాజు - శ్రమ జీవి, స్వయముగా,
కృషి విలువ తెలిసిన ఋషి వరుండు.

చెప్ప కుండ తాను చేసి చూపును గాని,
ఆజ్ఞ వేయ డాత డనుచరులకు;
అగ్ర గణ్య నేత - యజమాని కా డంచు,
రామ లింగ రాజు- ప్రణుతి కెక్కె.

అతడు పై కెదిగె స్వయం ప్రజ్ఞ చేతనే !
తండ్రి మించి నట్టి తనయు డగుచు,
స్వకుల మెల్ల బ్రోచె - స్వ కుటుంబమును కాచె,
రామ లింగ రాజు బ్రదుకె - బ్రదుకు.

కనులు చాల వతని కార్యాలయము చూడ,
వాడ వలయు మెదడు గూడ తరచు,
అధిగమించు వేగ అమెరికా జనులనే,
దూర మంతరించి తోచు దరిని.

రామ లింగ రాజు - రచియించె తెలుగులో,
మెరపు తీగ వంటి మేటి కవిత;
మెదడు లోన దూరి - మిరుమిట్లు కల్పించు;
హృదిని "రస సమాధి" పొదుగ గలదు.

గోచరించు ఈత కొలకు లుద్యానముల్ !
పనులు చేయు నట్టి వారి కొరకు,
అమరి యుండు గొప్ప వ్యాయామ సదనముల్,
అనుభవింప వచ్చు 'ఆట విడుపు'.

ఉంచు "మేలు బంతి" ఉద్యోగులకు ముందు,
తన ఉదాహరణము ననుసరింప,
పనియె - ప్రజల బ్రోచు ప్రార్థనార్చన యంచు,
రామ లింగ రాజు బ్రదుకు - తెలుపు.

రామ లింగ రాజు - ప్రతిభా గరిష్ఠుండు;
తెలివి తేటలకు ప్రతీక అతడు;
తనకు తగినవారు తమ్ము లిద్దరు గూడ,
ఈవి యందు - రాచ ఠీవి యందు.

అచ్చు మైన గొప్ప ఆదర్శ యజమాని,
భృత్య బృందము పయి ప్రేమ చూపు ;
చేయు చుండు మేలు - శ్రేయోభిలాషియై,
రామ లింగ రాజు - ప్రభు వరుండు.

సత్యము దొర మస్తకమున
"ముత్యాల గొడుగు" వెలుగుచు ముచ్చట మీరన్;
నృత్య శ్రీ లీలా యుత
నిత్య వినూతన యశస్సు నింపుత సతమున్.

## -: "ప్రతిభావంతుడు రామలింగరాజు " :-

శ్రీ మంతెన వేంకట సూర్య నారాయణ రాజ కవి

ఆంధ్ర దేశ మందు  వ్యాపార రంగాన
పేరు గాంచి నట్టి పెద్ద లందు;
మేరు శిఖరి వోలె - మెరసి పోవుచునుండి!
రామ లింగ రాజు - రాణ కెక్క. 1

తల్లి లోని  నడత - తండ్రి మేధాశక్తి,
పుణికి పుచ్చు కొన్న  పుత్రు డితడు;
అమెరికాకు  వెళ్లి  ఆర్జించి  విద్యను,
ధీరచిత్తు దగుచు  తిరిగి వచ్చి. 2

తండ్రి పేరు మీద  స్థాపించె కంప్యూటర్
సర్విసెస్సు  నితడు చక్క గాను;
అనతి కాల మందె  అధిరోహణము జేసె,
ఆంధ్ర దేశ పరిధి నధిగమించి. 3

ఖండ ఖండాంతరాలలో  ఖ్యాతి గాంచి,
దిగ్దిగంతములకు ప్రాకె  తేజ మలర,
ఇరువ దెనిమిది దేశాల కింత వరకు,
విస్తృతంబున జేసె సర్వీసు లితడు. 4

ఆంధ్ర దేశంబు గర్వించు నట్టి సుతుల,
ఆణి ముత్యాలుగా తాను ఆరి తేరి,
వన్నె దెచ్చెను  క్షత్రియ వంశమునకె,
తోటి వ్యాపార వేత్తల  మేటి యగుచు. 5

కోప మెరుంగ దెన్నడును కూరిమి తోడను, నేర్పు తోడ వి
ద్యా పటిమంబు తోడ, తన దైన వివేక విచక్షణంబుతో,
చూపుచు ప్రేమ, వర్కరుల చోద్యముగా వశవర్తులౌనటుల్,
తా పయనించు మార్గమున తారసిలం గను జేయు వారలన్. 6

ఓర్పు నేర్పు తోడ ఉద్యోగు లందరిన్,
సంతసింప జేసి సక్రమముగ;
పనులు జరుపు కొనెడి పాటవం బీతని,
సొత్తు గాన, ఖ్యాతి సాధ్య మయ్యె. 7

"కాద" టన్న మాట కలుగ దీతని నోట,
"జా" నటంచు గూడ అన డితండు !
మాటలాడ వినును మౌనంబు వహియించి,
అనును చివరి కేదొ – ఆచి తూచి. 8

"కార్యశూరు డితడు" కనరాని ప్రజ్ఞతో,
ఆచి తూచి మరియు అడుగు వేయు;
అంద దతని లోతు – అలోచనకు గూడ;
నిర్ణయంబు జేయు. నిబ్బరముగ 9

నిర్ణయంబు జేయు నిమిషాల లోననే,
నాన బెట్ట బోడు – దేని నైన,
ఎన్ని చిక్కు లైన సున్నితంబుగ తాను,
చక్క బెట్ట గలడు చిక్కు దీసి. 10

మేరు పర్వతంబు మేధావి యీతండు;
మిన్ను విరిగి పడ్డ మెదల బోడు;
చిటికెలో దాని మటుమాయ మొనరించు,
ప్రజ్ఞ పాటవాల ప్రతిభ తోడ. 11

"పూవు పుట్టి నపుడె పుట్టు సువాసనల్,"
అన్న సూక్తి యితని కన్వయించు;
చిన్న తనము నందె - శిఖరాగ్రమును జేరె;
గర్వ కారణంబు కాదె మాకు. 12

## కవితా కర్పూర నీరాజనాలు

హృదయ మమృత సముద్రము ;
వదనము కవితా లతాంగికి నర్తనశాల ;
సదన మతిథి కోటికి నాటి ఋష్యాశ్రమము;
విశాల వసుధా కుటుంబి - నీ సాటి నీవె.
- శ్రీ శనగన నరసింహస్వామి

ధైర్యము రొమ్ము విచ్చినది,
ధర్మము త్రాసున తూగె ; అంచితౌ
దార్యము వ్రేల్మి పాతుకొనె ;
దక్షత పీఠము వైచి నిల్చె ; సత్
కార్య వినిర్వహమ్మె ఇలు
గట్టి వసించెను - రామ కృష్ణ మా
చార్యుల గుండె లోతుల ప్ర
సన్నతలో - మధురానుభూతిలో
-అష్టావధాని, శ్రీ గాడేపల్లి కుక్కుటేశ్వరరావు

# స్వగతం

స్వయం సంపూర్ణ సంధానం,
చమత్కార రసాత్మకం,
ముక్తకం పద్య మేకైకం,
సత్ ప్రబంధ శతాయతే.

గాడిద మోయ లేని పెను కబ్బపు కట్ట రచింప నాకు చే,
యాడదు, భూమిపై యుగ యుగాంతరముల్, ప్రజ నాల్కలన్ సదా ,
ఆడెడి మంచి పద్య మొక టైనను చాలు - నిరక్షరాస్యులున్,
పాడుచు ఆడగా గగురు పాటును, చెందుత విన్న వారలున్.

అవదరింపు డయ్య - ఇవి "మినీ కవితలే"
చిన్న ఆట వెలది విన్నపములు;
సహృదయు డెవ డైన చదువ - కంఠస్థమౌ;
నెమరు వేయ దగిన అమృత గుళులు.

జగము చూచినాడ - చాల కాలము మేర,
చదివినాడ - విశ్వ చరిత గూడ,
సానుభూతి - సర్వ సన్నివేశములపై,
గుండె లోన ఊరు చుండు నాకు.

ఆంధ్ర దేశ మందు - ఆశీస్సు లందించి,
ప్రతిభ యున్న వాని వదల దలతు,
కోడి పుంజు వోలె - గొంతెత్తి గుట్టపై,
క్రొత్త ప్రొద్దు పొడుపు కూర్చగలదు.

మతము గితము లేని - మనుజ మాత్రుడ నేను
అంతరంగ మందు ఆస్తికుడను ;
భరత దేశ మందు - పరమార్థ మిపు డేది ?
బ్రతుకు నందు చూపు - మత సహనము.

చిన్ని మొక్క యెదుగ - చిగురు టాకులు వేసి,
కొమ్మ రెమ్మ తోడ గోచరింప,
మొగ్గ తొడిగి కొన్ని పూలు పిందెలు పుట్టు ;
అరయ కనుల పండు వౌను - నాకు.

నా మది ఒక దర్పణమే,
ప్రామాణిక వాస్తవికత - ప్రతిబింబించున్ ;
వ్యామోహ విరహితము - వి
శ్రామ తటస్థము - తదేక సాక్షిగ నిలుచున్.

శారదా మణితము - సాహిత్య సంగీతి
తెలియకుండగా ప్రతిధ్వనించు;
వ్యాఖ్య సలుప లేము - వాచ్యార్థముల కెందు;
చదల పక్షి వోలె శబ్ద మెగురు.

నే నే విశ్వాసములును
లేని స్వతంత్ర సహృదయుడ - లీలా విలస
న్మానవ మాత్రుడ - బ్రదుకున
నా నాలోచనలు మెరయు నాలో సతమున్.

## SOLILOQUY OF THE AUTHOR

**— Nanduri Rama Krishnamacharya**

I am the author of this book of TELUGU poems - " **Mutyala Godugu"** - "An Umbrella of Pearls" - a collection of autonomus verses. Every Pearl retains its individual identity - and may contribute to the composite grandeur and glory of the umbrella - a symbolic emblem of emotional and intellectual and imperial excellence.

I am the author of some other poetic compositions in TELUGU- "TARA TORANAM" - a collection of twenty seven poems, "PRAGATI GEETA" - The song of progress, " KAVITA PRABHAASA" - (The PILLGRIM's PROGRESS of POETRY) - and "ALOCHANAM" - The floating "THOUGHTS" - all these are the out bursts of a visionary.

### I am a dreamer.

I try to be an angel, beating my luminous wings in the void in the atmosphere, broadcasting my thoughts. Let me add - "Every great achievement has been a "born thought" and all men of action have been relations of un known thinkers" .

Dreaming - is the birth-right of poets who are the unacknowledged fore- runners of eminent leaders in all provinces of human endevours.

Poets can dream, with their eyes wide open. Poets can recapitulate the silient slogans they have heard in their dreams and hallucinations. "Let Nations die, so that humanity may live" - "Graves of great men are the gathering places of nations" - "Man shall surpass patriotism and become a citizen of the world" - "We want the PARLIAMENT of Man and the federation of all Nations", "Nationalism has out- lived its util-

ity". - "THINKERS of the world, unite, to make the globe, habitable for mankind," - "Perochial Patriotism produced two most terrible world-wars, in this century."

It seems that "Man has evolved out of the monkey". "Evolution should not come to a halt with man." "Man is something that shall be surpassed." Evolution expects the "super man." But, recently the brutality between the serbs and ethnic Albanians reminded us of the crime omitted in the German Gas chambers. World history provides many more such ghastly examples of the brutality of Man. Is brutality an inherent element of Human Nature? Are wars inevitable ? The Budha - Jesus Christ and Mahatma GANDHI, PREACHED universal love and human fratenity. Asoka, was against war-fare. "Human Nature" - can be changed and less effort is needed to change the so called 'Human Nature than to discover the Atom, or the Hydrogen Bomb or the "Death Ray" History provides us with a great galaxy of Saints and seers, prophets and philosophers who have preached the gospels of peace and universal love. Certainly, "Man" is quite different from the "brute" and the ferocious animal.

Apart from the historical Asoka, Einstien in our time has said ,"the soldier falls below my contempt. He recieved the great brains by mistake"

"Good iron is not used for coffin nails, and good men are not to be used as soldiers"-postulates a Chinese proverb.

Evolution takes man towards the advent of the "SUPER MAN". The modern seer, Aurovindo asks every man to contribute his mite towards the evolution of the "Super man"consciously. History and science are on the side of the theory of evolution of "Super Man".

The need of the hour is the advent of "The parliament of Man" and the establishment of "One World government." Progressive human spirit require it. What is PATRIOTISM? Patriotism is perhaps geographic idolatry - in disguise.

Every poem in this book is a crystal, epitomising the comprehensive compendium of thunder and lightning. cyclonic hurricane, fire exploding valcano in one singular capsule. This is the age of "mini poetry" -pure and simple.

Many countries in the world - today especially India suffer from literary self - polinisation. The future of poetry is cosmopolitan cross fertilisation.

Every verse in this book **'Mutyala Godugu'** is a Muktaka = Mutyam, crystalised wisdom, with brevity as its soul, symbilising the spirit of an epigram. In every verse, the macro - crosom is transformed into a micro crosom.

Once upon a time, there was the 'west' and there was the 'East' and the the twain never met. Now the whole earth is a revolving Globe and the East and the West are illusory concepts. Modern science has obliterated dissances and directions. there is no east or west when two great brains meet. and all men are neighbours Cosmopolitian composite and comprehensive poetry is a "Future Tense" and symbolises contemporary posterity.

Nationalism has already become an anachronism.

The definition given by ancient India avers that

" A gentleman is citizen of the world."

The most remarkable event in modern history of the world is the meeting of the West and the East in the proverbially hospitable land of India. Ideas have embrased one another across round tables. Great ideas are ever invincible.

**"Mutyala Godugu"** - preaches **Humanism.** I hope the readers of these poems will become potential " citizens of the world. "

I hope that these poems will provide the reader with intellectual symphony. Poetry shall confer on the youthful reader. **"integrál maturity, sans senility."**

# సందేశము

గొప్ప దైన దేది ? - గుప్త దానమె సుమ్ము !
ఎంచి యెవరి కేది ఇవ్వదగును ?
శాత్రవులకు ఇమ్ము - క్షమను కామక చేసి,
స్నేహితులకు - ఇమ్ము స్నిగ్ధ హృదిని ;
తరుగ నట్టి పేర్మి - తల్లి దండ్రుల కిమ్ము ;
పెండ్లమునకు - కూర్మి ప్రేమ నిమ్ము ;
సత్ప్రవర్తనమ్ము - సంతానమున కిమ్ము ;
పేదవారి కిమ్ము - పెద్దరికము ;
అతిథి కంటె - ముందు - అభ్యాగతుల కిమ్ము
సంతసమ్ము గొలుపు - స్వాగతమ్ము;
ఎల్ల జనుల కిమ్ము - ఇంపైన మర్యాద ;
సేవకులకు - హెచ్చు జీత మిమ్ము;
యుగ యుగాల కిమ్ము - ప్రగతి యోగము నందు
పుడమి చెరగి పోని - అడుగు జాడ,
తీర్చి దిద్దు కొనిన - త్రికరణ ప్రతిపత్తి
ఎపుడు నీవు నీకు - ఇచ్చు కొనుము,
ధర్మ నిరతి తోడ - ధన్యవాదము లిమ్ము
" మృత్యు దేవి " - సంగమించి నపుడు.

- "కవితా ప్రభాస" నుండి

# ముత్యాల గొడుగు

సహృదయాభినందనము

ఓ సుకుమారతా ప్రియ మహోదయ శేఖర ! స్వీకరింపుమా,
నా సుహృదంతరంగ సుమనశ్శుభ శోభన ధన్యవాదముల్;
"కాసట బీసటే" చదివి గాథలలో కవితా కళా రసో
పాసన చేసినావు గద ప్రాక్తన కాలము నుండి సాహితిన్.

కాసట

సరస కవిత యన్న - సంగీత కళ యన్న,
వ్యంగ్య మన్న - లలిత హాస్య మన్న;
అని విముఖు లున్న - అదియె వారికి శిక్ష!
వేరు శిక్ష - ఇంక వేయ నేల ?

పెద్ద మనిషి -

ఎదుటి వారి మీది హేయాభిభావముల్;
దిన దినమ్ము పెరుగు తన అహమ్ము;
మనసు లోన దాచి మసల గల్గిన వాడు.
పెద్ద మనిషి యనుచు పేరు గాంచు.

యోగి

సంతసించు ఒకడు సంగీతమును మెచ్చి,
సరసు డొకడు - కవిత చదివి మెచ్చు;
మెచ్చి - సృష్టి నెల్ల - సచ్చిదానందమ్ము
సతము పొందు - యోగి సత్తముండు.

స్నేహము

స్నేహము కంటె ఈ మనుజ జీవిత మందు రసార్ద్రమై జగ
న్మోహన మైన దేది ? అహమున్ విడి రెండు మనస్సు లేకమై;
ఐహికమైన స్వార్థమును త్యాగము చేసెడి దివ్య యజ్ఞ హో
మాహుతి - మైత్రి నాఁ బరగు హార్దిక - భవ్య పరోపకారమై.

రంగు గ్రుడ్డితనము

సరళ సౌమ్య సాధు సర్వతో ముఖ దృష్టి
యోగి సత్తమునకు - ఉండవచ్చు;
పదవి - చదువు - మెదడు - వ్యవహార విజయముల్,
ధనము - రంగు గ్రుడ్డి తనము కూర్చు.

పదను

పదను పెట్ట వలెను- పలుమారు కత్తికిన్;
మెదడు కోరుకొనును పదను తరచు,
చదువు పదను బెట్టు మెదడు కెప్పుడు గూడ,
కవిత పదను చదువు కంటె - మిన్న.

ప్రశ్న

ప్రతిభ కంతరాత్మ - ప్రశ్నించు శక్తియే !
సత్య శోధనైక చర్య యందు,
ప్రశ్నకు మరి యొక్క ప్రశ్నయే కావచ్చు,
సమ్య గుత్త రమ్ము - జ్ఞాన జగతి.

జ్ఞాని

ప్రకృత సిద్ధ బుద్ధి - పశు పక్షి తతి కుండు;
జ్ఞాన యోగ ముండు - మానవులకు;
కడగి చేయు నరుడు - కర్తవ్య పాలనల్;
జీవితమున స్వార్థ చింత వీడి.

సమస్యలు

గోచరించు పైకి - కొస మాత్రమే కొంత,
ఉండు కడలి మంచు కొండ మునిగి,
తెలియ లేరు ప్రజలు పలు సమస్యల తీరు,
స్థూల దృష్టి తోడ చూచి నపుడు.

కోడి పుంజు

అచ్చు మైన వీర మెచ్చోట కన్పించు?
"కోడి పుంజు" నందె చూడ వచ్చు !
పార వచ్చు నెత్తు టేరు దేహము నుండి,
కోడి పుంజు - పోరు వీడి పోదు.

కరడు గట్టి నట్టి క్షాత్రమ్ము పుడమిపై,
కోడి పుంజు నందె చూడ దగును;
కోడి పుంజు వంటి గుండె గల్గిన బంటు;
ధరణి నరుల లోన అరుదు గాదె.

సేతునిర్మాణము

కలవు - భిన్న సంస్కృతులు - దేశ దేశాల,
నెలవు - వివిధ వేదములకు - పృథివి ;
చేయ వలసిన పని - సేతు నిర్మాణమే !
సామరస్య శాంతి సంధి కృషియె.

మేలి వస్తువు

ఎంచి మేలి వస్తు వెట నున్న - కాంక్షించి,
మారు మూల కైన చేరు - జనము !
మెచ్చ గలరు ప్రజలు మేలి వస్తువు చూచి,
సరకు గొనరు హెచ్చు ధరను గూడ.

అంగ వైకల్యము

అవయవముల తోచు - అంగ వైకల్యమ్ము
  బ్రదుకు నందు దుర్భరమ్ము గాదు;
అంద మైన గొప్ప నందనోద్యానమ్ము;
  మనిషి కున్న యెడల మనసులోన.

దారిద్ర్యము

వెదుక దగిన దేది ? విశ్వ కల్యాణమే !
  సరస సామరస్య సంధి - శాంతి,
పార ద్రోల వలయు - దారిద్ర్యమును వేగ,
  ధరణి లోన నాల్గు చెరగు లందు.

పరికరాలు పనులు నెరవేర్చు సులువుగా,
  ఎంచ మనుజ శక్తి పెంచ గలవు;
పంచి పెట్ట దగును - పరికరమ్ములు నేడు,
  కడగి దొరతనమ్ము - కార్మికులకు.

కడలి యెల్ల - అల్ల కల్లోల మగు గాక,
  కుంభ వృష్టి - వాన -కురియు గాక,
జగతి రేగు గాక - ఝుంఝూ సమీరముల్ !
  "ఆస" గుండె లోన ఆరిపోదు.

పుచ్చు కొనెడి వాని బుద్ధి వైశాల్యమ్ము;
  ఇచ్చు నట్టి వాని మెచ్చుకోలు,
చూచునట్టి వారి శుభ యోగ వరివస్య,
  పెంచ వచ్చు ఈవి విలువ తరచు.

దాత

పుడమి లోన - ధనము - బురద వంటిది గదా!
పుట్టి పురుగు లెన్నొ - గిట్టు చుండు;
పుట్టు చుండు - దాత- బురద - పద్మము వోలె,
పాత్ర దాన మిచ్చు - ప్రతిభ - వెదకి.

మంచితనము

మెదడు పెంచి కూర్చె - మేటి 'ఆటము బాంబు'
యుగ యుగాల పిదప - ఉర్వి నరుడు;
మంచితనము పెంచ - మానవత్వము నిల్ప ;
అంత తెలివి తేట లనవసరము.

మెదడు

ఉండ వలెను నరుల కుపవృత్తి యేదియొ;
తృప్తి నివ్వ లేదు వృత్తి తరచు;
పనుల యందు మార్పు - ఒన గూర్చు విశ్రాంతి,
పదను పెట్ట గలదు మెదడు కెపుడు.

అద్దము

వక్ర మైన దైన - వాఙ్మయాదర్శమ్ము
చూప లేదు సత్య రూపములను;
అట్లె - చూడ - రంగు టద్దాలు ధరియించి,
వేరు తీరు తోచు విశ్వ మెల్ల.

మానవత్వం

స్థూల దృష్టి తోడ చూడ - నాస్తికుడనే;
అరయ సూక్ష్మ దృష్టి ఆస్తికుడను;
మతము మీద గాక - మానవత్వము పైన,
నీతి మీద ప్రీతి నిష్ఠ గలదు.

కలహం

వీను దోయి కెట్లు వినుపించు ? చప్పట్లు ??
చేర కుండ రెండు చేతు లొకట ?
ఉభయ పక్షములకు ఉద్రేకములు లేక,
ధరణి - కలహ మెట్లు దాపురించు ?

"ప్రభువు - నరకమునకు రాజ్యాంతమున నేగు"
అంచు పెద్దలు వచియించి నారు !
ఉండ లేడు - చేయ కుండ - తప్పులు కొన్ని ;
నేటి కాల మందు నేత గూడ.

మంచితనము +ప్రతిభ

మంచితనము లోని మాధురీ మహిమమ్ము
మనిషి నెమరు వేసు కొనును సతము;
మంచితనము తోడ - మహిత ప్రతిభ చేర,
ఎడద తోడ - అంజలింప దగును.

మనన శీలి

పాల రాతి తోడ - నేల కప్పగ వచ్చు;
మేడ కట్ట వచ్చు - మిన్ను తాక,
అది గృహమ్ము కాదు - అది సజీవ సమాధి;
మనన శీలి గాని మానవునకు.

చేర వచ్చు - మనిషి - జీవత్ సమాధిలో !
ధనము లోన కూరు కొనిన యెడల,
వెదక వలెను వేగ - విశ్వ కల్యాణమ్ము,
మనవ శీలి యైన మానవుండు.

రేపు

రేపు మీద మనషి చూపు నిల్పుట మేలు;
మరచి పోయి- భూత చరిత - వేగ,
కోరి త్రవ్వ నేల ? గోరీలు ధరణిలో ?
కంపు గొట్టు అస్తికలు లభించు.

దాత

కాని యెడల దాత - కాపలా కుక్కయే;
మనుజ జగతి లోన - ధనిక వరుడు;
అనుభవింపవచ్చు ఆహ్లాదమును పంచి,
ధనము బ్యాంకు లందు దాచ రాదు.

యశస్వి

కాళ్ల చేతు లతడు కదుప జాలడు గదా!
పేరు గాంచి నట్టి పెద్ద వ్యక్తి !!
సభల నిలువ గోరు - చప్పట్ల మధ్యలో !
నవ్వు లొకటి రెండు రువ్వ వచ్చు.

మధ్యసిరి

యశము చేర వచ్చు - యాదృచ్ఛికముగా !
చేరు - ధనము వేరు కారణముల ;
మనిషి మనసు చెరచు - ధనము కీర్తియు గూడ,
మధ్య వచ్చె నేని మరియు చేటు.

అహము

చేర వచ్చు - పిదప వేరు హేతువులచే,
మనుజు లందు గొప్ప తనము - తరచు;
జనన మంది నపుడు జనులెల్ల శిశువులే !
అహము కంటె లేదు హాస్య రసము.

జాలి గుండె

సర్వ నిగమ ధర్మ సార సంగ్రహ మేది ?
నిర్వికల్ప నిత్య నీతి యేది ?
జాలి గుండె గలిగి - సానుభూతిని చూపి,
ఆర్త జనుల చేరి ఆదు కొనుటె.

స్నానం

స్నానము శౌచ పారమిత సారము మానవ దేహ దీప్తికిన్
జ్ఞాన సమాధి రంగమును సాధకున్ సమకూర్చు - నిల్పు వే
మానస శాంతి సౌఖ్య సుషమా విభవానుభూతి - ఉ
న్మీనుల జేయు మానవుల నిత్య వినూతన శోభ వర్ధిలన్

రంగురాయి

జగతి - అసలు శక్తి సామర్ధ్యములు వేరు!
పేరు పెరిగి మెరయు తీరు వేరు,
రంగు రాయి తళుకు - రత్న దీప్తిని మించి,
భ్రమలు గొలుప వచ్చు ప్రజల తరచు.

ఆకర్షణము

సరస భాషణమ్ము - చదువు - వృద్ధాప్యమ్ము,
కనుల జాలువారు వినయ గరిమ,
లలిత చాకచక్య లౌక్య విన్యాసముల్;
ప్రజల ఆదరమ్ము పడయ గలవు.

మితభాషి

బ్రదుకు లోన అరయ - నది కాదు మితభాషి;
మానస సరసి యగు జ్ఞాన మందు;
కొలువ రాదు లోతు - గెలువ రానిది ప్రజ్ఞ;
గురువు వోలె అతని కొలువ దగును.

నేత

చేయు నట్టి వారి చేత - కర్తవ్యముల్,
నిర్వహింప జేయు నేత ఒకడు,
కఱ్ఱి పెత్తనమ్ము - కార్య శూరుడు చేయు;
వంద చేతు లాడు వాక్కు వలన.

మంచిదనం

ఎన్ని తెలివి తేట లున్న - జీవితములో !
మంచిదనము నెపుడు మించ లేవు;
మంచిదనము కన్న - మానవత్వము కన్న,
లేదు - లౌక్య మేది లేదు - లేదు.

...

తృప్తి

అందనేర డెప్పు డానంద యోగమ్ము
లేని యెడల తృప్తి - మానవుండు;
చదువు పదవి ధనము సంతృప్తి నిచ్చునా ?
గుండె పండ వలెను కోవిదునకు.

నిద్ర

తెలియ నట్టి వెన్ని కలవు - జీవితములో
నిర్వచింప నగునె - నిద్ర అనిన !
నరుల కాత్మలును పునర్జన్మ లున్నవా ?
వదల వలయు వ్యర్థ వాదములను.

మిథ్య

కలి యుగమ్ములో జగతి మిథ్యయె యైన
ఒకటి రెండు, నిజము లుండ వచ్చు,
"తల్లి ప్రేమ" ఒకటి తథ్య మైనదె గదా!
గురువు మీాది భక్తి కూడ నిజము.

తథాగతుడు

చిల్లర మల్లర విషయము
లుల్లములో చేర్చకుండ ఉత్తము డుండున్;
సల్లలిత తథాగతు డు
త్ఫుల్ల ముఖ సరోరుహు డయి తోచు గద సదా.

కార్య చతురుడు

ఒకరికి నోరును మూయును
ఒకరికి కన్నులు తెరచును ఒడుపుగ తా నిం
కొకరికి బుద్ధులు గరపును;
సకలము నెరవేర్చు కార్య చతురుడు కడిమిన్.

చిచ్చు బుడ్డి

వైభవ ప్రకర్ష - ఆభాస నిభ కీర్తి,
శాశ్వతములు కావు - జగతి యందు,
మింటి మీది కెగిరి - మిరుమిట్లు కల్పించి
పుడమి పడెడి చిచ్చు బుడ్డి వోలె.

మనుజుడు చేయగ వచ్చును
పను లెన్నో స్వార్థ బుద్ధి బ్రదుకుట కొరకై,
పని ఒక్కటి చేసిన చా
లును స్వార్థము విడిచి - సర్వ లోకము మెచ్చున్.

పొగడ్త

సత్యముండ వలె ప్రశంసా వచన మందు,
ఉండు గాక అతిశయోక్తి - కొంత;
ప్రతిభ యున్న ఎన్ని ప్రస్తుతింపగ వచ్చు;
దుష్ట పొగడు టన్న దోష మగును.

వేత్త

చిత్త మందు తెలియ - సృష్టి వైశాల్యమ్ము,
తన అణుత్వ లఘిమ - 'తత్త్వ వేత్త'!
త్యాగ గుణము చూపు - ఔదార్యమును చూపు,
తత్త్వవేత్త జీవితమ్ము లోన.

నిక్కమైన జ్ఞాని - నిజ జీవితములోన,
'త్యాగ యోగి' యును మహర్షి యగును;
వేడి లేని చలువ వెన్నెలల్ కురిపించు,
గురువు - శిష్య వరుల గుండె లందు !!

మనుజుడు

పుడమి - మనుజు డేల పుట్టునో గిట్టునో ?
తెలియ నేర రెవరు తెలుప లేరు,
తీర్చి దిద్దు - నరుడు దినచర్యతో పాటు
కోరి - చిర యశస్సు గూర్చు పనిని.

గృహము

ఎపుడు పూర్తి కాదు - గృహము కట్టుట యన్న !
చేయ వలయు తరచు చేర్పు - కూర్పు;
అద్దె కొంప మేలు - ఆర్థికమ్ముగ చూడ,
అంత కంటె మేలు - అయ్య ఇల్లు.

బాల హృది

జన్మ చేత - మనుజ సహజ సిద్ధము - ప్రేమ;
సానుభూతి చూపు జాలి గుండె;
మార వచ్చు మనిషి - క్రూర రాక్షసుడుగా
కోలు పోయి నపుడు - బాల హృదిని.

తేర ధనం

బ్రదుక వచ్చు - మనిషి - పని చేసి కష్టించి,
పరుల మోసగించి బ్రదుక లేదు;
తేర ధనము వేగ కోరుకో కున్నచో,
లేదు మనిషి బ్రదుక లేని వాడు.

సందేశం

సరస సౌమ్య సరణి సందేశ మివ్వాలి ;
చెంప లదర గొట్టి చెప్ప రాదు !
సుత్తి వద్దు - ధర్మ సూక్ష్మమ్ము జగతిలో,
గుత్త కాదు - ఒకరి సొత్తు గాదు.

దొంగనిద్ర

దొంగనిదుర వోవు దొరగారి దరి జేరి;
సులువు కాదు మేలు కొలుపు టన్న;
తెలియ కున్న యెడల - తెలియ జెప్పగ వచ్చు !
తెలిసినట్టి వాని దిద్దు టెట్లు ?

తొలి ఉషస్సు

తూర్పు దెసను తోచు - తొలి ఉషస్సుల సొరు,
పిదప - ప్రొద్దు పొడుచు చదల మీద,
ఎండ వేడి చిమ్ము చండ మార్తాండుండు,
సంజ చీకటి తెర జారు వరకు.

అహం

మాయ లెన్నొ గలవు - మతము దేశము భాష,
మనిషి చిక్కు పెక్కు మమత లందు,
సంఘ మందు కలవు - సంకెళ్ళు - సర్వత్ర,
అరయ మాయ కలదె అహము కంటె.

బొంకు

కల్ల బొల్లి గాథ లల్లి లాభము లేదు,
పురిటి సంధి గొట్టి బొంకు చచ్చు;
అరసి మంచి పనులు అజ్ఞాత చారణుల్;
కూర్చ గలరు సతము గొప్ప కీర్తి.

అతడు

మాట లందు నతడు - దాటు దిక్కుల నెల్ల !
వర్తనమ్ము చూడ వామనుండు !!
నయన యుగళి ముందు - నటరాజ సదృశుండు,
వాస్తవ జగ మందు బాల శవము.

జల ప్రళయం

తుంగ హిమనగమ్ము - ధ్రువ సముద్రము నుండి,
కదలి చేరి బయట కడలి కరుగు;
అఖిల హిమము కరుగ - అది జల ప్రళయమే !
మనుజు లుండు చోట్లు - మునిగి పోవు.

దొంగ

చేయ గూడ దెపుడు స్నేహమ్ము దొంగతో,
తేర ధనము నతడు కోరు కొనును !
దరికి చేర గలడు - తరళ మేధావియై;
చాకచక్య లౌక్య చక్రవర్తి.

మొక్కలు

కన్య తోడ నుడివె - గడుసు విద్వాంసుండు;
"నీవు మొక్కలకును నీరు పోయ;
మంచి మగడు నీకు మాన్యుండు లభియించు"
చెట్లు దిన దినమ్ము - చెందె వృద్ధి.

ఆటలోని అరటిపండ్లు

బ్రదుకు లోన ఏది పట్టించు కొనరాదు
అన్ని ఆట లోని అరటి పండ్లె;
బ్రదుకు నాటకమున - పాత్ర మాత్రుడె యౌచు,
జ్ఞాని - అహము విడిచి - సంచరించు.

తుల - సి :-

కృష్ణ దేవు తూచె శ్రీ రుక్మిణీ దేవి,
తులను వేసి ఒక్క తులసి దళము,
తుల మొదట అమరెను తులసీ పదము లోన;
వింత గాథ పిదప వెల్లి విరిసె.

నిర్మాణ కృషి

ఉత్తమ కృషి యేది ? ఉత్పత్తి పెంచుటే;
వేరు పనుల నెల్ల వీడ వచ్చు;
నిక్క మైన ప్రగతి - నిర్మాణ చర్యలే !!
ధ్వంస కాండ వద్దు - హింస వద్దు

సేవ

అరయు టనిన ప్రతిభ - ఔదార్య చిహ్నమే;
మంచి తనమున కది మచ్చు తునక;
జీవితమ్ము నందు శ్రేష్ఠ మైనది ఏది ?
సేవ - సేవ - సేవ -సేవ - సేవ.

అభ్యుదయం

అభ్యుదయము కొరకు - ఆవేశ యోజనల్;
రెండు - తగిన పాళ్ల - ఉండ వలెను,
గొప్ప ముప్పు తెచ్చు - గ్రుడ్డి దావేశమ్ము;
కూర్చు యోజనమ్ము - కుంటి నడక.

అంగవైకల్యం

అవయవాల తోచు - అంగ వైకల్యమ్ము
బ్రదుకు లోన దుర్భరమ్ము కాదు;
అంద మైన గొప్ప నందనోద్యానమ్ము
మనిషి కున్న యెడల మనసు లోన.

గడ్డి పోచ

గడ్డి పోచ చాలు - గాలి వాటము తెల్ప !
చాలు ఒక నమస్సు - చాట భక్తి !!
మంచితనము తెలుప - మాట ఒక్కటి చాలు,
పూజ చేయ గడ్డి పూలు చాలు.

టెంకాయ

డెంద మలరఁజేయు టెంకాయ నీరమ్ము
అది అమృత కలశము అనగ జెల్లు;
ఇమిడి యుండు నందు సృష్టి చైతన్యమ్ము;
కలదు స్వచ్ఛ తమము ఖాద్య మందు.

మేలు

ఎట్లు వచ్చె సృష్టి ? ఎపుడు వచ్చెనొ గాని,
అరయ నేల ? కాల హరణ మేల ?
బ్రదుక దగును - నరుడు - పరుల కెవ్వరి కైన,
చేయ కుండ హాని - చేసి మేలు.

మనిషి మనస్సు

నరుడు పూని ఒక్క నందనో ద్యానమ్ము;
మనసు లోన పెంచు కొనుట మేలు;
పెంచ నేల ఇంటి పెరటిలో ఎవడైన
చిన్ని పూల తోట చేతులార ?

ముఖే ముఖే ప్రతిభా

పాడ వచ్చు గుడ్డి వా డద్భుతమ్ముగా !
కుంటివాడు కవిత కూర్చ వచ్చు !
చెక్క వచ్చు మూగి శిల్పాలు సొగసుగా
చెవిటి గీయ వచ్చు చిత్రములను.

రాయబార మెప్పు డాయుధమ్ములు లేక,
జయము గాంచ లేదు జగతి యందు;
సభల యందు వివిధ జంత్ర బృందము లేక,
గాత్ర గీతి రక్తి కట్ట దెపుడు.

రాజకీయం

ప్రజకు తెలియ కుండ - వంచింప గల్గుటే !
లలిత రాజకీయ లౌక్య మగును;
దొంగ - అప్పు డపుడు - దొరకి పోయిన గూడ,
శిరము నెత్తి తిరుగు సిగ్గు పడక.

మధ్య కీర్తి - మరియు మధ్య వచ్చిన సిరుల్,
చేర్చు - కన్ను దోయి శిరము పైకి !
కష్ట సుఖము లరయ గల ప్రజ్ఞ బ్రదుకులో
కొంత మంది లోన కూర్చ గలవు.

నాలుక

వైద్యు డరసి నాల్క పసిగట్టు రోగమ్ము
నరుని శీల సూచి నాల్క తరచు;
నరుడు పెట్ట వలయు నాల్క - కట్టడి లోన;
నరము లేని నాల్క తిరుగ కుండ.

విశ్వ మందు కలరు వికలాంగు లెందరో!
ఉజ్జ దీన మాన సోపహతులు;
ఉండ వలయు వారి కూత కఱ్ఱలు కొన్ని !!
మతము - భాష - జాతి మమత గిమత.

ఎంత వింత మాయ - ఈషణ త్రయ మన్న ?
దార సుతులు మాయ - ధనము మాయ,
మంచి పనులు చేయ మాయ అడ్డము వచ్చు !
మాయ - కీలు బొమ్మ మానవుండు.

స్వల్ప మిథ్య.

చలన చిత్ర మనిన - శాంబరీ సంతృప్తి
కొంత కొద్ది సేపు కూర్చ వచ్చు;
మనుజ జీవితమ్ము - ఘన మిథ్యయే యైన,
చలన చిత్ర మందు - స్వల్ప మిథ్య.

మనసు మురికి

నరుడు - దిన దినమ్ము - పరిశుభ్రతను గూర్చి,
దుమ్ము ఇంటి నుండి - దులుపు చుండు;
అంత కంటె శ్రద్ధ - అతి జాగృతిని బూని,
మనిషి బాపు గాత - మనసు మురికి.

చిన్ని బుడగ

కలల త్రోయ రాదు - క్షణ భంగురము లంచు;
తీపిదనము కొంత సేపు కూర్చు;
భూమి మీది నరుడు - భూగోళమును గూడ;
చిన్ని బుడగలు గద సృష్టి లహరి.

గ్రహాంతర యానం

నేల విడిచి సాము !! - నిర్మింపగా ! నేల ?
చదలపై త్రిశంకు నగరి ? యొకటి,
ధరణి పెక్కు జనులు - దారిద్ర్యమున మ్రగ్గ,
కరుణ లేని వెఱ్ఱి ఖర్చు లేల ?

సంధి

ఇహము నందు తరచు సహ జీవనము సల్పు,
కలహ భూమికములు కలిసి మెలిసి !
అరయ బ్రదుకు కవి - ఆరోగ్య చిహ్నముల్ !!
సంధి శాంతి - ప్రగతి సాధకమ్ము.

చెరసాల

ఇనుప కటకటాలు - ఎత్తైన కుడ్యముల్,
కఠిన శృంఖలాలు - ఖైదు కావు;
ఎంచ అదొక గొప్ప ఋష్యాశ్రమమె యౌను,
విమల చిత్తునకు విశ్వమందు.

భావి చికిత్స

క్రొత్త పరికరములు క్రొత్త మందులు వచ్చు,
కృతకము లవయవము లతుక బడును,
వైద్య పరిధి పెరుగు - భావి కాల చికిత్స ;
మానవ ప్రకృతిని మార్చ వచ్చు.

ధనం

పెద్ద పదవి వలన - మొద్దు బారును గుండె,
చేర వచ్చు కనులు శిరము పైన,
ధనము - మధ్య జీవితమ్ములో - ప్రాప్తింప,
మానవుండు మారు దానవుడుగ.

గురువులు

మతము లెల్ల తరచ - మనుజ నిర్మితములే,
గురు వరేణ్యు లైరి - కొంత మంది;
వారు చేసినారు - భగవత్ ప్రతినిధులై,
స్వార్థ లాభ లోభ వర్తకములు.

చిరునవ్వు

కనులు వెల్లడించు -గాఢ భావ క్రాంతి,
తల్ల డిల్లు భాష - తడుము కొనును,
మాట కంటె మౌన మంద హాసము మేలు,
భాష శక్తి మిగుల పరిమితమ్ము.

పరిపక్వత

పులుపు - ద్రాక్ష కాయ బోలు - పచ్చిది గదా,
పండ లేదు - అతని గుండె ఇంక,
పక్వ మౌను - పిదప - భావి కాలము నందు,
తథ్య మింక తీపిదనము వచ్చు.

ఉడుత భక్తి

దాగ వచ్చు - చిఱుత దానమ్ము వెను వెన్క,
కొలువ తరము గాని గొప్ప గుండె;
వ్రాసినట్టి దెవరొ - రామాయణము కంటె,
"ఉడుత భక్తి" గాథ - ఉజ్జ్వలమ్ము.

భావ వైరుధ్యము

చూడ - "స్థూల దృష్టి" తోడ - భిన్నత్వమే !!
అరయ వచ్చు స్త్రీలు పురుషు లందు ;
ప్రకృతి సహజ మౌను భావ వైరుధ్యమ్ము,
బ్రదుకు ప్రతిఫలించు ప్రగతి యౌను.

కదలిక

కానుపించు బోద కాలి యందున బల్పు;
వాపు వేరు! దేహ బలము వేరు!
తిరుగు బొంగరమ్ము గిరగిరా రయముగా,
కదలిక గమకమ్ము కాదు - ప్రగతి.

మానసస్థాయి

మనుజు డాగ రాదు - మానస స్థాయికై!
బ్రదుకు లోన వద్దు బద్ధకమ్ము;
వేగ చేయ దగును వివిధ కర్తవ్యముల్,
మొదలు పెట్ట మెదడు కుదుట పడును.

విక్రమాదిత్యుడు

అవని నేడు విక్రమాదిత్యు డెవడయా ?
విత్త వాంఛ విడిచి పెట్టు వాడు !!
కామ కాంక్ష నణచి క్షమ చూపి భ్రమ వీడి,
మంద హాస మొలికి మసలు వాడు.

సంతోషం

లోకోత్తర సంతోషము
వ్యాకరణము లోన - ఏక వచనంబౌ - భూ
లోకమున ద్వివచనము - రస
లోకములో బహు వచనము - లో తల పోయన్.

స్వేచ్ఛ

అరయ - బ్రదుకు - వింత చెఱసాలయే గదా!
నరుని స్వేచ్ఛ మిగుల పరిమితమ్ము
తెలియ లేని గాలి అలలు - ఝుంఝుల కెల్ల,
నరుని మనసు కేంద్ర గరిమ నాభి.

పరమ నీతి

న్యాయ నిర్ణయమ్ము నరుడు చేయగ లేడు !
ఎవరు ధర్మ సూక్ష్మ మెరుగ గలరు ??
సానుభూతి కంటె సహన శీలము కంటె,
'పరమ నీతి' యేది ? ధరణి మీద ??

నీతి

అధిక జనులు మెచ్చ - అదియె ధర్మము - నీతి !!
అదియె పరమ సత్య మనగ బరగు !
అఖిల విద్య లందు - వ్యవహార జగతిలో,
లేదు - నిత్య సత్య మేది లేదు.

గురువు

స్వాతి కార్తె లందు వాన చిన్కులు కొన్ని;
గురువు గారు తరచు కురియ వచ్చు;
చిప్ప చేసి గుండె - శిష్యుండు దరి చేర;
ఆణి ముత్తియమ్ము లగును - వాన.

వేత్త

వదలు గాత - వేత్త - పాండిత్య వరివస్య
ధనము మీది ప్రీతి - మనసు లోన,
ఊర కుండు సుకవి - యోగి, సన్న్యాసియే,
మారు రూపు - స్వేచ్ఛ - మానవతకు.

ధర్మ మనిన ఏమి ?? తాత్కాలిక సమీక్ష !
పలికె ధర్మరాజు పచ్చి బొంకు !
చింత వంత వీడి శ్రీ కృష్ణ పరమాత్మ !
పట్టె ఆయుధమ్ము ప్రతిన మరచి.

దర్పణము

దర్పణమ్ము లేక - ధరణిలో మనుజుండు,
తన ముఖమ్ము నరయ, తరము గాదు;
ప్రజలు చూడ వచ్చు - బాహ్యాంతరము లెల్ల,
కావ్య దర్పణమున కాంచు నెడల.

మంచి పనులు

సత్ క్రియలకు మధ్య - సంకల్పములకు మధ్య,
కాన రాని పెద్ద కడలి దాగు!
ధైర్య సాహసములు - త్యాగ శీలము లేక,
మనిషి చేయ లేడు - మంచి పనులు.

కర్మకాండ

ఉండు - మతము లందు - ఉయ్యాలలో నుండి
"కర్మకాండ" వల్లకాటి వరకు,
అవసరమ్ము కాని ఆచారములు గూడ,
వదల లేరు ప్రజలు - బ్రదుకు లోన.

మారు జగతి

చేయ గలవు - తరచు - సిద్ధాంతములు కీడు,
మారు చున్న జగతి - మనిషి బ్రదుకు;
సర్దుకొనుట మేలు - సమయ సీమల బట్టి,
నరుడు తన ప్రవర్తనమ్ము - భువిని.

రణము

వికట రణము నందు - ఒక బాంబు వెల యెంత ?
నాల్గు కోట్ల రూక నాణెము లట !
వెల - విమాన మైన - వింశత్యధిక కోటి,
ఊహ దాటు - వ్యయము - యుద్ధ మందు.

ముసుగు దొంతరలు

మోము కప్పి పెక్కు - ముసుగు దొంతరలతో,
తరచు మానవుండు తిరుగ వచ్చు,
మనసు తీరు వేరు - మాట లాడుట వేరు !
నరుని బ్రదుకు మేటి నాటకమ్ము.

జ్ఞాన యజ్ఞం

గడియ వేయ నేర - ఎడద తల్పులు మూసి,
మతము జాతి భాష మమత లేదు;
వెలుగు వచ్చు గాక - వేయి దిక్కుల నుండి,
ఏను - జ్ఞాన యజ్ఞ ఋత్విజుండ.

మేధావి

మేలు జగతి లోన - మేధావి ఒక డున్న;
ప్రతిభ గలిగి - ప్రగతి పథము చూప;
వాసి లోన - అతని దాసానుదాసులే!
ఉర్వి లోని - కర్మ యోగు లెల్ల.

పెండ్లి

పెండ్లి పేరు మీద పిచ్చి వేడ్కలు పెక్కు;
భరత దేశ మందు పెరిగి పోయె;
ఆలు మగల మీద - వ్యయము న్యాయము గాని,
గాలి లోన ధనము - కలుప నేల.

పెండ్లి

పసిడి వద్దు - రెండు పసుపు కొమ్ములు చాలు,
కట్ట వచ్చు తాళి బొట్టు చేసి;
వద్దు భోజనాలు - బాజా భజంత్రీలు;
పెండ్లి జరుగ కూర్మి పేర్మి చాలు.

అజాతమిత్రుడు

స్వర్గ మైన - మిత్ర వరుడు లేకున్నచో,
నరక లోక సమము నరుల కగును;
ఒక అజాత మిత్రు డుర్విపై ఉన్నచో;
అంత కంటె ఎవడు వ్యర్థ జీవి ?

బొమ్మ-బొరుసు

నాణెములకు వోలె - నరుల వైఖరు లందు,
అరయవచ్చు 'బొమ్మ బొరుసు' వరుస,
మనిషి చర్య వేరు - మాట వేరన నేల ?
తెలిసి కొనుట సులువు త్రిప్పి చూడ.

పాత్రదానం

ఇచ్చు నట్టి చేయి కెంతొ గౌరవ మబ్బు;
పూజ్య పాదు డొకడు పుచ్చు కొనిన !
పరమ పుణ్య మేది ? పాత్ర దానము కంటె ?
ఉభయ తారకమ్ము - ఉత్తమమ్ము.

అల్ప విషయాలు

జీవితమ్ము లోన - చిన్ని అంశాలలో,
నరుని శీల గుణము లరయ వచ్చు;
బయట పడడు పెద్ద బహిరంగ విషయాల;
నటన చేయ వచ్చు నరుడు తరచు.

సహాయం

నిండు గుండె తోడ - నిర్వ్యాజ రక్తితో,
సానుభూతి తోడ స్వార్థ మెడలి,
మంచి వాని కెవడు - కించిత్ సహాయమ్ము
చేయు - అట్టి వాడు శ్రేష్ఠ జీవి.

స్వాగతం

వందనార్చనములు - స్వాగతాహ్వానముల్;
మంద హాస ముద్ర లంద మొలుకు;
శక్తి యుక్తి కూర్చు - వ్యక్తిత్వమును పెంచు,
సహృదయులకు కలుగు సానుభూతి.

సేవ

బ్రదుకు నందు - స్వీయ హృదయ సంతృప్తికై,
చిరుత సేవ - చాలు - చేయు నెడల,
శిరముపై పవిత్ర పరిశేషమై నిల్చి ;
కానుపించు ప్రజకు కనుల ముందు.

కట్టు కథలు

అర్థ మరయ నేల - అంతరార్థమె - మిన్న !
కవన మందు - పిట్ట కథల యందు;
కట్టు కథలలో - త్రికాల సత్యము దాగు,
నివురు గప్పి నట్టి నిప్పు వోలె.

ధర్మసూక్ష్మం

శుద్ధ హృదయ మున్న - శ్రోత్రియత్వము లేక;
సూరి వరుడు ధర్మసూక్ష్మ వేత్త!
గాఢ నియమ నిరతి - మూర్ఖత్వ చిహ్నమే !!
బ్రదుకు కవసరమ్ము - పట్టు విడుపు.

దీక్ష

బాధ లెన్నొ తరచు-బ్రదుకులో రావచ్చు;
ఎపుడు సాధన విరమించ రాదు,
శుభము కలుగు తుదకు - చూపించుచో ఓర్పు;
కలుగ గలదు దీక్ష వలన - జయము.

దాత

మాట లాడ వచ్చు - మనిషి దుందుడుకుగా;
మెరపు తీగ వంటి మెదడు ఝళిపి;
వ్రాయ వచ్చు - గొప్ప గ్రంథాలు ప్రతిభతో,
"ధన్య జీవి" యెవరు ? దాత తప్ప.

ఆవేశి

సహృదయ ప్రవరుడు - సమయజ్ఞ చతురుండు;
కార్య సాధకు డయి కాంచు జయము ;
అంతరించు కేవ లావేశ భరితుండు,
తోడి వారి గూడ పాడు చేసి,

మానవ స్వభావం

మానవ స్వభావ మర్మజ్ఞు డెవడయ్య ?
మనిషి బోలు మనిషి మహిని లేడు!
అరయ వచ్చు కొన్ని ఆభాస సామ్యముల్,
భ్రమలు గుడ్డ పాదుగు బ్రదుకు గూళ్ళ.

బ్రదుకు

ఎంచ -మనుజు బ్రదుకు - ఋజు రేఖయా? కాదు;
హేతు రహితమౌ ప్రహేళిక గద;
భిన్న తాళ లయలు భీకర శ్రుతి రుతుల్;
బ్రదుకు - వింత నాట్య రంగ శాల.

వైరుధ్యములు

బ్రదుకు లోన కలవు ప్రకృతి వైరుధ్యముల్ !
మూఢ భక్తి - కనులు మూసు కొనును !
హేతు వాద మాగు -స్పృహ తప్పి - త్రోవలో!!
విశ్వ గూఢ శిల్ప వేత్త ఎవడు ??

పెండ్లి

పెండ్లి అన వినోద విక్షేపమా ? కాదు ;
దీర్ఘ సత్ర యాగ దివ్య దీక్ష;
రెండు నదులు చేరు - శృంగార తీర్థమ్ము
ఇచ్చి పుచ్చు కొనెడి మెచ్చికోలు.

పెండ్లి అయిన పిదప స్వేచ్ఛ తగ్గును కొంత;
త్యాగ గుణము కొంత అవసరమ్ము;
గొప్ప కలదు స్వేచ్ఛ కోలుపోవుట యందు ;
సామరస్య మందు సహన మందు.

కలి యుగాన - జరుగు వలపు పెండ్లిండ్లలో,
అచ్చ మైన ప్రేమ అమరు నెచట ?
హెచ్చ వచ్చు - జగతి - ఇక విడాకుల సంఖ్య;
అంతమౌ కుటుంబ శాంతి తరచు.

దాత

నిలువ నీడ లేని - నిరుపేద గుడిసెకై,
దాన మిచ్చు వాడు ధరణి లేడు !
దేవళములు కట్ట - దేదీప్యమానముల్,
నేత నిలుచు-ముందు దాత నిలుచు.

ముదుసలి

అంద చేయ లేవు మందు లారోగ్యమ్ము;
వయసు మళ్ళు ముసలివారి కెపుడు;
చెంత చేరి చెప్ప - చెవుల కింపగు మాట,
సంతసించి వారు గెంత గలరు.

పువ్వు

చిందు - పువ్వు - తావి అంద చందాలలో;
కమ్మ తెమ్మెర నును కౌగిలింత,
సంభ్రమింప జేయు చదలేటి కెరటాల
ప్రౌఢ రజని - మణిత రవము లోకి.

యోగ్యత గురుతించు ఉపకార హృదయమ్ము;
ఉత్తమోత్తమమ్ము - ఉజ్జ్వలమ్ము!
దేవు మీది భక్తి దేశమ్ముపై భక్తి;
గొప్ప గుణము లంచు చెప్పలేను.

సేవ

చిత్తశుద్ధి తోడ - చేసినట్టిదె - సేవ;
సేవ చేయ దగును సేవ కొరకె.
అభ్యుదయము కలుగు ఐహికమ్ముగ గూడ,
గొప్ప తృప్తి గూర్చు గుండె లోన.

పిన్న నవ్వు

మెలగ వలయు - మనిషి - మిథ్యా భ్రమల మధ్య,
జగతి యెల్ల - స్వప్న సమ్మితమ్ము !
వివిధ మమత లేల? వేడి బాష్పము లేల ?
పిన్న నవ్వు చాలు - పెదవి మీద.

హాస్యం

కలదు - హాస్య మందు - సులభ వేదాంతమ్ము !
ధరణి నెల్ల క్షణము మరువ వచ్చు;
పారద్రోలు భ్రమలు - పరిహాస రసికుండు;
కలుగు రక్త నాళములకు - శుద్ధి.

అలతి నవ్వు

మంద హాస మౌన మధుర విన్యాసమ్ము
చిమ్మ చీకటి తెర చెదర గొట్టు ;
సంతసమ్ము గొలుపు సందేహ హృది లోన,
స్వాగత యుత నాంది - అలతి నవ్వు.

ప్రేమ

ప్రేమ శబ్దమునకు పెద్ద వ్యాఖ్యానమ్ము
సృష్టి యంత నిడివి చెప్ప వచ్చు!
అవనిలోన నిత్య నవనవోన్మేషమ్ము ?
నాడు-నేడు రేపు వాడి - ప్రేమ.

నీరు లేని ఇసుక టేరు - లాభము కాదు,
నరుల కేమి మేలు? వరద వలన ?
" ఆన కట్ట " కట్ట అభ్యున్నతులు కలుగు,
పంట పండు - కాల్వ పారు నపుడు.

అందకత్తె గూడ - అభిలాషలను పేర్చి,
కోరు కొనును నగలు చీర డాబు ;
గ్రంథకర్త కోరు రంగు రంగుల అట్ట;
విడిచి పెట్టి అసలు విలువ లెల్ల,

చుట్టు దారి

తమ్మి మొగ్గరమ్ము - ధరణిలో బ్రదుకన్న;
దుడుకు చురుకు తోడ దూర వచ్చు;
తేలిక పని గాదు తిరిగి వచ్చుట యన్న,
చుట్టు దారి తరచు సులువు శుభము.

మార్పు

అవని లోన మార్పు- అవతరించిన మీద,
విలువ పెరిగె - శ్రమకు - విశ్వ మందు,
జాగృతు డయి స్వీయ శక్తి సామర్థ్యముల్,
కార్మికుండు తెలియ గలిగె నేడు.

మాతృహృదయం

నిర్వికల్ప మైన - నిత్య సత్యము గదా,
బిడ్డల పయి తల్లి ప్రేమ తలప;
ధరణి యెల్ల - అరయ - ధన మూల మగు గాక ;
మరచి పోయె - మార్పు - మాతృ హృదిని.

శీలం

జీవితమ్ము నందు - శీలమే ముఖ్యమ్ము;
అల్లి బిల్లి కవిత లల్ల నేల?
సభల లోన నీతి ఝుంఝూనిలము లేల ?
బిచ్చ మొక్క ముద్ద వేయ - మేలు.

గాంధి

అతని తెగడ దలచి - అరుదెంచి శాత్రవుల్,
చేరి దరికి తుదకు శిష్యు లైరి;
అత డజాత శత్రువౌ మహాత్ముడు - గాంధి!
గుండె కదిపి కుదిపి కొలుతు నతని.

ముఖేముఖే ప్రతిభా

వేరు వేరు చోట్ల - వేరు ప్రజ్ఞలు తోచు,
గొప్ప ప్రతిభ ఒకరి గుత్త కాదు;
కొదమ సింగ మరయ గొప్పదే వని లోన;
ఎలుక కొరక గలదు వలను వేగ.

పాపి

నాటి చరిత కలదు - నేటి యోగికి కూడ,
పుట్టు పాపి లేడు పుడమి మీద,
భావి కొంత కలదు - పరమ పాపికి కూడ,
నిర్ణయించ నేల? నేడె మనము.

నరుడు

తెలియ - మానవుండు -దేహ దాసుడు సుమ్ము;
పాంచ భౌతిక ప్రపంచ మందు,
జీవకణ రహస్య శృంఖలా బద్ధుండు;
ధరణి - స్వేచ్ఛ యున్న నరుడు కలడె?

సేతువు

పాత పద్ధతులకు - భరత వాక్యము చెప్పి,
నాంది పలుక వలెను నవ్యతలకు,
క్రొత్త పాతలకును - కూర్మి సేతువు కట్టి,
వేగ ప్రగతి బాట వేయ వలెను.

సంప్రదాయాలు

సంఘ మందు మొదట సంప్రదాయము లెల్ల,
ప్రజల మేలు కొరకె ప్రభవ మందు;
కాని - కీడు చేయు - కాల దోషము పట్టి;
వదల వలయు అట్టి వాని - వేగ.

దారిద్ర్యం

" తల్లి రత్న గర్భ - తనయుండు నిరుపేద "
భరత దేశ మందు - పచ్చి నిజము;
పార ద్రోల వలయు దారిద్ర్యమును ముందు;
విద్య పెంచు పిదప విలువ లెల్ల.

త్రసరేణువు

నాస్తికుడను గాను - ఆస్తికుండను గాను;
తత్త్వదర్శనముల తరచ లేను,
జ్ఞాన సాధకుడను గాను- జీవితమ్ములో,
సృష్టిలో ఒక త్రస రేణు వేను.

యోగ యోజనము

లోక సంగ్రహార్థ మేకాంత మేధావి,
మాన్యతమ తప స్సమాధి నిష్ఠ,
కోరి కూర్చు కొనును గుండె లోపల దాచి,
ఉజ్జ్వల మగు యోగ యోజనమ్ము.

మననశీలి

ఆది యందు నుండు - ఆలోచనమె గదా
అరయ తదుపరి గద - ఆచరణము,
సేవ పిదప వచ్చు -సిద్ధాంతములు ముందు !
మాన్య తముడు శుద్ధ మనన శీలి.

నాట్యరేఖ

కానుపించు జీవ కాంతి చైతన్యమ్ము;
నరుల హావ భావ నాట్య లయల;
నాటకమ్ము వేరు ! నాట్య రేఖిక వేరు,
కలదు - నాటకమున - కాల్పనికత.

కర్తవ్యం

మన కవశ్య వర్తమాన కర్తవ్యమ్ము;
ఇంక క్షణము ఆలసింప రాదు.
వాలు నీద వచ్చు - కాల స్రవంతిలో,
కార్య సిద్ధి సులువు కదలి రమ్ము.

చిన్న ఉద్యోగస్థులు

చేయ వచ్చు తరచు చిన్న ఉద్యోగముల్,
గుండె పండి నట్టి గొప్పవారు;
ఉండు - అట్టి వారి కుపకార శీలమ్ము
ఉండు గొప్ప జ్ఞాన యోగ దృష్టి.

విధి విఘాతం

పైస పైస ధనము బ్రదుకులో శ్రమ చేసి,
ప్రోగు చేయు చీమ వోలె - నరుడు,
విడువ వలసి వచ్చు విధి విఘాతము చేత,
మాయదారి డబ్బు -మానవుండు.

అవమానం

వేటు - కత్తి తోడ - వేసినాడవు చాలు,
అటమటించు చుండె ఆత డిపుడు!
అదనముగ కడంగి- అవమానమును గూడ,
కూర్చ నేల - జంకు గొంకు లేక?

పాలవాడు

వాన కురియు గాక - వడగళ్లు పడు గాక,
వచ్చు - రవికి ముందె పాలవాడు;
మరణ మొంద వచ్చు పౌరు గింటి మిత్రుండు,
వచ్చి - వెడల గలడు పాలు పోసి.

సత్యం

తప్ప కుండ - కొన్ని తంటాలు వెనువెంట
వచ్చు చుండు - "నిజము" - పలుకు నపుడు!
అమరు సత్యమున -స్వయం ప్రకాశ ప్రభల్;
సత్య సంధునకును జయము జయము.

లోక మందు లేదు -ఏకైక సత్యమ్ము,
పృథివి - ఖండ సత్య నృత్య శాల,
వాద సాగరమ్ము -ద్వైపాయనుండుగా,
ఈదు సామరస్య వాది - సుకవి.

నిజము- నీతి

అవతరింప వచ్చు అల్ప సంఖ్యాకుడై!
నిజము మీద నిష్ఠ-నీతి గలిగి;
ధనము చదువు - కులము తక్కువౌ మనుజుడే
ఉర్వి మీద వినయ యోగి యగును.

నమ్మకం

నమ్మకమ్ము లేదు నాకు నమ్మకముపై,
తెలుప గలను - నాకు తెలియ దంచు.
జగతి లోన లేడు సర్వజ్ఞు డెవ్వండు;
నరుని మెదడు కొంత వరకె అరుగు.

రాకి

కనుల పండు వౌను - కట్టు నపుడు చూడ
రాకి కంకణమ్ము - రక్తి కట్టు,
చూడ ముచ్చ టగును - తోడ పుట్టువు కూర్మి
నిండి - పొంగి పొరలి గుండె నుండి.

అగ్ని

అగ్ని తోడ - కోరి ఆట లాడెడు వారు,
అప్పు డపుడు దగ్ధ మగుట కద్దు;
అరయ బ్రదుకు పెక్కు ఆట పాటల కూర్పు;
నిప్పు-నీరు వెలుగు నీడ చేరు.

అవతారపురుషుడు

ఉన్న యెడల నుర్వి - ఒక వ్యక్తి లోననే !
 చదువు పదవి యెడద మెదడు - ధనము;
ఆ మహానుభావు డవతార పురుషుడే !!
 నరక భువిని మార్చు నాకముగను.

కాలం

కాల మనిన - క్లిష్ట గణిత ప్రహేళికే !
 దేవ మాన పరిధి తెలియ వేరు,
తమ్ము డగును అన్న - తారా పథము లోన,
 యాత్ర చేసి మరల అవని చేర.

చేదు నిజాలు

కొన్ని చేదు నిజము లున్న వీ జగతిలో !
 ప్రతిభ - అణగ ద్రొక్క బడును - తరచు !
పరమ శుంఠ గూడ పైకి వచ్చుట కద్దు,
 దేవు డున్న - నిద్ర వోవు నెచటొ.

ఉదయం

విడువ వలయు - ప్రొద్దు పొడువ కుండగ - శయ్య;
 వేగ నిదుర మత్తు వీడ దగును;
చురుకు చొరవ చూపి - సుజనుండు దినచర్య,
 మొదలు పెట్ట దగును - ఉదయ మందె.

శుంఠ

మేటి ప్రతిభ యున్న మేధావి కావచ్చు!
 ఉండ వచ్చు మంచి గుండె గూడ,
అరయ బాగు పడడు దురదృష్ట వంతుండు;
 పైకి వచ్చు తరచు వట్టి శుంఠ.

హృదయం

జీవితమ్ము లోన - రావచ్చు పోవచ్చు;
వస్తు వాహనాలు - పదవి - ధనము:
హృదయ మెరుగ వలయు - అదె తులాభారమ్ము!
విలువ గట్ట వేరు వెరవు లేదు.

పర పరాగ సంమోగం

స్వ మత మమత - అహము - స్వ కులాభిమానమ్ము
స్వీయ దేశ భక్తి - స్వీయ భాష,
సంఘ జీవితమున - స్వ పరాగ యోగమ్ము,
నరుని మెదడు నెపుడు పెరుగ నీవు.

సర్వతో ముఖ మగు సంస్కారమును గూర్చు,
పర పరాగ యోగ బాంధవమ్ము
సృష్టి శిల్ప సిద్ధ చేతనా ప్రగతిలో
మనుజ రక్త సార మర్మ మందు.

అరయ అన్య భాష - పరదేశ గమనమ్ము,
భిన్న కులము లందు ప్రేమ పెండ్లి,
సాంస్కృతికముగ - మరి - సాంఘికమ్ముగా,
పర పరాగ నిరతి - ప్రగతి గూర్చు.

కోడలు

తరలి - మెట్టి నిల్లు - తల్లి దండ్రుల వీడి,
కోడలరుగు దెంచు కూర్మి, పేర్మి
ప్రేమ ఆదరణము పెను మక్కువల్ చూపి,
అత్త మామ లామె నరయ వలెను.

"చిత్త శుద్ధి" యున్న శీలమే - ముఖ్యమ్ము
విషయ సంకలనము విద్య కాదు;
మెదడు పెరుగ రాదు - హృదయమ్ము క్షీణించి,
మంచి తనము మేలు మనుజు లందు.

తెలివి

విద్య లేని - వినయ విమల మూర్ఖత్వమే,
వెన్నెల వలె - చలువ వెలుగు లీను;
వెలయు - వాడి ముండ్లు - తెలివి తేటల లోన,
నివురు గప్పి నట్టి నిప్పు లుండు.

చర్య

ఆత్మ హత్య కొరకు యత్నించు మనుజుండు
చంప దలచు వాని సరకు గొనునె?
చేయ దగును చర్చ - జీవ దాకాంక్షతో,
అఖిల లోక సంగ్రహమ్ము కొరకు.

ఋషులు

ప్రజ్ఞ యున్న ఋషులు - ప్రచ్ఛన్న బౌద్ధులే,
అభినయించి నార లాస్తికులుగ,
అవసరమ్ము - స్రష్ట - అజ్ఞాన యుగములో;
మనుజ హితమె గొప్ప మతము - నేడు.

సహకార యోగం

ప్రజ్ఞ చూపు - ప్రక్క వాద్యాల వల్లనే;
గాయకుండు యశము గాంచు చుండు;
జయము గూర్చు తరచు సహకార యోగమే
పదవి - నేత - పొంద వచ్చు - తుదకు.

విశ్వరాజ్య సిద్ధి

సమత - స్వేచ్ఛ - విశ్వ సౌభ్రాత్ర యోగమ్ము ;
బుద్ధ దేవు క్రీస్తు బోధ గరిమ ;
అవని జనుల కనుభ వామ్రేడితమె గదా !
విశ్వ రాజ్య సిద్ధి- వెలయు గాత.

అరబొంకు

పూర్తి బొంకు రేగి - పుడమి తారాడునా?
ప్రజలు వేగ గుర్తు పట్ట గలరు;
అంత కంటె గూడ అర బొంకు కలిగించు,
పెను ప్రమాదములను జనుల కెపుడు.

పిరమిడ్లు

పెద్ద రాళ్లు పేర్చి - పిరమిడ్లు శ్రమ కోర్చి,
కట్టినారు పూర్వ కాల మందు ;
వ్రాయ వచ్చు పెద్ద గ్రంథమ్ము లీ నాడు,
శ్రమకు నోర్చి అక్షరాలు పేర్చి.

స్నేహం

జీవితమ్ము నందు - స్నేహ యోగము కంటె,
లేదు తీయ నైన దేది లేదు ;
పుచ్చు కొనెడి వేళ - ఇచ్చి నప్పుడు గూడ,
చెలిమి కూర్చ గలదు చిత్త తృప్తి.

స్వస్తి

ఏది పరమ నీతి? ఏకైక మత మేది ??
సర్వ మానవ సుఖ సంగ్రహమ్ము ;
సహన గుణమె సుమ్ము - జ్ఞాన పారమ్యమ్ము ;
శాంతి సాధమునకు - స్వస్తి గీతి.

భిన్న ధ్రువాలు

విశ్వ శిల్ప మందు - భిన్న ధ్రువాలలో,
ఉన్నది గద గొప్ప యోగ మాయ;
సృష్టి సూత్ర మిముడు శృంగార లీలలో!
భిన్నతా సమైక్య విద్య - ప్రేమ.

భగవంతుని నీడ

"రవి కాంతి యనిన నేమో
వివరింపుము నీవు నాకు వేదాంతీ!" "తద్
రవి కాంతి యనిన జాగ్రత్త
గ వినుము భగవంతు నీడ గదరా శిష్యా."

ఊహలు

ఎచట నుండి వచ్చె? ఈ ప్రపంచము లోకి,
చచ్చి పోయి ఎటకు జనును మనిషి?
ఏ సదుత్తరములు ఈ ప్రశ్నలకు లేవు?
ఉత్త ఊక దంపు ఊహ లేల?

స్థాయి

ఏన్గుల తిను వాడు పీన్గు జోలికి పోడు;
అమరి యుండు స్థాయి అన్ని పనుల;
చేయు క్రియల యందు చిత్తానుగమనమ్ము;
శ్రుతులు లయల పొత్తు చూడ వలెను.

విద్య

స్వేచ్ఛ నేర్ప వలయు -విద్యా విధానమ్ము;
బాల బాలికలకు బ్రదుకు లందు,
చేర్చు - కాన రాని శృంఖలమ్ములు పెక్కు;
మానవులకు జాతి మతము భాష;

మనుజుడు

జనన మందు ముందె - మనుజ మాత్రుల కెన్నొ ;
విధి నిషేధములును పెక్కు కలవు ;
బ్రదుక వలయు కాన రాని సంకెళ్లతో !
ఇనుప కట కటాల మనుజు లెల్ల.

మంచి పనులు

చదువు రాని వారు - సజ్జనుల్ జగతిలో ;
చదువు కొనిన దుష్ట జనులు గలరు;
మంచి పనులు మేలు - మంచి మాటల కంటె ;
గుండె - కలము కంటె గొప్ప దెపుడు.

విద్య - కలుపు నరుల విభజింప కుండగా
వెనుక బడియె మతము విశ్వ మందు,
జ్ఞాన విప్లవమ్ము - జగదేక రాజ్యమ్ము ;
ఐక్య పార్లమెంటు నాదు కొనుత.

విద్య

మతము విడిచి పెట్టి - మానవత్వము మీద,
నెరపు గాత - విద్య - నిష్ఠ నింక ;
మానవులను - తరచు మతములే విభజించె!
విద్య - కలుప వచ్చు - విశ్వ మెల్ల.

పూనకం

వేప రెమ్మ బట్టి వెలది గంతులు వేయు,
జాతర సమయమున జనుల ముందు,
కలము చేత బట్టి - కవి వరేణ్యుడు నాడు,
కాన రాని పూనకమ్ము వచ్చె.

మైల

మానసికములు గద - మడి మైల లన నేమి?
వికట విధి నిషేధ వేష్టితములు;
వేత్త వేరు ! మూఢ విశ్వాసములు వేరు !
వీడ రాదు నరుడు స్వేచ్ఛ నెపుడు.

కావ్యం

మేటి మెదడు గొలుపు మిరుమిట్లు నిగనిగల్,
లౌక్య నీతి చాకచక్య గరిమ,
అడ్డ దొడ్డి దారి అభ్యున్నతోన్నతుల్,
మంచి తనము నెపుడు మించ లేవు.

హేతువాదం

హేతువాద మెపుడొ ఎచటనో ఒక చోట
ఆగిపోవు ముందు కేగ లేక,
హేతువాదము పయి ఏకాంత వరివస్య ;
గ్రుడ్డి నమ్మకమ్ము కోవ - ఒకటె.

హేతువాదమున కతీతమౌ సత్యమ్ము;
ఊహ కంద నట్టి దుండ వచ్చు;
ఆకసమ్ము వంటి దమిత విజ్ఞానమ్ము;
అంది నటులె తోచు అంద కుండ

జయము

కలుగు జయము -పురుష కారమ్ముతో పాటు,
దైవ శక్తి కలియ - జీవితమున,
మేటి ఆట గాని మెదడుతో పాటుగా;
చేత మంచి చీట్లు చేర వలెను.

దానం

ఆకలి గల మనిషి కాహార మిడు టొప్ప;
మంచి నీరు నిడిన - మజ్జిగ నిడ,
మాన్య దాత కెట్లు మర్యాద యొనగూడు?
జ్ఞాన యజ్ఞ మరయ దాన మనిన.

దాత

అధిక ధనము కడగి ఆర్జింప గల దిట్ట!
వేయి కొక్క డుండు - విశ్వ మందు ;
ధనము - ప్రోగు చేసి - దాన మిచ్చెడు దాత ;
ఉర్వి - లక్ష కొక్క డుండ వచ్చు.

మూల నిధులు

ప్రకృతి కూర్చు - మూల వస్తు జాలము లెన్నొ ?
యుగ యుగాల మేర -జగతి యందు !
కోరి - మానవుండు - కొన్ని రోజుల లోన,
వ్యయము చేయ గలడు - వాటి నెల్ల.

చర్చ

చర్చ చేయు నెడల - శత్రు వర్గము తోడ;
పదను పెట్ట వచ్చు మెదడు కొనల,
యుక్తి పెరుగు - పెరుగు - శక్తి సామర్థ్యముల్,
ఎదుటి వ్యూహములను ఎరుగ వచ్చు.

నేత

నేత-వర్తమాన నేపథ్యముల బట్టి,
చేయు పనులు రాజకీయ మందు,
చూడ లేదు నేత - సూత్ర సిద్ధాంతముల్ !
నేల మీది వాస్తవాలు వీడి.

కుహనా దారిద్ర్యం

అహ మణగగ బిడ్డలకును
కుహనా దారిద్ర్యము బ్రదుకుల కూర్చినచో;
ఇహమున అభ్యున్నతికై,
తహ తహ వారి హృదయముల తాండవ మాడున్.

హాని

ఉర్వి మీద ఏల ఉద్భవించితి నేను ?
నేల మనిషి బ్రదుకు - నీటి బుడగ
ఎపుడు చేయ రాదు - ఎవరి కైనను హాని,
చేత నైన మేలు చేయ దగును.

ముదుసలి

ముందు చచ్చి నట్లు ముక్కాలు భాగమ్ము
అరయ లేడు ముసలి నరుడు తరచు;
మెలగు చుండు - మునిగి మిథ్యా జగత్తులో !
వివిధ మమత లేవి వీడ లేడు.

దాత

ప్రతిభ గుర్తు పట్టి - బహుమాన మిచ్చుచో,
ప్రగతి - వెల్లి విరియు - జగతి యందు;
పెంచ గలడు - "దాత" ద్విగుణీకృతమ్ముగా,
మనుజు లందు అణగి మణగు - ప్రజ్ఞ

జన్మ చేత - లేశ శక్తి సామర్థ్యముల్,
చాలు - కలిగి యున్న - చాలు - చాలు;
గొప్ప దనము చదువు కుర్చీలు కల్పించు;
మేటి నాటకాల మించ వచ్చు.

అరసి పొంచి వేచి - ఆరాధనము సల్ప,
గురుని మించు శిష్య పరుడు - తుదకు;
కాగడాయె వెలుగు కాంతి రింఛోళితో;
ప్రమిద వలనె మొదట ప్రజ్వలించి.

సంజ జిలుగు

సరిగమపద నిసల సంజ కెంజాయలే,
రాత్రి పగల మధ్య రక్తి కట్టు ;
సకల కళల యందు - సర్వ శాస్త్రము లందు,
తరచు "సంజ జిలుగు" తాండవించు.

తుమ్ము

వెడలు "తుమ్ము" వెలుగు వేగము మించి,
సింధు పాత బిందు శీకరములు,
దుందుభీ మృదంగ బృంద రావము రేగు !
జంద్ర వాద్య గాన సరణి బోలి.

వికట నాసికాగ్ర విక్షేప విక్రాంతి,
దేహ పాటవమ్ము తెలుపు - తుమ్ము;
వెడలు - ముక్కు నుండి వేపథూత్థానముల్ !!
నిరరీ తరంగ నిస్వనములు.

సానుభూతి

తానె శిష్టు డంచు - తదితరుల్ దుష్టులే,
యంచు మూర్ఖు డెవడొ ఎంచ వచ్చు;
ఎదిరి కష్ట సుఖము లెరిగి పల్కుట మేలు,
"సానుభూతి" గొప్ప సద్గుణమ్ము.

విశ్వ శిల్పం

సృష్టి నరసి నపుడు -హెచ్చు మార్కులు పూని,
విశ్వ శిల్పి కేను వేయ లేను;
సృష్టి చేసె మాతృ హృదయమ్ము జగతిలో,
అతని ప్రతిభ నెంచి అభినుతింతు.

మెదడు

చూడ - సృష్టి- యెంత సువిశాల మైనదో !!
కాల మన అనంత గణిత హేల !
వెలుగు వెదుక దగును - విశ్వాసములు వీడి,
మనిషి - తెరచి యుంచు కొనుత - మెదడు.

అవధి

ప్రతిభ యందు గాని - పాండిత్యమున గాని,
ధనము నందు మంచి తనము నందు,
అవధి - ఎదుగు వారి కాకాశమే గదా ,
ఆగ కుండ - ప్రగతి - సాగు గాక.

వక్త

అరసి వేయ దగును - అపరాధ శుంకమ్ము
పావు గంట దాటు వక్త పైన;
ధనము నపహరించు మనుజుడే దొంగయా ?
కాన రాని దొంగ - కాల హర్త.

స్నేహం

బ్రదుకు నందు పెక్కు బంధాలు విలసిల్లు;
శ్రేష్ఠ మైన దండ్రు స్నేహ నిరతి;
నిండు గుండె పండు నిర్వ్యాజ తత్త్వమ్ము !
సానుభూతి - ప్రేమ - సంగమించు.

అనుబవం

అనుభవమ్ము - మనిషి కాధిక్యమును గూర్చు ;
చదువు తెలివి కంటె - బ్రదుకు నందు ;
నాలుగవ కొలతను నరునిలో సమకూర్చు ;
అనుభవమ్ము సాటి అవని లేదు.

తేనె సీసాలు

తిట్టు నట్టి వారు - తేనె టీగల వోలె;
కూర్చ వచ్చు మధువు గూడ తరచు;
సేకరింప వచ్చు - సీసాలలో తేనె,
జనులు కొంత మంది - చతుర మతులు.

మనసు

అరయ గొప్ప దేది? - నర దేహమున యందు
మనిషి మనసు మేటి మహిమ గలది!
మాన్య యోగ మేది? మానసోద్ధరణమే,
వైద్య విద్య -మనసు - వదల రాదు.

పండు

కాయ పండుగ నగు - కాలాను గుణముగా!
పేర్మి చెట్టు మీద పెంపు చెంది;
గుండె పండు టనిన కొంత కాలము పట్టు;
అనుభవాల మేట - మనిషి బ్రదుకు.

ఇంద్రియాతీత జ్ఞానం

ఎన్నొ కలవు శక్తు లింద్రియాతీతముల్!
ఎరుగ లేడు వాని నెల్ల నరుడు;
అర్థమైన చాలు అజ్ఞాన తిమిరమ్ము,
వేచి యుండ వచ్చు వెలుగు కొరకు.

స్నేహం

వెడలు నెడల ఐక్య విద్యుత్ తరంగాలు;
నరుల యందు స్నేహ నిరతి కూర్చు,
బయట పడును భావి పరిశోధనల వల్ల,
నేటి ఊహ దాటు నిజము లెన్నొ.

గురువు

చెప్ప వచ్చు - గురువు - చిలుక పల్కులు కొన్ని;
ప్రజ్ఞ మెరయ ఋషి సుభాషితములు;
ఆచరింప కుండ - అవగాహనము లేక,
వినెడి జనులు భ్రమల మునిగి తేల.

ధనం

మనుజు డణచి వేయ ధన కాంక్ష బ్రదుకులో,
ఒక మహాత్ము డగును - యోగి యగును,
రూప మందు మనిషి - కాపలా కుక్క యే,
ధనము దాచు లోభి - మనిషి కాడు.

విద్యుత్ తరంగాలు

వేల కొలది వెడలు విద్యుత్ తరంగాలు
ఉదయ మంది నరుని మెదడు నుండి,
యాత్ర మధ్య మందు ఆకస్మికమ్ముగా;
చేరి మరొక మెదడు దూర వచ్చు.

తప్పు

చేయ కుండ తప్పు - జీవించ గల్గునా ?
అవని మనుజు డెవ్వ డైన గాని ?
అగ్ని -ధూమ రహిత మైన దెచ్చట నుండు ?
దాన మాత్మ సలుపు స్నాన మగుత.

దాత

నరక భయము చేత - నాక సౌఖ్యము కోరి,
దాన మిచ్చు వాడు -త్యాగి కాడు,
ఉన్న యెడల గొప్ప ఉపకార హృదయుండు;
నాస్తికుండు - మేటి - నరుల యందు.

తల్లి తండ్రి పేరు తలపోసి - ఏటేట
తద్దినాలు పెట్ట- తప్పు గాదు;
మతము పేరు మీద - మంత్ర తంత్రము కూర్చి,
స్వేచ్ఛ నెపుడు చంపి వేయ రాదు.

తత్త్వమసి

తెలియ - ప్రతి మనుజుడు - దివ్యాంశ జనితుడే!
"త త్త్వమసి" పలుకును తలప వలయు;
అణగి యుండు అణువు నందు - బ్రహ్మాండమ్ము;
విశ్వ శిల్ప సూక్ష్మ వేత్త - ఎరుగు.

సంగీత సాహిత్యాలు

గంగా యమునల వలెనే;
సంగమ మొందుచు సతతము సాహిత్యముతో,
సంగీతము సాహిత్యము
పొంగారుచు తెలుగు హృదుల పొంపిరి వోవున్.

అమెరికా-ఇంగ్లండు

ఆంగ్ల భాష-కలిపె - అమెరికా ఇంగ్లండు,
కడలి వేరు చేసె గాని - నాడు!
ఇపుడు - కడలి కలుపు ఇంగ్లడు నమెరికా;
అరయ వేరు చేయు ఆంగ్ల భాష.

భ్రమలు

జగతి - బ్రదుకు భ్రమలు - ఝుంఝూటములు పెక్కు,
కంటక మకుటములు - కలల అలలు;
కొరవి దయ్యములును నరుల గుండెలు చేరి;
వెక్కిరించ వచ్చు వెనక ముందు.

సంప్రదాయాలు

చాల వరకు తరచు కాల దోషము పట్టు,
సంప్రదాయములకు సంఘ మందు;
స్వస్తి చెప్ప గలడు - సాహస ప్రాజ్ఞుండు,
సంప్రదాయములకు సంఘ మందు.

జ్ఞానం

అరయ - జ్ఞాన మెల్ల - ఆభాస సత్యమే !
పృథివి - ఒక్క నలుసు - సృష్టి లోన !!
మనుజు డన్న ఎంత ? మనుజు మానస మెంత ?
విఱ్ఱ వీగు నరుడు వెఱ్ఱి మొఱ్ఱి.

మంచి

మతము గితము వద్దు - మానవత్వము చాలు !
మాతృ భాష మీద మమత వద్దు;
నీతి చాలు - వద్దు - జాతీయ భావమ్ము ;
మంచి నెంచి గౌరవించ దగును.

వేటు

గాయ పరుప - లోన - కాంక్ష యుండును గాని,
వేటు - కొంత మంది - వేయ లేరు;
పడయు గాత వేగ - బ్రదుకులో మనుజుండు,
వీర మరణ మైన - విజయ మైన.

ధర్మం

ప్రజలె - దైవ మంచు- పలుక వచ్చును - నేత,
వట్టి గొఱ్ఱె మంద ప్రజ లటన్న,
చపల మైన వేవి? జనుల వాక్కుల కంటె ?
ధర్మ మగుత- మార్గ దర్శకమ్ము

ఆగ్రహం

ఆగ్రహమ్ము వలన - ఆయుస్సు క్షీణించు;
జీవ కణ శతములు శిథిల మగును,
అందు కొనిన - సచ్చిదానంద సంక్రాంతి;
ఆయు రభ్యుదయములు అధిక మగును.

జాప్యం

గాఢ శీఘ్ర చర్య - కర్తవ్యమున కాత్మ
జయము కూర్చ లేదు - జాప్య మెంపుడు;
తత్క్షణమ్ము సలుపు దానమ్ము రాణించు,
న్యాయ నిర్ణయమ్ము నాప రాదు.

కార్యదర్శి

మోయ లేని బరువు మోపెత్తు కొన వచ్చు;
గడుసు దనము లేని కార్యదర్శి !
సానుభూతి గలిగి - సంస్కారమును గల్గి,
సహకరింప దగును సహృదయుండు.

క్రొత్తకాలమానములు

నేను - బుగ్గి కొంప నివసించు చున్నాను !
అగ్ని దగ్ధ మయ్యె అహము గూడ,
కూర్చు కొనెద క్రొత్త కొలమానములు కొన్ని,
మిగిలి యున్న వెడద మెదడు నాకు.

దూరదర్శనం

కడుపు విందు కంటె - కనుల విందులు మేలు
తిరిగి చూడ నేల ధరణి యెల్ల?
వేడ్క కానుపించు వివిధ దృశ్యము లెల్ల,
"దూరదర్శనమ్ము" - దొడ్డ విందు.

దూరదర్శనం

శుభ్రపరచి మెదడు శూన్యమ్ము చేయుచో,
సంతరించు కొనును కొంత శాంతి,
తొలగి పోవు శాంతి దూరదర్శనముచే
కనులు మూసు కొనిన కలుగు మేలు.

మందులు

ఔషధాలు వాడు టంత మంచిది గాదు;
కూర్చ వచ్చు - మందు - క్రొత్త వ్యాధి;
ఉత్తమోత్తమమ్ము ఉపవాస నిష్ఠయే;
ఎంచ పరమ శుభము మంచి నీరు.

సంస్కారం

చంప రాదు హృదయ సంస్కార మిసుమంత,
సర్వ మనుజ సంఘ సౌఖ్య కాంక్ష;
మానవుండు పూని - జ్ఞాన దీధితి పైన
ప్రేమ గౌరవాలు పెంచు కొనుత.

యుద్ధం

యుద్ధ మనిన ఏమి? శుద్ధ జాంతవ హింస;
మానవత్వమునకు స్థాన మేది!
వచ్చు నెడల వేగ వసుధైక రాజ్యమ్ము;
ఆగి పోవు రణము లవని లోన.

జయం

"ఎచట ధర్మ ముండు అచటనే జయ ముండు"
మృదు మధు ప్రవచన మది తలంప !
న్యాయ మోడి పోయె అవనిలో పలు సార్లు !
పశు బలమ్ము తరచు ప్రభుత నెరపె.

విజ్ఞుడు

అజ్ఞునకు కలుగు సదానంద యోగమ్ము।
జ్ఞాని యందు పెక్కు శంక లిముడు ;
విజ్ఞు డెపుడు సతత జిజ్ఞాసువే కదా,
వెదకు నతడు నూత్న విద్య కొరకు.

పరమనోయానం

ప్రాణములను తార్చు పరకాయ యానముల్ ;
కట్టు కథల రక్తి కట్ట వచ్చు;
వాస్తవ జగ మందు పర మనో యానముల్ ;
గొప్ప విజయములను కూర్చ గలవు.

సంగరము

ఆగ కుండ పడును అగ్నిలో శలభాలు !
సంగరాలు విశ్వ చరిత - జరిగె,
అణచ తగును నరుల ఆత్మ హత్యా కాంక్ష;
ఆప వలెను ఇంక ఆహవములు.

ఉత్పత్తి

మంచి ఊహ లెల్ల- మంచి కార్యములుగా;
పరిణమించ లేవు - బ్రదుకు నందు;
ఉత్తమోత్తమమ్ము - ఉత్పత్తి పెంచుటే,
కలల అలలు వద్దు - కవిత పెద్దు.

జాగృతి

మంచివారు నిదుర మైకమ్ములో నుండ,
దుండగీండ్రు ఇల్లు దోచ వచ్చు!
నిర్విరామ నిత్య నిర్నిద్ర - జాగృతుల్ ;
ఆత్మ రక్ష కొరకు అవసరమ్ము.

సేవ

" చిత్త శుద్ధి " - ప్రజకు - సేవ చేసిన - కల్గు;
మరణ శయ్య మీద - పరమ తృప్తి;
బ్రదికి యుండి నపుడె పడయు నిర్వాణమ్ము !
జాలి గుండె యున్న సజ్జనుండు.

ఆలోచనము

అరయ జీవితమున ఆలోచనలు తప్ప,
నమ్మకమ్ము లేవి నాకు లేవు ;
సహన గుణము మేలు - సహ జీవనము మేలు;
నవ్వు వచ్చు నాకు నన్ను తెగడ.

సున్న

అహము వేయు తరచు - ఆభాస వేషముల్,
గొప్ప పాత్ర లేరి కోరి -కోరి ;
నవ రస రుచిరమ్ము - నాట్యమ్ము లొనరించు,
తుదకు మిగులు - సున్న - బ్రదుకు నందు.

దీనసేవ

అనవసరము - విగ్రహారాధనము పూజ,
ఏ మసీదు లైన ఎందు కొరకు ??
దీన సేవ కంటె - దివ్యత్వ మేదయా ?
ప్రార్థన యన కాల హరణమె గద.

మీట

మీట నొక్క వలయు మేటి కార్యము లందు;
తరచు చిన్న కిటుకు దాగి యుండు;
సవ్య మైన మీట చక్కగా నొక్కుచో!
తారసిల్లు - దూర దర్శనమ్ము.

యోగదృష్టి

జీవితమున సమసిపోవు - వైరుధ్యముల్,
సుకవి - యోగదృష్టి చూచి నపుడు !
అనుభవైక వేద్య మైక్య సంధానమ్ము !
మాట మనసు లేగు బాట లేదు.

ధనం

ధనము కూర్చి పేర్చు కొనుటకై మాత్రమే
నరుడు బ్రతుక నేల ధరణి పైన?
అంత కంటె వేరు వ్యర్థ జీవిత మేది ?
మనిషి చేయవలెను మంచి పనులు.

జగతి లోన - ధనము - సర్వ పర్యాయమ్ము !
నడపు - ధనము - నవ్య నాగరికత;
గొప్ప వాడు - ధనము కూడ బెట్టెడు వాడు,
త్యాగ యోగి - దాత - దైవ సముడు.

ఏది శాశ్వతమ్ము? సృష్టి యంతటి లోన ?
సూక్ష్మ దృష్టి తోడ చూచి నపుడు??
సర్వము క్షణికమ్ము - సర్వమ్ము శూన్యమ్ము ;
మిథ్య -జగతి - మరొక మెట్టు నెక్క.

అహం

తేట తెల్ల మయ్యె తెలియ దంచును నాకు;
అవని గలడె తెలిసి నట్టివాడు?
అరయ జ్ఞానమునకు అవధి యేదియు లేదు;
నవ్వు కలుగ చేయు నరుని అహము.

మౌనం

మెదడు పండి నట్టి మేటి విద్యా వేత్త
వదర లేదు తరచు పెదవి విప్పి;
దూర నపుడు పూల తుమ్మెదల్ రొద చేయు
మౌన నిష్ఠఁ బూను మధువుఁ గ్రోల.

పండు

మధుర మధుర మృదుల మంజులాశయులే
హాని గూర్చ వచ్చు ఆచరణమున;
భద్ర పరచ వలయు పండు క్రుళ్లని యట్టు;
కలికి మొగ్గ వేరు! కాయ వేరు.

పద్యం

పద్యము చావదు తెలుగున
విద్యుల్లతికలను పేని విద్వత్ సభలన్;
సద్యఃస్ఫూర్తిని చూపెడి.
విద్యాపతులకు మదీయ వినతుల్ - జేజేల్.

వెలితి

పనికి రాని వంచు పాత మేడలు కొన్ని,
కూల్చ వచ్చు జంకు గొంకు విడిచి,
మేటి కీడు గూర్చు మెదడులో శూన్యమ్ముఁ
వెరవు వెదక వలయు వెలితి పూడ్చ.

ఆచరణము

ఆచరణము ముఖ్య మాశయమ్ములు కావు!
పరిమళించు పూలు వాడ వచ్చు,
మల్లె పూలు వాడి - ముళ్ల కంపల కంటె,
హెచ్చు హాని కూర్ప వచ్చు - క్రుళ్లి.

మౌనం

మౌన నిష్ఠఁ బూను - మంద హాసము తోడ,
వెల్లడింప డెపుడు వేత్త - మనసు ;
అరయ - శుద్ధ కాల హరణమే - వాదాలు !
తరచు - లేని మూగతనమె - మేలు.

ఔచిత్యం

తాల్చ వలయు సుమ్ము తలపై కిరీటమ్ము ;
కాళ్ల పెట్ట రాదు కంకణములు,
ప్రాణ నాడి బ్రదుకు కౌచిత్యమే గదా,
పాదుకలకు శిరము కాదు చోటు.

చిరువాన జల్లు

చిటి పాటి చిరు వాన చినుకులే - ఈనాడు!
కుంభ వృష్టి రేపు కురియ వచ్చు!!
మారు - ఉప్పె నౌచు మరునాడు జాగ్రత్త;
చావ వచ్చు - నిదుర వోవు - జనులు.

జయము

నిజము ధర్మ మున్న నీ పక్షమున యందు,
లాభ మేమి జయము రాక యున్న ??
సర్వ వక్రతలను - సరిదిద్దు విజయమే!
ధనము తప్పు లెల్ల దాచ గలదు.

కాలం

మనిషి కుండ వలయు - తన వైపు 'కాలమ్ము';
ధనము - సర్వ వస్తు తతులు కాక,
కలిసి వచ్చు నెడల - కాలమ్ము పక్వమై;
అమరు గెలుపు సిరి స్వయంవరమున.

కస్తూరి హరిణము

కలడె? దేవు డెచటొ! కైలాస కాబాల ??
అరయ మనిషి హృదయ మందు గాక !
కలిగి నాభి యందు కస్తూరి హరిణమ్ము
పచ్చ గడ్డి కొరకు -ప్రాకు లాడు.

వెల విలువ

కొండపల్లి ఊరి కొయ్య బొమ్మల లోన,
గోచరించు చుండు గొప్ప సొగసు,
పసిడి బొమ్మ యైన - వసుధలో వెల హెచ్చు
వేరు వస్తువు ధర - విలువ వేరు.

స్వేచ్ఛ

నిండి యుండు జగతి ఖండ సత్యాలతో
మనిషి కుండ దగు సమగ్ర దృష్టి,
తన మనస్సు నెచట తాకట్టు నిడ రాదు,
స్వేచ్ఛ - ప్రాణ నాడి - జీవితమున.

నవ్వు

ముఖము నుండి రాలు ముత్యాలు వజ్రముల్,
నవ్వు కన్ను దోయి నాట్య మాడ,
నవ్వ లేని మనిషి - నడ పీనుగే సుమ్ము;
ముదురు రోత పుట్టు ముక్కు ముడువ.

సంతానం

గగనములకు పక్షు లెగురు రెక్కలు వచ్చి,
తల్లి గూడు విడిచి తరలి వెడలి!
కొంత నయము మనుజు సంతాన మైనచో,
ఎపుడొ వచ్చి కానుపించ వచ్చు.

రస సమాధి

అర విరి నును లేత అందాలు,చందాలు
తేరి పార జూచు తీరి కేది?
జనుల కేది ? నేడు సంగీత విశ్రాంతి;
బ్రదుకు నందు లేదు రస సమాధి.

గోష్ఠి

ఉత్తమమ్ము - గోష్ఠి - ఉజ్జ్వల ప్రగతికై;
సభలు - ప్రజల కొరకు జరుప వచ్చు,
ప్రగతి కంత రాత్మ - వ్యక్తి ఒక్కడె ఉండు;
చేరు - తేనె చుట్టు - చీమ లెల్ల.

ప్రజాస్వామ్యము

ఏమి చేయ గలము? ఇది ధన స్వామ్యమ్ము !
ధనికు భోగ దాసి ధరణి యెల్ల;
ఏమి చెప్ప గలము? ఇది ప్రజా స్వామ్యమ్ము !
అరయ గార్ధభమ్ము - అశ్వ సమము.

తులాభారం

అరయ కష్ట తమము - నర తులా భారమ్ము,
"ధర్మ కాంట" యేది? ధరణి మీద?
తారతమ్య ముండు - తరచు జీతము లందు,
ప్రజ్ఞ - సమయె యయ్య - బ్రదుకు నందు.

మధ్యసిరి

"మధ్య సిరి" - ఘన ప్రమాదముల్ గొని తెచ్చు,
చేర్చు కన్నుదోయి శిరము పైకి,
బ్రదుకు నందు కూర్చు - భ్రమల దొంతర లెన్నొ !
అతని కరుణయును భయంకరమ్ము.

ఏండ్లు పూండ్లు పట్టు - సృష్టింప సంపదల్,
రణము - పాడు చేయు క్షణము లోన,
మంచి కృత్య మేది? - పెంచుటే ఉత్పత్తి;
ధ్వంస కాండ - నీచ తమము సుమ్ము.

అశోకుడు

లోక మందు నే డశోకు డొక్కడు లేడు!
జరుగు ఘోర రణము చదల నేల;
ఒక విమానము వెల ఊహింప శక్యమా?
ఇంత ధ్వంస కాండ ఏల జరుగు ?

పోటీల ధాటి

నేటి నరుని బ్రదుకు పోటీల ధాటియే!
బహుళ యోగ పద్య భార యుతము;
పనికి రాదు నడక - బ్రదు కన్న పరుగులే!
ఆట విడుపు లేదు - వ్యవధి లేదు.

జై జగతి

మేలు గాదు నేడు - కాల దోషము పట్టె !
వదల వలెను దేశ భక్తి - ఇంక ;
శాంతి పాఠ మగుత - "జై జగజ్జనయిత్రి"
వెల్లి విరియు గాక - విశ్వ భక్తి.

విశ్వరాజ్యం

వ్యక్తు లందు గాక - ప్రజలు పల్వురి లోన,
వ్యాప్తి గాంచు వెఱ్ఱి అప్పు డపుడు !
కూర్చె దేశభక్తి ఘోర సంగ్రామముల్ !
విశ్వ రాజ్య మింక వెలయు గాత.

గడ్డం

ఎట్లు యోగి యగుట? ఏండ్లు పూండ్లను బట్టు!
పండు టెట్లు లేత గుండెకాయ?
కావి గుడ్డ కట్ట - గడ్డమ్ము పెంచుచో,
ప్రజల మోస పుచ్చ వచ్చు - సులువు.

నేత

ఒక లలిత కళ గద - ఓట్లు గుంజెడి శక్తి!
రాజకీయ హస్త లాఘవమ్ము!
చాకచక్య లౌక్య సార్వభౌముడు తప్ప,
నేత - ఎన్నికలను నెగ్గ లేడు.

తేటి

వేల కొలది పూలు వికసించి నెత్తావి
నింపు గాత హృదికి ఇంపు గూర్చి,
విచ్చి నట్టి విరుల వెదకి వాసన చూచి,
తేనె లాను గాత తేటి వటువు.

త్రివిక్రముడు

నా డతండు వామన స్వరూపుడు గదా,
అతడు జనుల కనుల కాన లేడు!
మానస త్రివిక్రమ స్ఫుర ద్వర్చస్వి,
మిన్ను మన్ను ఆక్రమించె - నేడు.

చాల వరయ - ప్రతిభ - శక్తి సామర్థ్యముల్,
ధనము - చదువు లున్న మనుజు లందు;
తెలియ నట్టి ఏ అదృష్టమో లేకుండ,
బ్రదుకు నందు పెద్ద పదవి రాదు.

పాత్ర

వేషధారి నరుడు - విశ్వ నాటక మందు,
నటన - పాత్ర బట్టి నడుప దగును,
బ్రదుకు నందు - రసము - పాత్ర నిష్ఠము గాదు,
అభినయమ్ము హృదిని అంట రాదు.

శవపరీక్ష

సలుప నేల - శీర్ణ శవ పరీక్షలు పూని,
హత్య జరుగ - ఆత్మ హత్య జరుగ;
సంఘ లోపములను సరిదిద్ద వలె కోరి,
అది సమష్టి శుద్ధి కదను సుమ్ము.

మమతలు

వివిధ శాస్త్రవేత్త - వేదాంతి కావచ్చు
ముసలితనము తోడ మూల్గు నపుడు;
మనిషి - విడువ లేడు - మమతానుబంధముల్;
శ్లేష్మ మందు ఈగ చేరు చుండు.

విశ్వాసం

తండ్రి పేరు నడుగ - తనయుండు వచియించు,
హేతువాద మెట్టి బుజువు చూపు ?
వేయు నేల - కలదు విశ్వాసమునకు గూడ ;
సంఘ జీవితమున - స్థావరమ్ము.

నిజం

గుండె లోన సుంత గురుభక్తి - చెడకుండ,
స్వేచ్ఛ చూప వచ్చు - శిష్య వరుడు,
గొప్పది కద - నిజము - గురువు కంటెను గూడ,
అనుభవైకవేద్య మైన నిజము.

చప్పట్లు

బ్రదికి యున్న మనిషి ప్రతిరోజు నవ్వాలి,
ఒక్క సారి యైన ఒడలు మరచి;
చరచ వలెను సభల చప్పట్లు స్పందించి,
మూల-నక్క రాదు ముక్కు ముడిచి.

హేతువాదము

హేతువాద మెప్పు డేకాంత రోగమై,
మెదడు తొలచ రాదు బ్రదుకు నందు,
వేరు నూత్న మతము కారాదు బ్రదుకులో,
హేతువాద మొక్క నీతి పథము.

బ్రదుకు

బ్రదు కనంత వివిధ రస భావ భరితమే !
భ్రమల కెల్ల నృత్య రంగ శాల !
పాల కడలి వోలె - బహు తరంగములు పొంగు,
బ్రదుకు - స్థాయి భావ రహిత మగుత.

మౌనం

విద్య - ఉనికి గుర్తు - వినయమే సర్వదా,
విప్ప బోడు పెదవి వేత్త తరచు;
మెదడు మూత పడును పెదవి విప్పెడి వేళ,
మౌన మరయ వేత్త మాతృభాష.

మతం
తన మెదడు నెచటనో తాకట్టు పెట్టుటే,
మత మటన్న వట్టి మంకుదనము;
జగతి లోన వింత స్వచ్ఛంద దాస్యమే!
గురుని మీద శిష్య గ్రుడ్డి భక్తి.

మార్క్సు
ఎంచ - మార్క్సు రచన - హేతు బద్ధమె గాని,
నరుల బ్రదుకు కద్ది నప్ప బోదు;
మానవ స్వభావ మర్మజ్ఞుడా ? కాడు,
విజ్ఞు "డర్థ శాస్త్ర వేత్త" - మార్క్సు.

భాష
భాష - వాడు నట్టి ప్రతి పదమ్మును గూడ,
త్రిభుజ సదృశ మంచు తెలియ నగును;
దేశ కాల పాత్ర దృష్టి - విశ్లేషించి,
అర్థ భేద మర్మ మరయ దగును.

చుట్టు బల్ల
వివిధ మతము లెల్ల - సువిశాల జగతిలో,
ఉండ వచ్చు సలుప కుండ - పోరు;
చుట్టు బల్ల సంధి - శుభము శోభను గూర్చు,
ప్రగతి - పర పరాగ పారమితము.

ఆత్మహత్య
జరుగ " ఆత్మ హత్య " స్పందించ వలె జనుల్,
అది కుటుంబ పరిధి హాని గాదు;
సంఘ గతుల యందు - సర్కారు జతు లందు;
కలదు లోప మంచు తెలియ నగును.

సంఘటనలు కొన్ని - జరుగు సంఘము నందు,
ఇంటి లోన గూడ ఎన్ని జరుగు;
బ్రదుక దగును దేని పట్టించు కొనకుండ;
మనుజు డెపుడు విడుపు గుణము గలిగి.

దూర దర్శనం

"దూర దర్శన" ప్రసారమ్ము జగతిలో,
అగ్రగణ్య గణన నంద గలిగె;
స్థాయి పెంచు కొనచు - సతత ప్రగతి తోడ,
చేయు గాత - మేటి సేవ - ప్రజకు.

సమీక్ష

సాహితీ సమీక్ష సలుపు విద్వాంసుండు
ప్రియమె వ్రాయు నట్టి పెద్ద మనిషి;
సహన ముండ వలెను - సత్య మైనను గూడ,
చెడు విమర్శ నెపుడు చేయ రాదు.

నేరము

నేరమునకు మూల కారకుల్ పెక్కండ్రు;
అనుభవించు శిక్ష - వ్యక్తి ఒకడు;
సలుప వలయు సంఘ సంస్కారమును ముందు,
నేర మాప దలచు నీతి మతులు.

మరణ శిక్ష

ఎంచ - మరణ శిక్ష - హేయ మైనది గదా ;
మార్చ వచ్చు మనిషి మనసు తీరు,
ఖైదు పద్ధతులకు కాల దోషము పట్టె !
వెదుక వలయు - ప్రభుత - వేరు వెరపు.

మనిషి

మారె మానవుండు - మర మేకుగా నేడు,
పెద్ద యంత్ర మయ్యె పృథివి యెల్ల;
ఎంచ మనిషి బ్రదుకు - ఎండమావుల వెంట,
వెఱ్ఱి పరుగు లెత్తు వేట యయ్యె.

ధరణి ఇరుగు పొరుగు నరుల దుఃస్థితి పైన,
సుంత యైన ప్రేమ చూప కుండ,
ఖర్చు చేయ నేల ? గ్రహ యానముల పైన ?
బుద్ధి హీనములు ప్రభుతలు నేడు.

ప్రక్కపెరటి జామ

చిలిపి దొంగ చాటు శృంగారమున దాగు;
తేనె లోన లేని తియ్యదనము;
ప్రక్క పెరటి లోన పండ బారిన జామ
దొంగిలించి తినిన దొడ్డ తృప్తి.

నీతి

కలిమి కంటె - మేటి తెలివి తేటల కంటె,
మానవులకు మేలు - మంచి తనము;
మొదట నీతి బోధ ముఖ్యమ్ము బడులలో;
పిదప నేర్ప వచ్చు - విద్య లెల్ల.

భూతదయ

బాల బాలికలకు పాఠశాలల లోన
బోధ చేయ వలెను - భూత దయను,
తప్పు -సంఘ జీవితము లోననే యుండు,
దానవునిగ మార మానవుండు.

త్రికరణ శుద్ధి

సులువు - త్రికరణ పరిశుద్ది - జీవితములో,
నగటు మనుజులకును సాధ్య మగును,
అప్పు డపుడు మౌన మనుపానముగ జెల్లు;
లాస్య మాడు శాంతి లయలు హృదిని

నిక్కి - ముక్కు సాచు నేపథ్యమున నిల్చి;
కలి యుగమ్ము నేటి - కావ్య మందు!
గత చరిత్ర - నేటి ప్రతిబింబ కల్ప మే;
రచన - వర్తమాన రభస గతియె.

కార్యశూరుడు

బ్రదుకు అనిన కాదు రాజీ పడని పోరు!
వీర మరణ మందు వెఱ్ఱి వాడు;
నేల పొరల దాగు నిజము లెన్నెడి వాడు
సూక్ష్మ దర్శి - కార్య శూరు డగును.

బ్రదుకు

బ్రదుకు విడిచి నరుడు పారిపోవుట - కల్ల !
పచ్చి నిజము ధరణి పైన - బ్రదుకు;
సాహితీ రచనలు సకల వేదాంతముల్;
తరచ వలెను బ్రదుకు తెరువు లెల్ల.

వృద్ధుడు

చేవ కూర్చు కొనును శృంగార విద్యలో,
వయసు మళ్లి నట్టి వాడు - తరచు;
నవ నవ యువతులను - నాగ స్వరము నూది,
బుట్ట లందు దూర్చి పెట్ట గలడు.

విద్య

ఆట పాట లేవి ? పోటీ జగత్తులో ?
వింత చిత్ర హింస - విద్య నేడు;
సాగ దగును - చదువు - సచ్చి దానందమై;
నెమరు వేయ దగిన సమయ మగుచు.

బాల్య మందు - చదువు బరువు - తగ్గుట మేలు,
విషయ విస్తరణము - విద్య గాదు;
మంచి తనము - విశ్వ మనుజ సౌభ్రాత్రమ్ము;
బాల బాలికలకు - పాఠ్య మగుత.

సన్మానములు

మానవుండు వింత "డైనమో" యన వచ్చు
బాగు పడుట ఎట్లు లాగి నపుడు ?
జరుపు నెడల ప్రజలు సభలు సన్మానముల్,
వెలుగు మరల ఉద్భవింప చేయు.

జరుప నేల ? గొప్ప సభలు సన్మానముల్ ?
పేర్మి కూర్మి తోడ వృద్ధ కవికి ?
అధిక మౌను అతని కాయురారోగ్యముల్
ఊరట కలుగు నవ యువ కవులకు.

చేసి మంచి పనులు - స్వీయ జీవిత మందు,
కవిత వ్రాయ వచ్చు కవులు - పిదప,
కావ్య నీతి కవియు - గాలిలో ధూళిలో!
చూప దగును "చిత్త శుద్ధి" క్రియల.

సంధి

కలహ కారణాలు కారాదు - భేదముల్ !
సంస్కృతి ప్రతీక - సహన నిరతి;
వేత్త - తెలిసి కొనును, విశ్వ వైవిధ్యముల్
బ్రదు కటన్న సామరస్య సంధి.

సామ్య వాద విధులు - శాంతి ప్రకృతికముల్,
ప్రబలు గాత ఓటు పాటవమున;
ఏమి కోర వలయు ? ఇది ప్రజా స్వామ్యమ్ము !
ధన భుజ బల శక్తి - తరుగు గాత.

నాస్తికత

అరయ - హేతువాద మాస్తి కాదర్శమ్ము
మెలగ వచ్చు తరచు కలిసి మెలసి,
నాస్తికత - మరొక్క అంధ విశ్వాసమై;
సంచరింప రాదు - జగతి లోన.

శుద్ధ హేతువాదం

ప్రౌఢ మేధ గూడ - మూఢ విశ్వాసముల్,
పొదుగ వచ్చు లోని పొరల మధ్య;
బ్రదుకు -శుద్ధ హేతువాద బద్ధము గాదు;
గణిత పారమితము గాదు - తరచు.

గోష్ఠి

స్వరము పెంచ రాదు చర్చోపచర్చలో,
చర్చ జీవనాడి - సహన గుణము;
సభను మించు "గోష్ఠి" - జ్ఞాన యజ్ఞము గదా,
విశ్వ హితము స్వస్తి - వెరసి - గోష్ఠి.

యుద్ధం

యుద్ధ మనిన వట్టి ఉన్మాద మే గదా !
ఘోర రక్త పాత ఘూర్ణితమ్ము;
యువత యెల్ల అంత ఉత్సాహ పడ నేల ?
చచ్చి పోవు కొరకు ? చంపు కొరకు ?

చరిత్ర

వ్రాయ లే డెవండు ప్రాచీన చరితమ్ము,
వర్త మాన నిష్ఠ వదలి పెట్టి,
నేటి నీడ - పడును - నాటి కాలము మీద,
మిథ్య - చరిత రచన - మేటి మిథ్య.

పెండ్లి జీవితమున ప్రిదిలి పోకుండగా
ఉండు టెట్లు నవ్య యుగము నందు ?
బిడ్డ లున్న యెడల - ప్రేమానుబంధాలు
చాల వరకు నిలుచు నేల మీద.

మంచివాడు

బ్రదికి యున్న యపుడు - ప్రతిభా విశేషిగా
గడుసు పిండ మనెడి గణన మేల?
మరణ మొంది నపుడు - మంచివాడని ప్రజల్,
చెప్పు కొనిన చాలు - అప్పొడపుడు.

నవ రస రుచిరం

ఈ ప్రపంచ మందు శృంగార మొక్కటే,
ఏక రసము గాదు - ఎంచి చూడ!
కలవు జీవితమున - కర్తవ్య బహుళముల్,
నవ రస రుచిరమ్ము నరుని బ్రదుకు.

ఫోను

లోకు వగును ఎంత చాకచక్యము చూప,
కనుల ముందు నిలిచి కాను పింప,
ఫోను పైన - మనిషి - పోజు కొట్టగ వచ్చు!
వీను లొగ్గి - యెవ్వ డైన - వినును.

ప్రజ్ఞ చూప నేల - ప్రత్యక్ష కృషి యేల?
జరుగు ఫోను పైన చాల పనులు;
గౌరవమ్ము తరుగు కనుల ముందర నిల్వ,
చిందు - ఫోను - నాద బిందు కళలు.

త్రికరణ శుద్ధి

మాట నిలుపు కొనుట - మధురాతి మధురమ్ము;
మాట తప్ప రాదు మనుజ వరుడు,
మౌన దీక్ష కంటె మంచి దేదియు లేదు;
శుభము - త్రికరణైక శుద్ధి - శుభము.

మనస్సు

మనసు బాగ లేక - పనులు చేయగ లేదు,
వ్యర్థ మగును మనిషి బలిమి కలిమి,
పోవు శక్తి యుక్తి - జీవచ్ఛవము గదా,
చింత వంత తోడ - చివుకు మనిషి.

మావటీడు

భయము చెంద డతడు వ్యాఘ్రమ్ము నెదురించు;
వెరపు చెందు కుక్క మొరిగి నపుడు,
మావటీడు మసలు మత్తేభ శిరముపై !
వణకి పోవు "త్రాచు పాము" గాంచ.

బాల్యం

ఆయు వందు - సగము - వ్యయ మౌను నిదురకే !
వార్ధకమ్ము శైశవములు కలవు !
వ్యవధి - విద్య కేది? బాల్య కాలము తప్ప ?
చదువె - మెరుగు పరచు బ్రదుకు నెల్ల.

చెల్ల నప్పు డింక స్నేహమ్ము బ్రదుకులో;
చేయ దగు నుపేక్ష చిత్త మందు,
మరువ దగును అతని మంచి చెడ్డల గూర్చి,
పిదప అతని ఊరు పేరు గూడ.

సమగ్ర దృష్టి

సర్వతోముఖ మగు - సమ్యక్ చిర దిదృక్ష,
అభినవ యుగమునకు అవసరమ్ము;
జ్ఞాన విప్లవమ్ము - జగతి వర్ధిలు సదా,
అప్రమత్తు లగుత అఖిల జనము.

రాజకీయ నేత

దంభ దర్ప మొలికి - పుంభావ వేశ్యయై
నవ్య రాజకీయ నాయకుండు;
నాట్య మాడు గాక - నఖునావధానియై;
చింది - మౌన నాద బిందు కళలు.

ఏమి చేయ వలయు? ఇక ప్రజాస్వామ్యమ్ము
స్థిరము చేయు కొరకు ధరణి పైన?
విజ్ఞు లైన వారి - వివిధ సంఘాలలో,
కోరి - వేయ దగును ఏరి ఏరి.

నేత

మధుర మృదుల లలిత మందహాసము లేక;
చిర్రు బుర్రు లాడు శీల మున్న;
మేలి కవియు మేటి మేధావి కావచ్చు!
మెచ్చ లేరు ప్రజకు నచ్చ డతడు.

యుగళ యోగం

సృష్టి యెల్ల కలదు స్త్రీ పుంస యోగమ్ము
పూల యందు జంతు జాల మందు,
వెలసి యుండు కలిసి విద్యుత్తులో గూడ ;
యుగళ యోగ మందు ప్రగతి గలదు.

భావ మేళన

బుద్ధి నిలిపి - సూత్ర సిద్ధాంతముల పైన,
రంగు గ్రుడ్డి యగుచు బ్రదుక రాదు,
ప్రగతి తెచ్చు - పర పరాగ సంపర్కమే;
మేలు గూర్చు భావ మేళనమ్ము.

ఎన్నికలు

ధన భుజ బల శక్తి - దర్ప దంభము లేక,
ఉచిత రాజకీయ యుక్తి లేక,
నేత - యెంత గొప్ప నీతి మంతుడె యైన;
నేటి ఎన్నికలల నెగ్గ గలడె ??

ఆభాస లాభం

మంచివాని మోసగించు లోకువ గట్టి,
చాకచక్య లౌక్య చక్రవర్తి!
అది - క్షణిక సుఖమ్మె - ఆభాస లాభమే !!
అంతరంగికముగ - అతడు పుచ్చు.

పరోపకారులు

మనిషి దొరుక - వాడు కొనునట్టి దుర్బుద్ధి!
కొంత మంది లోన గోచరించు,
ప్రతిఫలమ్ము నేది వాంఛింప కుండగా,
పరుల కుపకరించు వారు - కలరు.

బ్రదుకు

అరయ - ఏక హృదియె అన్యోన్య వైరుధ్య
భావ సంకుల రణ పారమితము;
బ్రదుకు - అనిన - హేతువాద ప్రహేళికా ?
బ్రదుకు - వేయి తలల త్రాచు పాము.

చిన్నతెర

దేశమునకు చిన్న తెర చేయు పెను హాని,
తెలియ చెప్ప ఎవరి కలవి గాదు;
బాల బాలికలకు - వ్యసనమ్ముగా మారి,
కాల మపహరించి కలచి వేయు.

చలన చిత్రశాల వెలసె నేడింటింట,
"దూర దర్శనమ్ము" పేరు - మీద;
నింగి నేల కలిసి పొంగు ఉప్పెన వోలె,
వెల్లి విరిసె జ్ఞాన విప్లవమ్ము.

సంగమించు గాక - శాస్త్ర విజ్ఞానమ్ము,
లలిత కళల తళుకు బెళుకు తోడ;
వామనత్వ ముడిగి - వడి విరాడ్రూపమ్ము,
తాల్చు గాక - "దూరదర్శనమ్ము"

మరణ భీతి కంటె - నరక యాతన లేదు,
మరణ మనిన గొప్ప వరము సుమ్ము;
అది విముక్తి ఐహికావేదనల నుండి;
ఆత్మ - గొప్ప స్వేచ్ఛ ననుభవించు.

విశ్వ పరిధి - సుంత - వీక్షింప గల్గుచో,
గణన లోకి రాని అణువు - మనిషి!!
విద్య - యొసగ కున్న - వినయమ్ము బ్రదుకులో;
విద్య కాదు - ముదురు వెఱ్ఱి గాని.

రేపు - చలన చిత్ర కృతక సౌందర్యముల్;
వింత వింత భ్రమలు కొంత సేపు ;
సుంత నిజము లేదు - అంత ఆహార్యమే!!
చూడ కొంత మేలు - మేడి పండు.

ఘోర సంఘటనలు

శక్య మగునె ? నగ్న సత్యాలు వర్ణింప,
జరిగి నపుడు ఘోర సంఘటనలు ;
విలువ లెల్ల కూలు పేక మేడల వోలె,
వదలు - కుటిల జాంతవ ప్రవృత్తి.

సంప్రదాయములు

వికట సంప్రదాయ విధి నిషేధము లెల్ల,
మనుజ కల్పితములు మునుపు గాన,
మనుజ హితము కోరి మార్చ వచ్చును వాని,
సాహసమ్ము చూపి - సజ్జనుండు.

గుప్తదానం

యోగ్యత గురుతించి ఉపకార బుద్ధితో,
“ధన్య జీవి” - గుప్త దాన మిచ్చు;
గొప్ప దేది లేదు గుప్త దానము కంటె,
అది ఒక మధురామృతానుభూతి.

చతుష్పథం

మానవ ధర్మ మహోన్నత
స్థానమున చతుష్పథములు తరచుగ తోచున్;
కానక సమ్యక్ గమ్యము,
నానా మార్గముల - నరుడు నాట్యము చేయున్.

ఫోను

మనిషి నమ్ము దృశ్య మహిమనే తరచుగా;
ఫోను కాల మితిని పొదుపు చేయు,
సంఘ మందు ఫోను శత గోపనము నేడు;
లోక తంత్రతా ప్రతీక - ఫోను.

కృషి

జరుగ వెపుడు పనులు - సంకల్ప మాత్రాన,
యత్న నిరతి గూడ - అవసరమ్ము;
కార్యశూరుడగును గద - స్వయంకృషి తోడ,
జయము దిగ్విజయము జయము కృషికి.

విశ్వ వైశాల్యం

దైవ శక్తి తెలుపు తారకా కూటముల్,
అరయ లేడు సృష్టి పరిధి - నరుడు !!
వెలుగు పరుగు చాటు విశ్వ వైశాల్యమ్ము;
మాట మూగ వోవు - మనసు మరలు.

వైరం

కలవ నపుడు మనసు - కయ్యమ్ము విడనాడి,
దూర మందు ఉన్న తొలగు కీడు,
అనవసరము సుమ్ము - ఆవేగ రోషముల్,
వైర ముభయ నష్ట కారకమ్ము.

సేవ

బ్రదుకు గొప్ప ఆత్మ బలిదాన యజ్ఞమే,
త్యాగ యోగ దాన ధర్మ దీక్ష,
స్నేహ నిరతి - ప్రేమ - నిర్వ్యాజ మగు సేవ;
మాన్య తమము చేయు మానవతను.

పరోపకారం

పరమ ధర్మ మొకటి బ్రదుకులో ఉన్నచో,
అది పరోపకార హృదియె సుమ్ము ;
ఐహిక ప్రగతియు నాధ్యాత్మికం బదే !!
సర్వ నిగమ సార సంగ్రహమ్ము.

పగ

తగవులు మనసున పెంచుట
పగ బూనుట మేలు కాదు - పరమార్థములో ;
ప్రగతి పథము కా దైహిక
జగత్తులో గూడ తెలిసి చరియించినచో ?

నిత్య జాగృతి

వేగ తరము - జ్ఞాన విప్లవం బీనాడు
జరుగు చుండె సర్వ ధరణి లోన!
నేటి మానవుండు - నిత్య జాగృతి తోడ,
సంచరించు గాత - సంఘ మందు.

పండితుడు

మౌనము క్షమ మరియు మంద హాసము చాలు,
        నూటి పోటి కుంటి మాట లేల?
గుండె లోన - వెలుగు - పండించు కొను గాత,
        పండితుండు మత్సరుండు గాక.

దానం

మానవ మాత్రుల సంఘము
లోనన్ తప్పులు సహజము - లో లో నరయన్,
మానవ సద్గుణములలో,
దాన మొకటి క్షమను మించు ధర్మము నెంచన్.

ఒప్పు తప్పులు

కత్తి - వాడ వద్దు - కారుణ్యమును వీడి,
        పరుష వాక్య మెపుడు పనికి రాదు,
మధుర లలిత మృదుల మంద హాసము మేలు.
        ఒప్పు తప్పు లెవరు చెప్ప గలరు?

పరుల లోని తప్పు పట్టి చూపిన గాని
        పండితునకు నిదుర పట్ట బోదు,
తప్పు లెన్న కుండ దయ చూపు క్షమ తోడ,
        గుండె పండి నట్టి కోవిదుండు.

క్షమ

ఇలలో మనుజులు తప్పులు
సలుపుట పరిపాటియె గద - క్షమ పొంగారన్,
సలలిత హృదయము తోడన్
బలవంతుడు చూపు దయయె పరమార్థ మగున్,

ఒప్పుల చాటున దాగును
తప్పులు - మరి ఉండ వచ్చు ధాత్రీ స్థలిలో,
తప్పుల కడుపున, ఒప్పులు,
తప్పొప్పులు నిర్ణయింప తరమా ? సుమతీ.

గింజ

మెదడు మెదడు కుండు మేటి శక్తులు కొన్ని,
గొప్ప తెలివి ఒకరి గుత్త కాదు,
అభ్యుదయము కలుగు అవకాశముల బట్టి,
మట్టి యందె గింజ గిట్ట వచ్చు.

వ్రాయ రాదు పరుష వాక్య సంఘాతముల్,
సాహితీ సమీక్ష సలుపు నపుడు,
వ్రాయు నట్టి వాడు వ్యక్తి మాత్రుడు గాడు;
అతడు మధ్యవర్తి - న్యాయ మూర్తి.

శిఖరం

ఎక్కు నపుడు - మనిషి - ఎవరెస్టు శిఖరమ్ము,
అలయ వచ్చు కొంత సొలయ వచ్చు,
చేర్చ వలెను - తుదకు శిఖరమ్ముపై కాళ్ళు;
చిర యశో విజేత - చరిత లోన.

సహృదయత

మేధ - కలుగ జేయు మేటి దుర్భ్రమలు కొన్ని,
కాన లేదు సాటి ఘనత - తరచు,
రంగు గ్రుడ్డితనము రాకుండ బ్రదుకులో,
సాహితి నరయ దగు సహృదయుండు.

సాహితీ విమర్శ

సాగె - వాఙ్మయ కృషి- సర్వతో ముఖముగ
ఆధునిక యుగాన - ఆంధ్ర మందు,
విడువ దగదు - నవ్య విషవద్ విశేషముల్,
సాహితీ సమగ్ర చరిత లోన.

గురు భక్తి

అరయ - జ్ఞాన దీప్తి '- గురు నిష్ఠమా ? కాదు,
గోచరించు శిష్యు గుండె యందె,
పరమ పావనమ్ము - గురు భక్తి - బ్రదుకులో,
అవని కవలి వెలుగు నధిగమించు.

నిద్ర

బ్రదుకు నందు - మంచి నిదుర పట్టుట కంటె,
లేద దృష్ట మేది లేదు లేదు ;
అందరు నిదుర సము లవివేకి విజ్ఞాని,
రైతు గాని మేటి నేత గాని,

యంత్ర నాగరికత

యంత్ర నాగరికత - వ్యాపార తత్వమ్ము
పెరుగు చుండె ఈ ప్రపంచ మందు,
దైవ భక్తి పోయి ధన భక్తి అధికమై,
హృది నశించి పోయి మెదడు పెరుగు.

చేరి చేతి లోన - నోరు కందని పండ్లు ,
నరుని వెక్కిరించు టరుదు గాదు,
కౌగిలింప వచ్చు - కల గన్న బహుమతుల్,
చుట్టు ముట్టి నరుని పట్ట పగలు.

స్నేహం

స్నేహ మమరు గాత శృంగార కళ యందు,
కామ నిరతి వేరు - ప్రేమ వేరు;
హాయి సుఖము శుభము నాయికా నాయకుల్,
భార్య - భర్త లైన బ్రదుకు నందు.

హేతువాదం

బ్రదుకు - శుద్ధ హేతువాద బద్ధము గాదు;
మనిషి తెలియ లేడు - జనకు డెవడొ;
విలువ గలదు కొంత విశ్వాసమునకు గూడ,
వ్యావహారిక నిజ జీవితమున.

సంధి

మతము - గితము వద్దు మానవత్వము చాలు,
భాష - జాతి - కులము వదల దగును;
బ్రదుకు గాత వివిధ వాదోపవాదముల్,
శాంతి సామరస్య సంధి నెరపి.

సానుభూతి

కలల కంటె - కవిత కలవరింతల కంటె,
నంగనాచి నర్మ నటన కంటె,
సానుభూతి మేలు - సాటి వారల పైన,
చేత నైన మేలు -చేయ దగును.

చేతగాని వాడు

చేతగాని వాడు - బెదరి చిత్తము లోన,
పొరుగు వారి తిట్టి పోయ వచ్చు;
చేతనైన వాడు చేసి చూపును పనుల్,
పారవేయ లేడు నోరు నెపుడు.

చప్పట్లు

సభకు వెళ్లి నపుడు - చప్పట్లు చరచుటే,
సరస హృదిని వ్యక్త పరచు గుర్తు,
మూల - గుడ్ల గూబ వోలె కూర్చొన నేల?
మంచి నెంచి ప్రోత్సహింప వలెను.

ఉద్దీపనములు

ఉదయ మంది పెరుగు - ఉద్దీపనము లున్న,
నరుని గొప్పదనము ధరణి లోన ;
మఱ్ఱి బీజ మైన - మట్టిలో నశియించు,
ఎరువు నీరు వేడి దొరక నపుడు.

అగ్గి

కొంత మంది పైకి గోచరింపరు గదా,
నివురు గప్పి నట్టి నిప్పు వోలె ;
కదుప దరిని చేరి - కాలు సేతులు చాలు ;
అగ్గి దాగ వచ్చు బుగ్గి లోన.

అధికార కేంద్రీకరణం

ధనము - ప్రోగు బడిన - ధరణిలో ఒకచోట
సంఘమునకు కీడు సంభవించు;
అవని - ప్రోగు బడిన అధికార మొకచోట,
అంత కంటె సంఘ హాని లేదు.

అవకాశాలు

బ్రదుకు లోన గొప్ప ప్రతిభా ప్రభాసచే;
కామితార్థ సిద్ధి కలుగ బోదు;
యత్నములు ఫలించు - అవకాశములు గల్గ,
నేర్పు కంటె మేటి ఓర్పు మేలు.

ఇల్లు

స్వీయ గృహ మటన్న - జీవత్ సమాధియే ;
ఇల్లు పూర్తి యగుట కల్ల - ఎపుడు
కదల రాదు - ఇల్లు వదలి పెట్టగ రాదు
చేయ వలసి వచ్చు సేవ - సతము.

ముచ్చట పడి - గృహము మూర్ఖుండు నిర్మింప,
ఏ వివేకియో వసించు నందు;
ఆర్థికముగ గృహము అంత లాభము కాదు;
వర్తకమ్ము హెచ్చు వడ్డీ - తెచ్చు.

ఏకభాష

ఐకమత్య మల్ప సంఖ్యాక జనులలో,
తారసిల్లు హెచ్చు స్థాయి లోన,
ఉండు - హెచ్చు తెలివి రెండు భాషల సీమ,
మనిషి కేక భాష - మంచి కాదు.

కోరి వేడల వద్దు - కుందేటి వేటకై,
ఆట వెలది పద్దియములు వద్దు,
మొత్తు చేత నైన - మత్తేభ కుంభముల్,
నేల ముత్తి యములు రాలు గాత.

మనిషి

ఐహికమ్ము విడిచి - ఆముష్మికము చెప్పి,
"తత్త్వవేత్త" గొప్ప తప్పు చేసె,
అవని బాగు పరచు నట్టి కర్తవ్యమ్ము
ఎపుడు నరుడు విస్మరింప రాదు.

సుంత వెఱ్ఱి

లేశ మైన వెఱ్ఱి లేనిచో మనుజుండు,
జగతి లోన యంత్ర సమ్మితుండు;
తరచు - మనుజు మెదడు తర్క బద్ధము గాదు,
సుంత వెఱ్ఱి లేక - సుఖము లేదు.

యంత్రనాగరికత

యంత్ర నాగరికత అవనిలో ప్రబలుచో,
పిచ్చి వారి సంఖ్య పెంచి వేయు;
పాత నీతి తరుగు హేతు వాదము హెచ్చి ;
మానస ప్రశాంతి మాయ మగును.

బ్రదుకు

బ్రదుకు అనిన పెక్కు ప్రశ్నార్థకములే,
అడ్డు గీత లుండు అచ్చ టచట;
పెట్ట గలడె వేత్త విశ్రాంత బిందువుల్ ?
వ్రాయ కుండ వేరు వాక్యములను?

భయం

శక్తి మిక్కుటమ్ము - సంకల్ప నిరతిలో,
లేదను కొన గలుగ లేదు జబ్బు;
గట్టి మనసు గలుగ కష్ట మేమియు లేదు;
వంద సార్లు చంపు - భయము - నరుని.

స్వయంకృషి

ఎవడు పైకి వచ్చు - ఏ ఆస్తి యును లేక ?
స్వీయ కృషి ఫలించి జీవితమున ;
కష్ట సుఖము లెరుగు కార్య శూరు డతండు
ధర్మ తత్త్వ వేత్త కర్మ యోగి.

వినోద కాలక్షేపం

మేలు - ఒక వినోద కాల విక్షేపమ్ము;
ధనము కొరకు చేయు పనియె గాక,
శక్తి నిచ్చు గొప్ప సంతోషమును కూర్చు,
బ్రతుకు తెరువు వృత్తి - శ్రమను తెచ్చు.

జ్ఞానం

అరయ - జ్ఞాన మెపుడు - అధికార మొనగూర్చు
ఆత్మ గౌరవమ్ము నంద జేసి,
చదువు కూర్చు చిత్త సంస్కార సందీప్తి,
అగ్ర గణ్య లాభ మనగ జెల్లు.

వాస్తవాలు

వాదములను వదలి - భేద భావము వీడి,
ప్రాజ్ఞ వేత్త మెలగు బ్రదుకు నందు,
చేయ దగును పనులు సిద్ధాంతములు వీడి,
నేల మీది వాస్తవాల నెరిగి.

దూరదర్శనము

ఇల్లు కదల కుండ - వీక్షించి రావచ్చు,
విశ్వ మెల్ల తిరిగి వేడ్క మీర ,
విపుల మేధ మెచ్చు - విజ్ఞాన పాథోధి,
తరచి చూపు 'దూర దర్శనమ్ము'

చూడ - చాల సేపు - చూపు పాడై పోవు;
కాల హరణ మసలు కాన బడదు,
చంక నాకి పోవు చదువు పిల్ల కెల్ల,
దూరదర్శనమ్ము దుర్వ్యసనము.

వింగడించి - జ్ఞాన విప్లవ క్షితిజముల్,
చూపు నరుల హృదుల ఊప గలదు,
సమయ సీమల పయి - సాధించు విజయమ్ము
'దూరదర్శనమ్ము' దొడ్డ వరము.

అభ్యాగతుడు

జ్ఞాన వృద్ధు డైన మానవ శ్రేష్ఠుండు,
గుండె పండి నట్టి గొప్ప వ్యక్తి,
అరుగు దెంచ ఇంటి కభ్యాగతుం డౌచు,
అదియె బ్రదుకు నందు అమృత ఘడియ.

సహృదయత

ముక్కు మూతి ముడిచి - వెక్కిరించును గాక,
పండిత బ్రువుండు - ప్రక్క వారి!
సద్ విమర్శకుండు సహృదయత్వము తోడ,
గుర్తు పట్టు సాటి గొప్ప దనము.

తొలిరేయి

గాఢ బంధ మేది? కలదు?? పెండిలి కంటె ???
బ్రదుకు మలుపు లోన - మెదడు లోన ?
తొలగి పోదు హృదిని తొలి రేయి అనుభూతి,
మనసు నెమరు వేసుకొనును తరచు.

పెండ్లి

యుగ యుగాంతరాల - ఒక వ్యవస్థగ - "పెండ్లి"
సాగి నిల్చె - మనుజ సంఘ మందు,
అరయ హేతువాద నిరపేక్షముగ తోచు ;
అన్యథా శరణ్య మరయ రాదు.

విజయము

జయము రాదు - శక్తి సామర్థ్యముల వల్ల,
ప్రతిభ - అణగ ద్రొక్క బడును తరచు,
అల్పు డప్పు డప్పు డాధిక్యమును బొందు!
బ్రదుకు నందు తెలియ రాని దుండు.

మరపు

వేడ్క - ఆట విడుపు - విశ్రాంతి కాంక్షించు,
మెరపు తీగ వంటి మెదడు గూడ!
మరపు వచ్చు టనిన - మతి పోవుటా? కాదు.
అలసి నట్టి మెదడు - సొలయ వచ్చు.

మేధ కలదు - కలడు 'బోధిసత్వ' మహర్షి,
ఘోర రాక్షసుండు గూడ - కలడు !
సృష్టికి - ప్రతి సృష్టి చేయు మానవునిలో !
పుడమి - ఒక పెను బడి గుడిగ - అగుత.

ప్రగతిశీలి

బ్రతుకు లోన ఉండు శత కోటి లోపముల్,
అయిన - వెరవు లుం డనంత కోటి !!
'ప్రగతి శీలి' - ఎట్టి దిగులు చెందగ రాదు;
కార్య శూరు డగును - కర్మయోగి.

వక్త

విప్ప రాదు పెదవి - విశ్రాంతియే మేలు,
మౌన మందు గొప్ప మహిమ గలదు;
వక్త కోలుపోవు ప్రాణ వాయువు నిధుల్,
కోలుపోవు తరచు గొప్ప తనము.

హాస్యం

బ్రదుకు పోరు లందు - పరిహాస కవచమ్ము,
కూర్చ గలదు తరచు గొప్ప రక్ష,
అమృత రసము కత్తి అంచుపై పూయుటే!
హాస్య మద్భుత తమ మగు చికిత్స.

మనసు

మనసు తెలుప గలదు - మనిషి ఆహార్యమ్ము,
పలుకు బడులు మాట వరుస తీరు,
మనసు లోని కుట్ర - కస నౌను ముఖములో,
తరచు - నటన పారదర్శకమ్ము.

బ్రదుకు లోని వింత - ప్రతి మనుష్యుని యందు,
వేప కాయ యంత వెఱ్ఱి యుండు!
ఆంతరంగికముగ - ఆరోగ్యవంతుండు,
బ్రదుకు నందు హేతువాది - యొకడె.

సంప్రదాయాలు

సంప్రదాయము లను సంకెళ్ళు తరచుగా;
స్వేచ్ఛ నపహరించు జీవితమున,
శాంతి దాంతి కూర్చు - సంసార యాత్రలో;
ప్రగతి కూర్చ లేవు జగతి కెపుడు.

ఐహికం

ఆశ్రయింప మనిషి ఐహికావర్తమే,
చేరి నట్లె ఈగ - శ్లేష్మ మందు;
జీవితమ్ము కొంత సేపు తీర్చుట మేలు,
తన కుటుంబ పరిధి దాటి - నరుడు.

గుప్తదానం

ధనము - "గాలి కోడి" - మనుజ మానస సూచి,
పుస్తకాలు కొనును పూజ్యు డొకడు,
కోరి యోగ్యు నరసి - గుప్త దానము చేయు,
గుండె పండి నట్టి కోవిదుండు.

అన్యోన్య సహకారం

సంఘ మందు దాను - సన్న్యాసియే యైన,
పర సహాయ ముడిగి బ్రదుక తరమె ?
అవసరమ్ము నరుల కన్యోన్య సహకృతుల్;
కరుణ త్యాగ గుణము క్షమయు-ప్రేమ.

కవిత

పుట్టి నాభి కుహరి పొంగారు ఝరి వోలె,
పారు కవిత - కంటి నీరు చేరి,
బ్రదుకు హాయి గూర్చు - నిదుర మైకము లోని
కలవరింత లెట్లు కవిత లౌను?

పనులు

పావన హృది తోడ - ప్రారంభ మైనచో;
సత్వరముగ పనులు సాగ గలవు;
సహకరింప గలరు -సహృదయ ప్రభు వరుల్,
చేర గలరు ప్రగతి శీలు రెల్ల.

కాలం

విశ్వ సృష్టి శిల్ప విన్యాస వీక్షలో
నాలుగవ కొలతయ కాల మరయ;
ప్రథమ గణ్య మైన పరిమాణమై తోచు !
కాల నిర్ణయమ్ము - కవన చరిత.

మావటీడు

ఏను గెపుడు మావటీని ఆనకు లొంగు !
పులిని పెట్టు - నరుడు - బోను లోన !
ఏలు బుద్ధి బలమె - ఎల్ల సృష్టిని గెల్చి ;
మిన్న యేది మనిషి మెదడు కంటె??

బ్రదుకు లోని గొప్ప ప్రణయబంధము గూడ
ఎంచ చెలిమి నెపుడు మించ లేదు.
సింహ మెలుక తోడ - స్నేహమ్ము చేయుచో,
మరువ రాని గాథ విరియ వచ్చు.

ధనం

ధనము మార్చ గలదు- మనుజు దాసుని గాగ,
కుమతి గాగ - నీచ తముని గాగ ;
దాసి యగును తనకు ధనలక్ష్మి - బ్రదుకులో,
ధనము విసరి వేయు దాత కెపుడు.

తెలియ రానిది

పలుకుకు మెదడుకు అందక
తెలియగ జాలనిది - కలదు - తెలుపుట వీలా ?
తెలుపును స్వానుభవమె - చ
ర్చలు గిర్చలు వ్యర్థము గదరా శ్రీ సుమతీ.

శాంతి

అరయ కలిసి యుండు - న్యాయ మన్యాయమ్ము;
వీడ దీయ లేము - వెలుగు నీడ;
శాంతి అవసరమ్ము - సంధి - కర్తవ్యమ్ము ;
రక్త పాత హింస - ప్రగతి - కాదు.

హింస

సంధి మేలు ఘోర సంగ్రామమున కంటె,
శాంతి జనని - ప్రగతి సౌఖ్యములకు,
అభ్యుదయము కావు - అల్ల కల్లోలముల్ ;
హింస - నాశ కరము - హేయ నీతి.

స్వేచ్ఛ

మనము - స్వేచ్ఛ కోరుకొను వారలమె గదా !!
స్వేచ్ఛ కోర వచ్చు ఇతరు లట్లె !!
సహన ముండ వలెను - క్షమ చూపుటయె మేలు,
తెగడ నేల పరుల తీరు తెన్ను ?

రైతు

రైతు - సహజ శాంతి దూత - జీవితములో,
గరిమ నాభి పూర్వ కాలమునకు,
సంతకమ్ము రాని సంస్కారి విజ్ఞాని,
అతడు నేడు గూడ అన్న దాత.

ఫోను

కడగి ఫోను చేయు - కార్యు చాలెడి చోట,
కలలు గనెడి గొప్ప 'కార్యకర్త',
ఉన్న - పెద్ద చెయ్యి - ఉత్సాహి మేధావి;
వెనుక దీయ డెపుడు ధనము కొరకు.

చందాలు

స్వార్థ పరత - ఎవడు చందాల కోసమై,
తిరుగ రాదు సభలు జరుపు కొరకు;
ధనము మొట్ట మొదట తన జేబులో నుండి,
వ్యయము చేసి చూప వలెను - ప్రజకు.

పతితుడు

చదువు ధనము మెదడు పదవి - ఒక్కటి చాలు
పాడు చేయ నరుని బ్రదుకు కొంత,
మూడు నొకని చేర ముప్పు తప్పదు సుమా,
పరమ పావనుండు పతితు డగును.

జ్ఞానం

విశ్వ వినుతి కెక్కు వేదాంతి కావచ్చు;
మెరపు తీగ వంటి మెదడు గలిగి;
అరయ తరచి తరచ ఆత డజ్ఞానియే !
మనుజు జ్ఞాన మణు సమ్మాన మెంచ.

ఉచిత సమయం

వసుధ లోన - అన్ని వ్యవసాయముల లోన,
ఉండు - "ఏరువాక" కుచిత వేళ,
తొలకరి సమయమ్ము - కలిసి వచ్చిన నాడు,
పొలము దున్ని - విత్త వలయు రైతు.

నిగ్రహం

అమిత కామ వృత్తి - అణచి వేయక యున్న,
మనిషి - పశువు వోలె - మార వచ్చు;
అభ్యుదయము ఆయు రారోగ్యములు కల్గు;
నింప - గుండె లోన - నిగ్రహమ్ము.

రూల్సు

వెఱ్ఱి నియమ మితులు - విధి నిషేధము లెల్ల,
మంచి చేయు నప్పు డెంచ రాదు;
మేలు చేయ దగును మేధావి - అధికారి,
తనకు తోచి నపుడు ధర్మ మెన్ని.

కరుణ

త్యాగ సమిధ - విశ్వ యజ్ఞమ్ము కోసమై;
అహు తిచ్చు గాక హార్దికముగ,
తనకు ఉన్న మేర - దాన మిచ్చెడు గాత;
పరమ ధర్మ మేది? కరుణ కంటె.

అమ్మ

ఊయె లూచు చేయి - ఉర్వి యంతటి నేలు,
తల్లి కంటె వేరు దైవ మెవరు?
"అమ్మ" అనెడి మాట అమరి యుండును సుమ్ము;
దివిని భువిని కలుపు తియ్య దనము.

ధనం

దాట కున్న యెడల - తన దుకాణము నెప్డు;
మానసమున - అతడు మనిషి కాడు;
మనిషి మనసు నెల్ల ధనము పైననె పెట్ట,
శ్లేష్మ మందు ఈగ చేరి నటులె.

మెరుగు పెట్టుట

సాన బట్ట వలయు జాతి రత్నమె యైన;
వట్టి రంగు రాయి వదలి పెట్టి,
మెరుగు పెట్ట వలెను- మేల్మి బంగరు కైన,
వెండి కైన - మట్టి కుండ కైన.

పదవి

విశ్వ మందు అరయ విద్యా మదమె సుమా,
ధన మదమ్ము కంటె - దారుణమ్ము!
కుల మదమ్ము చూడ - ఘోరాతి ఘోరమే,
పరమ నీచ తమము - పదవి మదము.

చికిత్స

మార వలె చికిత్స - మనుజ దేహము బట్టి,
వయసు - మనసు - వ్యాధి పరిధి బట్టి,
జీవితమ్ము నందు - ఏ విధానము పైన ,
గ్రుడ్డి నమ్మకమ్ము - కూడ దెపుడు.

వసుధైక రాజ్యం

మతము - భాష ఐకమత్యమ్ము కూర్చెనా ?
కూర్చె గత చరిత్ర ఘోర హింస !
వేరు వెరవు కలదు - విశ్వైక రాజ్యమ్ము ;
ఎల్ల లెల్ల అంతరించు గాక.

కాలిదారి

కాలి దారు లెల్ల గమ్యమ్ము చేర్చునా ?
అంతరించు బాట అచ్చు టచ్చట !
వేయ వచ్చు మనిషి వెనుకంజ వెరవుతో,
దారి మార్చు టన్న - తప్పు గాదు.

చిత్ర వాక్పటిమ

గడుసు దనము హెచ్చు కవితా ప్రతిభ కంటె,
లలిత చాకచక్య లౌక్య మతుల,
చిత్ర వాక్పటిమము శ్లేషార్థ గరిమతో,
పులకరింప చేయ గలరు - సభల.

ఘనత

ఘనత యేది? ఆర్తు కన్నీరు తుడుచుటే,
చదువు పదవి మేటి మెదడు - కావు ;
పరుల మేలు కొరకు స్పందించు డెందమే ;
దీన సేవ చేయు దివ్య కరమె.

యుద్ధం

లోక మందు కలుగు భూకంపములు కొన్ని,
ప్రజ్వలించు అగ్ని పర్వతములు,
వచ్చు గాక ప్రకృతి వైపరీత్యము లెన్నొ!
మనుజ కల్పితములు రణము లేల?

వేగ మలచ వలయు - నాగళ్ల మొనలుగా,
కత్తు లెల్ల - గుండె - కరుణ నింపి,
శాంతి దూత - పాడె - సంగీత మేనాడొ!
యుగ యుగాంతరమ్ము లులికి పడగ

గోష్ఠి

మేలు సభలు - ప్రజల మేలు కొల్పుటకునై!
గోష్ఠి - సభల కంటె గొప్ప దరయ,
గోష్ఠి కంటె - వ్యక్తి గుండె లోపల గూర్చు,
యోజనా సమాధి - ఉత్తమమ్ము.

కారణాంతరముల - గడ్డాలు మీసాలు,
పెద్ద మనిషి తరచు - పెంచ వచ్చు;
వేష ధారణమ్ము - వింత దుస్తుల మధ్య,
హాస్య రసము చిందు లాడ వచ్చు.!!

దంపతులు

ఏబ దేండ్ల పైన - ఏక దాంపత్యమ్ము.
నెరపి నట్టి వారు - నేల నున్న,
వార లాలు మగలు - పార్వతీ శివ సముల్ !!
వారి గాంచ కనుల పండు వగును.

ప్రేమ

కనిన బిడ్డల పయి జనని కుండును ప్రేమ,
రక్త కణ రహస్య రంజితముగ,
ప్రేమ మాయ లేక - సృష్టిలో పస లేదు
అంతరించు ప్రాణు లవని లోన.

సత్యం

సత్యమునకు - సమయ సందర్భముల బట్టి,
అర్థ విపరిణామ మరయ దగును!
చాయ వెంట బడును - సారమ్ము విడనాడి;
శ్రోత్రియత్వ మెపుడు - ధాత్రి లోన.

సంగరం

సంగరమున మొదట చచ్చు నట్టిది యేది?
సత్యమే - సమాధి సలుప బడును,
యుద్ధ మనిన ఏమి? ఉన్మాదమే గదా,
ఉభయ మారకమ్ము యుద్ధ మనిన.

జగతిలో అశోక సమ్రాట్టు నెలకొల్పె;
యుద్ధ భావము హృది నుజ్జగించి;
జనుల సుఖము కోరి సంక్షేమ రాజ్యమ్ము,
భరత చరిత ఒజ్జ బంతి కలదు.

అరయ యుద్ధ మనిన 'నరమేధ'మే గదా!
స్థాన మేది శాంతి సౌఖ్యములకు?
వికట వికృత ఘోర విలయ బీభత్సమ్ము;
సర్వ నాశనమ్ము సంగరమ్ము.

అరయ సమయ మిపుడు, పరిపక్వమై తోచు,
సర్వ జనము లేక జాతి యగుత !
జరుగ నేల ఇంక నరమేధ హోమముల్ ?
ఏక రాజ్య మగుత ఎల్ల ధరణి.

ఘనత

అరయ వచ్చు - తరచు హావ భావము లందు,
మనిషి 'చిత్త శుద్ధి' - మంచితనము;
నరము నరము నందు - నగ్న సత్యము తోచు
నాట్య మాడు - ఘనత - నయన యుగళి.

చదువు

చదువు పేరు చెప్పి - చంపి వేయగ నేల?
బాల బాలికలను పాఠశాల ?
తోట బడుల లోన - ఆట పాటల తోడ,
కరప దగును వ్రాత - గణిత విద్య.

తల్లి

తల్లి గర్భ సీమ - ధారుణీ స్థలి యందు,
బ్రదుకు నందు - ప్రథమ 'పాఠశాల'!
శిశువు మొట్ట మొదట చేరు ఆశ్రమ మేది ?
గుడియు నేది?? అమ్మ ఒడియె గాక.

తప్పు

కంటి చూపు లందొ - కుంటి మాటల యందొ,
దొంగ తనము తరచు దొరకి పోవు,
తప్పు చేయు వాని- దండించు వంచించి,
అదుపు తప్పి - సొంత అవయవాలు.

జననీ జనకులు

జగతి లోన - సహజ సామాన్య మనుజుండు,
ప్రేమ చూపు - కన్న బిడ్డల పయి;
తనను కన్న యట్టి - జననీ జనకులపై,
కూర్మి పేర్మి చూపు - గొప్ప వాడు.

దానం

అల సక్తు ప్రస్థునిదౌ
సలలిత కథ భారతమున చదివిన చాలున్,
సులువుగ దానంబులలో
విలువలు వివరింపనౌ వివేకము తోడన్.

మిత్రుడు

తన మొగమ్ము చూచు కొన లేదు - మనుజుండు!
అట్లె - స్వీయ శీల మరయ లేడు!
మంచి అద్ద మొకటి - మంచి మిత్రు డొకండు
అవసరమ్ము మనుజు లందరకును.

ముదుసలి

ఉండ వచ్చు నవనవోన్మేషులై సదా
ప్రగతి కోరు ముసలి వారు గూడ;
వారు - భూత కాల వాలఖిల్యులు గారు;
సతత సంఘ సేవ సలుప వచ్చు.

మనస్సు

తెలియగ వచ్చు ఖగోళము !
తెలియును శాస్త్రముల తీరు తీయము లెల్లన్ !
తెలియును కళలను - మనుజుడు
తెలియడు గద తన మనసును తేటగ సుమతీ.

మెదడు

వేల కొలది పేర్చి విజ్ఞాన విషయముల్;
సార మెరుగ కుండ చదువ వచ్చు,
మెదడు - సరకు దాచు - గదిని చేయగ నేల?
చిన్న పూల తోట చేయ దగును.

సమత

సమత - స్వేచ్ఛ - విశ్వ సౌభ్రాత్రమే మేలు ;
గుండె జబ్బు తెచ్చు కోప వృద్ధి,
అరయ మంచితనము - ఆయురారోగ్యముల్ ;
చిత్త శాంతి పెంచు జీవితమున.

స్థూల కాయుడు

చూడ గొప్ప గుండె - స్థూల కాయున కుండు;
తిండి పెట్ట గలడు - తినును తాను,
నీతి మీద ప్రీతి - నేతిపై అనురక్తి,
లలిత కళల శక్తి కలిగి యుండు.

కోతి చేతి కొబ్బరి కాయ

ఏన్గు లద్దె లోన - ఇంపు సొంపులు మాసి,
కానుపించు వెలగ కాయ డొలక,
కోతి చేత చిక్కి - కూర్మి కొబ్బరి కాయ ?
కూర్చు వింత మోజు - కొంత సేపు.

సహృదయుడు

ఉత్తమోత్తము డగు ఉపకార హృదయుండు,
'చిత్త శుద్ధి' గలిగి సేవ చేయు !
సహృదయుండు సతత సచ్చి దానందుండు,
సుందరుండు - ఆత్మ యందు గూడ.

చిత్త శుద్ధి

గుండె లోన - మేడి పండు వాటము వద్దు;
"చిత్త శుద్ధి" మేలు జీవితమున,
పూత పసిడి వద్దు - పొట్ట ఇత్తడి వద్దు.
సుంత యైన డాబు చూప రాదు.

అంధ భిక్షుకుడు

కన్ను దోయి లేదు గాని - వేణువు నూదు,
చిందు లాడ నాద బిందు కళలు,
అమృత నాద నిర్ఘము లా హృదయ మందు
గంగ వరద వోలె పొంగి పొరలు.

మిషనరీలు

తెల్ల దొరలు జగతి కొల్ల గొట్టెడి వేళ,
మేటి కరుణ బరపి మిషనరీలు
సాధు చరిత - హృదయ సంస్కారములు గూర్చి
పైకి తెచ్చినారు బడుగు ప్రజల.

నరకం - నాకం

అరయ - ఎందు గలవు ? నరకమ్ము - నాకమ్ము ??
అంతరాత్మ అరల యందు గాక ?
ఉండు - స్వర్గ లోక ముపకార చర్యలో !
స్వార్థ మందు నరక మమరి యుండు.

ప్రవచనం

అతిథి వరులు సభల అధిక ప్రసంగముల్,
చేయ రాదు విసుగు చెంద ప్రజలు;
వక్త - ఎంత గొప్ప పండితుండే యైన,
పావు గంట చాలు ప్రవచనమ్ము.

దూర దర్శనం

సభలు జరుపు టన్న - శని ఆది వారాల,
దూరదర్శనమ్ము - దొడ్డ అడ్డు,
వేరు వేరు చోట్ల విస్తరిల్లవు కశల్,
సకల సంస్కృతి యిక చచ్చి పోవు.

కూర్పు

క్షణము క్షణము మారు జగతి సర్వము కూడ,
మనిషి తలపు కూడ మార వచ్చు,
తరచు బూజు పట్టి స్థిర నిర్ణయాలలో,
నరుని మెదడు లోని అరలు పొరలు.

ఆతిథ్యం

ఒక మహానుభావునకు భోజనము పెట్ట,
అవతరించు పుడమి కవని వెలుగు!
గృహము పావన మగు హృదయమ్ముతో పాటు,
నెమరు వేయ వచ్చు అమృత రసము.

దాత

దాన నిష్ఠ గలిగి - తా ననుష్ఠాన వేదాంతి,
యగుచు ధరణి బ్రదుక దగును - నరుడు;
జాలి గుండె గలిగి జగతిలో జీవించు,
దాత ఒకడె పరమ ధన్యతనుడు.

నిత్య నూతనము.

జగతి లోన - నిత్య చైతన్యమే తోచు,
గిర గిర తిరుగు గద ధరణి సతము,
చూడ - దిన దినమ్ము సూర్యుండు నవ్యుడే !
నిత్య నూతనమ్ము - నిఖిల జగతి.

చిరునవ్వు

మాటకు మాటయె తెగు లట!
నీటికి నాచు తెగు లట్లు - నిందా స్తుతి ఝుం
ఝూటము దేనికి చర్చల ?
మేటి జవాబు చిర్నగవుల మించిన దేదీ ??

మెదడు

గొప్ప మహిమ గలవి కోటి సంఖ్యను దాటి
నరుని మెదడు లోన అరలు కలవు !
నరుని మెదడు లోని అరల లోతులు కొల్చు,
పరికరాలు లేవు ధరణి లోన.

విద్య

విద్య - అనిన విమల వినయమ్ము మాత్రమే !
పండితోత్తముండు - ప్రతిభ పంచు;
శిష్య వరుల ఊర్ధ్వ శీర్షాల కురిపించు;
వెన్నెల వడగళ్ళు వెల్లి విరియ.

యోగి

సంఘ సేవ చేయు సంసారియై యుండి,
హెచ్చు బాధ్యతలను ఎవడు తీర్చు ?
అతడు దేశ భక్తు డాదర్శ పౌరుండు,
అతడు ధన్యజీవి - అతడె యోగి.

రామాయణం

ప్రేమ కలదు నాకు రామాయణము పైన,
భక్తి లేదు రాము పైన నాకు,
ఆంజనేయు పైన - అమిత గౌరవముతో,
సీత మీద కలదు ప్రీతి కొంత.

రేపు

ఆలసింప - తరచు - అమృతమే - విషమౌను !
రేపు కడుపు లోన రిత్త దాగు;
నేడు జరుగు పనులు నేడె చేయుట మేలు,
రేపు వరకు ఎప్పు డాపరాదు.

రంగులు

మనుజు బ్రదుకు - "ఇంద్ర ధనువు" వంటిది సుమ్ము
కలియు రంగు లెల్ల తెలుపు నందు,
ఎఱుపు వెల్లడించు హింస నెత్తురు దారి,
అభ్యుదయము కూర్చు - ఆకు పచ్చ.

పట్టు - విడుపు

శుద్ధ హృదయ ముండి - శ్రోత్రియత్వము లేని
సూరి వరుడు - ధర్మ సూక్ష్మ వేత్త;
గాఢ నియమ నిరతి - మూర్ఖత్వ చిహ్నమే !
బ్రదుకు కవసరమ్ము - పట్టు విడుపు.

చెకుముకి రాళ్లు

చెకుముకి చిరు శిలలు చేర్చి రాపిడి చేయ,
నిప్పు పుట్టు రవలు నింగి కెగురు,
మేళవించు నెడల మెదడు దోయిని చేర్చి,
వెలుగు విరియ చేయు - విద్య లందు,

లేని వాని దానం

మేటి దాత ఇచ్చు - మిగిలి పోయిన డబ్బు,
కడుపు లోని చల్ల కదల కుండ,
లేని వాడు - ఇచ్చు దానమ్ము - శ్రేష్ఠమ్ము,
"త్యాగ యోగి" ధర్మ దాత అతడు.

అనుభవం

అనుభవమ్ము మనిషి కాధిక్యమును గూర్చు;
చదువు - తెలివి కంటె బ్రదుకు నందు;
నాలుగవ కొలతను నరునిలో సమకూర్చు,
అనుభవమ్ము సాటి అవని గలదె ?

ధనం

ఉండి - గొప్ప జాలి గుండె లాభము లేదు,
మానవునకు ధనము లేని యెడల,
సంగమింప ధనము - జాలి గుండెయ తోడ,
దాన మిచ్చు దాత - ధన్య జీవి.

స్వేచ్ఛ

బ్రదుకు లోన - కొన్ని భ్రమ లుండు - ప్రమలుండు,
మాతృ భాష యుండు - మతము లుండు,
సంఘ ముండు వివిధ సంప్రదాయము లుండు,
విడువ రాదు - నరుడు - స్వేచ్ఛ నెపుడు.

చిరు దుర్గుణాలు

చిరుత దుర్గుణాలు - సిగరెట్లు త్రాగుటల్;
కొన్ని జీవితమున ఉన్న నేమి ?
మానవత్వ మున్న - దాన ధర్మము లున్న,
మంచి హృదయ మున్న మనిషి - మేలు.

నొక్కి పట్ట వచ్చు - చుక్కాని చేతితో,
బ్రదుకు పడవ - యశము వైపు వెడల !
సభల మాట లాడు చప్పట్ల కోసమే,
లేదు "కీర్తి కాంక్ష" లేని నరుడు.

విప్లవ నేత

గాలి లోన రెండు కాళ్లుంచి ఠీవిగా,
నేల విడిచి పెట్టి నిలుచు వాడు;
వాస్తవాలు మరచి వర్తించ గలవాడు;
నవ్య విప్లవ జన నాయకుండు.

మంచి

మంచి చెడుగు కానుపించు కన్నుల ముందు,
మనకు తరచు వర్తమాన మందు;
గత చరిత్ర లోన - కన్పించు మంచియే;
గాలి లోన చెడుగు కలిసి పోవు.

ప్రౌఢ

ప్రౌఢ - చూప వచ్చు గాఢ తమ ప్రేమ,
వయసు మళ్లి నట్టి వాని మీద;
చేవ కూర్చి - చతుర శృంగార కళ లోన,
వయసు గొప్ప అనుభవమ్ము తీర్చు.

నటుడు

రాత్రి ఒక్క సారి - రాజు వేషము వేయ;
వంద పగలు లేగ వచ్చు గాని,
మార లేడు నటుడు మామూలు మనిషిగా,
రంగ భూమి మహిమ - రంగు మహిమ.

నీరు పోయుట

చెట్ల వ్రేళ్ళు - నీరు - చివరి ఆకుకు చేర్చు;
పోషకాల తోడ పొందు పరచి,
సేవ చేసి నట్టె - చెట్టు కంతయు గూడ;
చెట్టు మొదట నీరు చేర్చి నపుడు.

మనిషి

సంఘ మందు - మనిషి - సంఖ్యా ప్రతీకయా ?
కుల మతాల గ్రుడ్డి గుర్తు కాదు;
రక్త మాంసల మగు - ప్రతిభా పతాకమే !
మృణ్మయుండు కాడు - చిన్మయుండు.

ఆయుధాల మీద వ్యయం

గ్రాస వాస వసన కల్పనా యత్నాలు;
జగతి నెల్ల యెడల సాగు గాత!
ఆయుధాల మీద; వ్యయము చేసెడి బుద్ధి,
ఉండ రాదు నరుల గుండె లందు.

వక్త

ఊక దంపు డేల ? ఒక నిమేషము చాలు;
వక్త ప్రవచనమ్ము రక్తి కట్ట;
మేలు సభల లోన - మిత భాషణము సదా;
శ్రోత శిరము మీద సుత్తి వద్దు.

సూది మాటలు

సూటి పోటు కరకు సూది మాటలు వద్దు;
వెక్కిరించి విసము కక్క వద్దు,
మంచితనము గలిగి మాట లాడుట మేలు,
మురికి గుంట లోన మునుగ నేల?

పూజ

చేర్చి కూర్చు నెడల - చిన్ని వన్నెల పూలు ;
నిండు చుండు తావి గుండె లోన ;
పూజ దేని కొరకు ? పూజ కోసమె పూజ ;
సోయగములు కూర్చు హాయి కొరకె.

ముసలి వారు

ప్రోత్సహించు నెడల - యువక ప్రతిభ నెంచి
ముగ్ధ మోహనముగ ముసలి వారు;
ఉభయ తారక మగు ఉజ్జ్వలోజ్జ్వలముగా,
ప్రగతి వచ్చు - నూత్న జగతి వచ్చు.

పాత్ర దానం

బ్రదుకు లోన - ధనము - భ్రష్టమౌ నష్టమౌ ;
వ్యభిచరించు - లక్ష్మి - వసుధ లోన !
ప్రతిభ వెదకి వెదకి - పాత్ర దానము చేసి,
'ధన్య జీవి' యగుత - ధనిక వరుడు.

ప్రాజ్ఞత

ప్రతిభ యెంత యున్న - ప్రాజ్ఞతల్ లేకున్న,
కార్య సాధకుండు కాడు - మనిషి;
పట్టు విడుపు లరయ ప్రతిభైక భాగముల్,
విడుపు విలువ హెచ్చు - విశ్వ మందు.

అంతరాత్మ

పొగడ వచ్చు పరులు తెగడ వచ్చును గాక,
అరయ వలయు చాలు నంతరాత్మ;
ప్రజల కుపకరించు పనులు చేసిన చాలు,
తరచు కుక్క లెల్ల మొరుగు గాక.

సమస్య

తెలియ రాని హేతువులు పెక్కు తెర వెన్క
ఒక్క మూల నక్కి యుండ వచ్చు ;
ఎవ్వ డెరుగ గలడు - ఏ సమస్యను గాని,
భూమి మీద సర్వతో ముఖముగ.

అనుభవం

చదువు - కొంత కూర్చు - చక్షు రక్షర సక్తి,
వినుట వలన గూడ విద్య - వచ్చు;
అనుభవమ్మె కూర్చు - మనుజ సంతతి కెల్ల,
బ్రదుకు లోన మరువ రాని - విద్య.

వింతలు

విశ్వ శిల్ప మందు వింత లున్నవి పెక్కు !
నరుల ఇంద్రియాల పరిధి దాటి,
అందు కొనును వాని అరుదుగా మనుజుండు !!
విస్తు పోయి 'శాస్త్ర వేత్త' - నిలుచు.

మగవాడు

రాము డొకడె కాదు రామాయణము నందు;
పసిడి లేడి వెంట బడినవాడు !
యుగ యుగాల నుండి మగవాడు తరచుగా;
మగువ చెప్పి నట్టి మాట వినెను.

నటుడు

తా తరించి - నటుడు - తరియింపగా జేయు
తత్క్షణమ్ము నందు ప్రేక్షకులను ;
అందరి హృదయాల ఆనంద సుధ నింపు,
విస్మరింప జేసి - విశ్వ మెల్ల.

తుమ్ము

ఏ రసాయనాలు చేర - వచ్చునొ "తుమ్ము"
ఎవరు తేల్చ నేర రింత వరకు,
సత్వరమ్ము వచ్చు - ఝుంఝా నిలము వోలె!
గ్రక్కున ఉదయించి ముక్కు నుండి.

స్నేహం

పసుపు సున్న మమరు పారాణియై - పొల్చి,
పరిణమించు క్రొత్త వస్తు వగుచు,
మైత్రి తోడ కూడ మనుజు లిర్వురు చేర;
క్రొత్త బలము బ్రదుకు కూర్చు కొనును.

వ్యయం

వ్యయము చేయ రాదు - ఆదాయమును మించి
ఆశ కంటె - గొప్ప వ్యాధి లేదు;
కలిమి - లేమి - నిజము - తెలివి తేటలు వేరు;
నేల మీద వాస్తవాలు వేరు.

మంచితనము

నాక నరకము లను లోకాలు లేకున్న;
దివిని లేక యున్న దేవు డెవడొ !
మంచితనము మేలు - మానవత్వము చాలు;
చెడ్డ పనులు మనిషి - చేయ నేల.

శ్రీకృష్ణ మురళి

సృష్టి నాటకమున - ఏ పాత్ర ధరియింప
ఇష్ట మగును చెప్పు మింక నీకు;
చేరి - కొంత సేపు - శ్రీ కృష్ణ చేతిలో
మురళి నగుచు - నేను - మ్రోగ దలతు.

హృదయ వైశాల్యం

బ్రదుకు నందు కలిగి - హృదయ వైశాల్యమ్ము;
మంచితనము మనుజ వరుడు;
వ్యాధి యంచు తరచు వైద్యుండు తలపోయు;
అతడు చాల నాళ్లు - బ్రతికి యుండు.

గోపిక

అలలు నవ్వు చుండ - సేలయేటి ఇసుకపై;
వెన్నెల నడి రేయి విశ్రమింప,
మురళి రవళి డాసి - విరుల నెత్తావితో !
గోపికా లతాంగి గుండె దూరె.

వక్త

మబ్బు తునక వచ్చె - మండు టెండల మధ్య;
చల్ల నైన వాన జల్లు కురిసె !
వేత్త యైన వక్త - వేదిపైనను; నిల్చి
మంచి మాట లాడి మరలి నట్లు.

మతం

"మత్తు గొలుపు నల్ల మందు కంటెను గూడ,"-
మార్క్సు ఋషి వచించె మతము గూర్చి,
మనుజ సంఘ మందు మార్క్సు పుట్టిన మీద,
మతము మత్తు తగ్గె మనుజ తతికి.

రాజకీయం

రాజకీయ మందు రాణించ వలె నన్న,
బూకరింప వలయు - బొంక వలయు;
నీతి మరచి - భూత భేతాళ తతి తోడ,
పేక లాడ వలయు ప్రీతి తోడ.

బరువు

అప్పు డపుడు కోరి అసమర్థ సజ్జనుల్,
శక్తి లేని వారు - రక్తి కలిగి,
మోయ లేని బరువు మోపు కొన్నను పూని,
తిరుగ వలసి వచ్చు శిరము వంచి.

భావ దారిద్ర్యం

వసుధ లోన - అరయ - వస్తు దారిద్ర్యమ్ము,
దుర్భరమ్ము - నిజమె - దుర్భరమ్ము;
పరమ దుర్భరమ్ము - భావ దారిద్ర్యమ్ము;
చదువు మేలుకొల్పు - మెదడు స్వేచ్ఛ.

ధీయుతుడు

విసరు కాల మేదొ విప్పి వే కొరడాను,
వేణు వూద దగిన వేళ యేదొ,
నిదుర వోవు వేళ బ్రదుకులో ఏదియో,
తెలిసి నట్టి వాడె - ధీయుతుండు.

వ్యాఖ్యాత

ఎరిగి - సూత్ర కర్త - ఏకాంత విషయమ్ము ;
స్వీయ శైలి లోన చెప్ప వచ్చు,
అన్ని విషయములను - వ్యాఖ్యాత వివరించి
విప్పి చెప్ప వలెను - విపుల శైలి.

శీలం

సులువు - నీతి బోధ - కలము త్రిప్పుటె గదా !
కదుప నాల్క అంత కంటె సులువు;
'చిత్త శుద్ధి' మేలు - శీలమే ముఖ్యమ్ము;
పూనకమ్ము కవికి హానికరము.

ఈత

ఏటి నీట ఈద - ఏక దూరమె తోచు,
అవలి గట్టు మరియు ఇవలి గట్టు,
అభ్యుదయము కలుగు అవలి గట్టును చేర,
ఇవలి గట్టు మీది దృష్టి విడిచి.

ఇంద్రియములు

అనుభవింప - ఇంద్రియములు చెందవు - తృప్తి,
ఆగ వెపుడు నిగ్రహమ్ము లేక,
ఆరి పోవ దగ్ని - ఆజ్యమ్ము పోయుచో!
చూడ వలయు గాలి సోక కుండ.

స్వాగతం

దూకినాను నేను- దూక మంటివి నీవు !
ఏటి నీటి కెదురు ఈదు చుంటి,
చేర గలను అవలి తీరమ్ము త్వరలోన,
అచట చేరి ఇమ్ము స్వాగతమ్ము.

షష్ఠి పూర్తి

తగ్గి పోవు దేహ దార్ఢ్యమ్ముతో పాటు
మంచితనము - వయసు మళ్ళి నపుడు;
షష్టి పూర్తి అనిన - స్వార్ధ సంపూర్తియే!
కొంద రుండ వచ్చు గొప్ప వారు.

మానస వికలు లగు - మనుజు లెందరు వేరు ?
ఉండ వలయు వారి కూత కళ్ళి ;
ఒకడు మంత్ర జపము - ఒక్కండు గురుదేవు,
ఒకడు శాయి చరణ యుగము - పూను.

విశ్వహితం

కాల హరణ మగును గత చరిత్రను త్రవ్వ,
వెఱ్ఱి తనము హృదిని పెంచ నేల ?
కలవు - నేడు మేటి కర్తవ్యములు పెక్కు,
సర్వ మనుజ, హితము సాక దగును.

నయవంచకుడు

సంఘ సేవ పేర - స్వార్థ లాభము పొందు;
నీతి లేని దొంగ నేత - తరచు;
నమ్మ లేరు ప్రజలు - నయ వంచకుని సదా,
బుడగ వోలె పగులు బూటకమ్ము.

గురుభక్తి

అవని లోన ఉన్న అనుబంధముల లోన,
స్వార్థ లేశ ముండ వచ్చు - కొంత !
పరమ పావనమ్ము - గురు భక్తి బ్రతుకులో;
అవని కవలి వెలుగు అందు కలదు.

ఇష్ట మైన పాత్ర - ఇహ నాటకము నందు,
ఎవరు వేయ గలరు ? ఎప్పు డైన ??
కుదురు కున్న యెడల - కుక్క పాత్రను వేయ,
మొరగ వలయు మరియు కరువ వలయు.

శిష్యుడు

ఔరసుండు కంటె - అధ్యాత్మ పుత్రుడే,
శిష్య వరుడు - అరయ - శ్రేష్ఠు డగును !
అంతరాత్మ గొప్ప దరయ దేహము కంటె,
వెలుగు - శిష్య హృదిని వెల్లి విరియు.

మాయావరణం

మరణ సమయమును కడు దు
ర్భరమును చేయ గలవు గద మమతలు - మాయా
వరణములే మనుజుడు తా
మరపాకున జల కణ మటు మసలుట మేలౌ.

కలలు

కలుగు నాకు రోత - కలి యుగమ్మును గాంచ,
కలలు గాంచ తృప్తి కలుగు చుండు;
పడును నరక బాధ పుడమిపై మనుజుండు,
పసిడి కలలు లేని బ్రదుకు నందు.

మనిషి-మనిషి

పుడమి - నరుల బ్రదుకు బుద్బుద ప్రాయముల్ !
కట్టె లట్లు నరులు కలియ వచ్చు,
మనిషి మనిషి కలియ మాధురీ యోగమ్ము
మనసు గలుగు కట్టె మరువ లేదు.

ధైర్యసాహసాలు

తరచు - ఎల్ల పనుల ధైర్య సాహసములే !
జయము కూర్చు చుండు జగతి యందు;
వేయ రాదు జంకి వెనుకంజ ఏ నాడు,
సగము సగము పనులు సలుప రాదు.

గులాబి ముళ్లు

సృష్టిలో - గులాబి మొక్క కుండును - ముండ్లు;
తాండవించు పూల - తావి సొగసు !
లోన నరయ సృష్టి - లోప భూయిష్ఠమే !!
మరువ దగును ముండ్ల మాట - మనిషి.

స్నేహం

స్థూల కారణములు చూప వచ్చును కొన్ని,
స్నేహ బంధమునకు ఐహికములు,
నిక్క మైన చెలిమి - నిర్హేతుకము గదా!
వింగడింప రాని వింత ప్రేమ.

మధ్యవర్తి

సంఘ సంగ్రహమ్ము సాధించు కోసమే,
మధ్య వర్తి తీర్పు మాన్య మగుత !
అంత కంటె లేదు న్యాయ నిర్ణయముకై,
విశ్వ మెల్ల వెదుక - వేరు వెరవు.

నరమేధం

చరిత - క్రుళ్లి - ఘోర నర మేధముల తోడ,
పడగ విప్పె స్వార్థ పరత తరచు ;
సంఘ హితము విశ్వ సామరస్యము నేడు,
మనిషి కోర దగును - మరచి చరిత.

పురిటి నొప్పులు

శాంతి భద్రతలను - సంఘమ్ము వాంఛించు !
ఉద్యమములు ప్రజల నూపు తరచు,
పుట్టె దెపుడు - బిడ్డ - పురిటి నొప్పులు లేక,
శ్రమ విరహిత మైన ప్రగతి లేదు.

విద్య

పరమ ధర్మ మేది ? పాత్ర దానము కన్న ?
గొప్ప దేది ? 'జాలి గుండె' కన్న ?
సహన గుణము కన్న సౌశీల్యమే లేదు;
వినయ గరిమ కన్న విద్య లేదు.

కష్టాలు

అప్పు డపుడు కలుగు - ఆభాస కష్టముల్,
బ్రదుకు లోన తెలియ రాని మేలు;
పాము లుండ వచ్చు - వైకుంఠ పాళిలో;
కొన్ని నిచ్చెనలును ఉన్నవి గద.

ప్రేమ

అరయ - ప్రేమ అనిన - అసమగ్ర శబ్దమే ;
చిందు తరళ బాష్ప బిందు ధార !!
గులక రాయి నైన - కోహినూరుగ మార్చు !
విలువ తెచ్చు - పాత వెంద్రుకలకు.

జన సంఖ్య

జగతి యందు పెరిగె జనసంఖ్య సాంద్ర మై,
నరుల సగటు వయసు పెరిగి పోయె,
జనన సంఖ్య తగ్గ - ఒనగూడు శ్రేయస్సు;
ఎల్ల దేశములకు ఇది సమస్య.

ప్రగతి.

సమత - స్వేచ్ఛ - సర్వ సౌభ్రాత్ర తత్త్వమ్ము,
భూత దయ స్రవించి పొంగు గుండె;
సహన గుణము - సతత సంతృప్తి శీలమ్ము,
ప్రగతి కూర్చు మనుజ జగతి లోన.

అప్పుడు

శ్రమను గూడ - గొప్ప సంతోషముగ నెంచి,
జంక డెవడు వ్యయము జరుపు వేళ,
నీకు సేవ చేయు నిజ మైన మిత్రుండు,
ఆదరింప వయ్య అప్పు నెపుడు.

జీవితం

ఆలు మగల మధ్య - అన్నదమ్ముల మధ్య,
శత్రు మిత్ర బంధు జనుల మధ్య,
నాటకీయ మైన మేటి మార్పులు వచ్చు;
చిత్రము గద - మనుజ జీవితమ్ము.

విజ్ఞాన నయనములు

వికసనమ్ము చెందు - విజ్ఞాన నయనముల్,
అనుభవమ్ము పొంది అను దినమ్ము
సాంస్కృతిక జగాన - జాత్యంధుడును గూడ,
శత సహస్ర నేత్ర యుతు డగు గద.

అంతరాత్మ

సజ్జనుండె అయిన - సంస్కారి యైనచో,
అతని లోన ఉండు అంతరాత్మ ;
అంతరాత్మ బోధ ఆలకించక యున్న,
మానవుండు పశు సమాను డౌను.

సజ్జనుడు

సజ్జనుండు సర్వ జగదేక పౌరుడై;
వదలి పెట్ట గలడు - స్వార్థ పరత;
బహు జనహిత మెంచి - బహుజన ప్రియ మెంచి;
తీర్చి దిద్దు బ్రదుకు తీరు తెన్ను.

ప్రగతి శీలి

భూత కాలమును - అతీత ప్రబంధాల
ప్రజలు తలుప వచ్చు పావనముగ,
"ప్రగతి శీలి" సతము భావి కాలము వైపు,
దృష్టి నిలుప గలడు దీక్ష తోడ.

దాత

తెలిసి కొన్ని - నరుడు తెలయ కుండగ కొన్ని,
పాపములను చేయు - బ్రదుకు లోన;
పాత్రత గురుతించి - బహుమాన బుద్ధితో,
దాన మిచ్చు వాడె - జ్ఞాన యోగి.

కర్తవ్యం

మీా సమక్ష మందె - మీా సమీాపము నందె,
కలదు - చూడ దగును - కాలి బంతి;
ఆడ వలయు మీారె అలస్యమును వీడి,
సహృదయ వర - ఇంక - జాప్య మేల ?

సుఖం

చూడ - బహు వచనము - సుఖము - జీవితములో,
లేక ద్వివచనమ్ము లోక మందు,
పడయ వచ్చు సుఖము భాగహారము చేసి,
అది - గుణోత్తర మగు బ్రదుకు నందు.

భార్యా భర్తలు

గర్వ మొందు - భార్య - గర్భమ్ము తాల్చగా,
పరవసించి పోయి - భర్త గారు,
కష్టపడి ఉభయులు - ఘన కార్య మేదియో
చేసి నట్లు సంతసింప గలరు.

కవిత

మెరపు తీగ వెలుగు - మిరుమిట్లు కల్పించు,
వాక్య మొకటి కవిత - పదము - కవిత,
కవిత - అనిన - చటుల కాంతిచ్ఛటా ధాటి,
కాదు కాదు దీర్ఘ కాళ రాత్రి.

స్వప్న భోజనుడు

సిగ్గు విడిచి తిరుగు - చింత వంతలు లేక !
రాజ వీధి - స్వప్న భోజనుండు;
జనము వెక్కిరింప - సంతోషమును జెందు,
తిట్లు స్వీకరించు దీవెనలుగ.

నిదుర

జీవితమున నిత్య కైవల్య కల్యాణి
నిదుర - ఇంపు పెంపు నింప గలదు;
వెల్లి విరియ జేయు విశ్రాంతి సంక్రాంతి;
బ్రదుక లేడు నరుడు నిదుర లేక.

గానం

కవిత - రక్తి కట్టు - గానమ్ము తోడైన,
కలియ వలెను కలము గళము తోడ,
కవిత - నిదుర వోవు గ్రంథాలయాలలో !
పాడ గాయకుండు ప్రజల చేరు.

సంకల్ప శుద్ధి

జరుగు - గొప్ప పనులు సంకల్ప శుద్ధిచే !
పూను కొన - పవిత్ర మానసుండు ;
నింగి తరలి వచ్చి - నేలనే చుంబించు;
వెలుగు నీడ పడుగు పేక లగును.

ఎన్నికలు

ప్రజ లటన్న నమ్మ రాని గొఱ్ఱెల మంద,
నేడు స్వాగతింత్రు - నేత నొకని,
అట్లె అతని శత్రు నాదరింతురు రేపు!
కలల వంటి వెన్నికలలు సుమ్ము.

భరతవాక్యం

తెలుగు భాష దాటి - తెలుగు సీమలు దాటి,
తేరి పార జూచి - తెలుగు సుకవి,
ప్రగతి శీలి యగుచు - జగదేక పౌరుడై,
తీర్చి - భావయిత్రి - దిద్దు కొనుత.

మౌన బిందు కళలు

మౌన బిందు లమర - మాట మాటకు మధ్య,
వక్త భాషణమ్ము - రక్తి కట్టు,
నత్తి కాదు - మౌన నాట్య విన్యాసమ్ము,
గుండె కుదిపి మేలు కొలుపు - విరతి.

గొప్ప విద్య

బ్రదుకు లోన పెద్ద చదువు ముఖ్యము కాదు,
పనులు చేయు నట్టి ప్రజ్ఞ మేలు;
ప్రజల కుపకరించు పనులు చేయుట కన్న,
విశ్వమందు గొప్ప విద్య యేది ?

సత్యసంధుడు

శిరము చుట్టు వెలుగు పరివేషములు తోచు;
సత్య సంధునకును సంతతమ్ము !
తిరుగు సత్య విభుడు - దేదీప్యమానుడై ;
త్రికరణ పరిశుద్ధి తేజరిల్ల.

చలన చిత్రములు

కలలు గనిన యెడల - చలన చిత్రము చూడ,
ప్రగతి ఏమి కలుగు బ్రదుకు నందు ?
తీరి నట్టి కోర్కి - తీరు భ్రాంతిని గూర్చు;
శాంతి గలుగు కొన్ని క్షణము లైన.

సంధ్య

సాంధ్య రాగ మమరు - సకల విద్యల యందు,
వెలుగు చీకటి జత విరియ వచ్చు,
తరచు కలియ వచ్చు - తడి అగ్గి - పొడి నీరు;
పడుగు పేక లట్లు బ్రదుకు నందు.

ఆచరణము నందు - ఆదర్శములు కొన్ని,
సాధ్య పడవు మనుజ సంఘ మందు,
అంద కున్న నేమి ? - ఆకాశ తారకల్,
ధారుణీ ప్రజలకు - దారి చూపు.

టేకు

బలము హెచ్చు - కాని బరువు తక్కువ గదా,
చెలువ మొలుకు టేకు చెట్ల కలప;
నాక వనము వోలె - టేకు మ్రాకుల తోపు,
గాలి తేల్చు - ధ్వనుల కల కలములు.

అనుభవం

అనుభవమ్ము కన్న అధికుడౌ గురు డేడి ?
అనుభవమ్ము జ్ఞానమునకు నాడి,
వ్యర్థ మగును విద్య - అవగాహనము లేక,
అనుభవజ్ఞు డైన మనిషి - మనిషి.

అధిక ప్రసంగాలు

అచ్చు వేయ వచ్చు - ఆహ్వాన పత్రికల్;
ఇంపు గొలుపు నట్లు సొంపు మీర,
అతిథి వరులు సభల అధిక ప్రసంగముల్,
సలుప కుండ ఆప జాల రేవరు.

సమగ్ర దృష్టి

బ్రదు కనిన సహస్ర పత్ర కల్హారమే;
సొగసు తావి కలిపి చూడ వలెను,
అవధరింప వలెను, ఐక్య సంధానమ్ము
రేకు రేకు కత్తిరింప రాదు.

సూక్తి

చాట వచ్చు జ్ఞాని సాపేక్ష సత్యమ్ము
మనుజ హితము కొరకు మాట మలచి,
అరయ దగును పూని అంతరార్థము నెన్ని,
మాట వేరు ! లోని మనసు వేరు.

సహనం

పూర్ణ సత్య మేది పుడమిలో లేదయా !
ఎదుటి వాదమును సహింప వలెను !
పరమ ధర్మ మేది ? కరుణార్ద్ర హృదయమే,
సహన గుణ మజాత శాత్రవమ్ము.

గొప్పవాడు

ఎవడు గొప్ప వాడు ? ఈ ప్రపంచము నందు ?
నేడు కష్ట తరము - నిర్వచింపు;
పొదుపు చేయు వాడు - బ్రదుకులో కాలమ్ము
కోరి - పర హితమ్ము కూర్చు వాడు !

దూత

ప్రీతి చూడ దగును - దూత నైనను గూడ,
స్వాగతమ్ము తోడ సానుభూతి,
కష్టతరము స్వామి కార్యభారము మోయ,
సొంత కార్య మైన కొంత సులువు.

సత్సంగం

పొంగారిన హృదయ ద్వయి
గంగా యమునలను బోలి కలసిన - ఆ సత్
సంగము - శారీరక మగు
శృంగారము కంటె మిన్న - శ్రేష్ఠ తమంబౌ.

వేత్త

చిత్త పరిధి దాటు సృష్టి వైశాల్యమ్ము!
వెల్లడించె జ్ఞాన విప్లవమ్ము;
గురు వరుండు - కాడు కూపస్థ భేకమ్ము;
విశ్వ పౌరు డగును వేత్త - సతము.

గర్భవతి

శిశువు చదువు మరియు శిశువు సంక్షేమమే.
దేశ జనుల మొదటి దీక్ష యగుత,
చూడ వలెను - ముందు - చూలాలి శ్రేయస్సు!
కలదు - "రేపు" - ఆమె గర్భ మందు .

సర్వ సౌఖ్యములను - జనని యయ్యెడు స్త్రీకి;
తెలివిడి మెయి తీర్చి దిద్ద వలెను,
సెలవు లివ్వ వలెను - జీత బత్తెము లిచ్చి;
ఆట విడుపు స్థాయి నధిగమించి.

మార్పు

మనుజ వరుడు మార్చుకొను అభిప్రాయముల్,
బ్రదుకు నందు అనుభవాల బట్టి,
అరయ మానసమున కారోగ్య చిహ్నమే,
మార్పు కోరు కొనుట మానవుండు.

పెండ్లి

పిచ్చి ముదిరి - తండ్రి - పెండ్లి చేయగ రాదు,
కూతురు మనసార కోర కున్న;
స్వేచ్ఛ లేని గొప్ప చెఱసాలయే గదా!
గృహిణి సంచరించు గేహ మన్న.

విజయం

విజయ మివ్వ లేవు - నిజము ధర్మము గూడ,
తక్షణమ్ము మనుజ ధరణి లోన !
తరచు - మనిషి ఆత్మ బలిదానమును చేసె !
బ్రదుకు లోన ధర్మ రక్ష కొరకు.

స్వరం

పెండ్లి - మంత్రములకు వివరణం బిక ఏల ?
అంద రంతరార్థ మరయ గలరు !
ఉండు - గొప్ప శక్తి ఉచ్చారణము నందె,
చెవుల బడిన స్వరము చేరు హృదిని.

మంచి మనిషి

గళము - మ్రోగ వచ్చు - కంచు ఢక్కా మించి,
కలము మెరపు తీగ అలుక వచ్చు;
మేటి పదవి యున్న - మేధావి కావచ్చు,
మంచి తనము లేని మనిషి యేల ?

వృద్ధుడు

అలక పాన్పు పైన - అల్లుండు పెండ్లిలో,
కోర వచ్చు కొన్ని కోరికలను,
బాధ పెట్ట రాదు పరుల - వృద్ధుడు పూని,
దిగక అలక పాన్పు దిన దినమ్ము.

వృద్ధుడు

కూర్చు కొనుట తప్పు - క్రొంగొత్త కోరికల్,
వయసు మళ్లి నపుడు బ్రదుకు నందు;
శక్తి తగ్గి నపుడు - జ్ఞానియై వృద్ధుండు;
పెంచు కొనుట మేలు - మంచి తనము.

నిషా

మనుజు మనసు కోరుకొను నిషా తరచుగా,
కొంత మంది కల్లు గ్రోల వచ్చు;
మతము భాష ధనము - మద్యపానము కంటె,
మత్తు గొలుప వచ్చు మానవులకు.

సహనం

నిండి యుండు - జగతి - ఖండ సత్యాలతో;
సంస్కృతి యన నేమి ? సహన గుణమె;
స్వస్తి పలుక వలెను "శాంతి పాఠము" పాడి,
వేదములకు - సకల వాదములకు.

సంధి

ఎవడు గూడ ఎప్పు డేకాంత వీరుడై,
బ్రదుకు లోన సలుప రాదు - పోరు !
ఘోర తీవ్ర వాది కారాదు ధరణిలో,
కూర్చు కొను వివేకి కోరి సంధి.

దాత

బ్రదుక గలుగు నెడల - పర పీడనము లేక,
'ధన్యజీవి' నరుడు ధరణి లోన !
తా శ్రమించి కూర్చు ధనము దానము చేయ,
దాత - ధన్య తముడు ధరణి లోన.

రెండు ధ్రువములు

రెండు ధ్రువము లుండు - కృషి సమస్తము నందు,
విశ్వ మెల్ల విరియు విద్యు దంశ !
ఋణము ధనము సంగమింప వెల్గును - బల్బు;
కలియ - ఆడ మగలు - కలుగు బిడ్డ.

సభ

తరచు వాగ నేల ? తల తోక  లేకుండ,
మంచి విషయములనె  మరువ వచ్చు;
ముఖ్య మైన అంశములు  కాగితాలపై,
వ్రాసుకొనక  వెడల రాదు సభకు.

జయము

జీవితమున విజయ సిద్ధి  కల్గుట యెట్లు ?
నిర్వచింప లేని నిజము కలదు !
అప్పు డప్పు డెట్టి యత్నమే  లేకుండ,
వచ్చి జయము భజము పైన వ్రాలు.

మన ప్రయోజకత్వ మని  యెంచగా రాదు,
వచ్చి నపుడు  జయము - బ్రదుకు నందు,
కలుగ వచ్చు జయము కారణాంతరముచే,
ఎపుడు -మెదడు తిమ్మి రెక్క రాదు.

గర్భవతి

చదువు - శిశువు కెపుడు మొదలు పెట్టుట మేలు ??
గర్భ మందు  పెరుగు కాల మందె !!
దేశ మెల్ల అతిథి దేవిగా  అర్పించి,
గౌరవించు గాత - గర్భవతిని.

మధ్యసిరి

తల్ల డిల్లు - నరుడు - తన ప్రతాపమె యంచు
చేరి నపుడు - మధ్య సిరులు వచ్చి ;
మిడిసి పడు నహమ్ము మితి మీర బ్రదుకులో;
పొంగువారి నేల నింగి కలిపి.

ప్రపంచ పార్లమెంటు

మనిషి - వీడ దగును - మమకారముల నెల్ల,
మతము జాతి కులము మమత లేల ?
వచ్చు గాత - వేగ - వసుధైక రాజ్యమ్ము
ప్రాజ్ఞతా ప్రపంచ "పార్లమెంటు".

వివేకం

కలిసి యుండు బ్రదుకు - వెలుగు నీడల తోడ,
నీడ విడిచి - వెలుగు - చూడ దగును;
గుడ్డ గూబ గూడు - గుండె - చేయగ నేల ?
ప్రొద్దు తిరుగుడు పువు బోలు గాత.

నాయికా నాయకులు

చేయి చేయి కలిపి - నాయికా నాయకుల్,
కూర్మి పేర్మి కోరి కూడి నపుడు,
సంతసింప వలెను - సహకార మందించి,
సహృదయుండు మనుజ జగతి లోన.

విశ్వశిల్పి

సృష్టి యెల్ల - చిత్ర చిత్రమ్ముగా తోచు !
పరమ గణిత శాస్త్ర బంధురమ్ము !!
ఉండు "విశ్వ శిల్పి" ఒక్క డెవ్వడొ గాని,
అతని ప్రజ్ఞ దలచి అంజలింతు.

చిరునవ్వు

ముక్కు - శీఘ్ర కోప ముద్రాంకితమ్ముగా,
చిట్టి పొట్టి చిరుత చిందు లేల ?
మొగము నందు - ఆణి ముత్యాల చిరు నవ్వు,
వెన్నెల వలె వెల్లి విరియు గాత.

మాట

వెలసె మాట లందె - వేద సంహిత లెల్ల,
వివిధ విద్య లెల్ల విశ్వ చరిత,
కవన శాస్త్రములకు కాణాచి మాటయే !
మాట సాటి యేది ? మాట తప్ప ?

శిష్యుడు

అరయ కావ్య రసము - యన్నిష్ఠమై యుండు ?
అమరి యుండు సహృదయ హృది యందె !
అరయ గొప్ప దనము - గురువు గారిది కాదు;
చిన్మనీషి యెవడు ? శిష్య వరుడె.

వసుధైక కుటుంబము

కోరి - మానవతనె - క్రొంగొత్త మతముగా,
నరుడు బ్రదుకు గాత - ధరణి మీద,
పరము మరచి - ప్రగతి - జగదేక విద్యయై,
ఒక కుటుంబ మగుత - ఉర్వి యెల్ల.

ప్రక్క వారు

కూడు చుండు చుట్టు - గొప్ప వానిని చేరి,
నక్క - గున్న యేన్గు - కుక్క కొదమ,
గరుడ పక్షి - నెమలి - గండ భేరుండముల్,
తరచు మనుజ రూప ధారణమున !!

ఋణము

ఉత్తముండు - మరచు - ఉపకార మొనరించి,
ప్రతిఫలమ్ము కొరకు వాంఛ విడిచి,
సాయ మందు వాడు - చక్ర వడ్డీ తోడ,
తీర్పు జూచు - ఋణము - తిరిగి తరచు.

అనుష్ఠాన వేదాంతి

జీవ దుపనిషత్తు - సిద్ధాంతి - విజ్ఞాని,
యోజనా తపస్వి - ఉజ్జ్వలుండు;
నిష్ఠ తోడ ఒక అనుష్ఠాన వేదాంతి,
సేవ చేయు 'ప్రగతి శీలి' యగుచు.

అతిథి

ఆదరించ వలెను - అతిథి ఇంటికి చేర,
అతడు చెడ్డవాడె అయిన గాని,
స్థలము గాదు తగిన సమయమ్ము కాదయా;
పరష వాక్యములను పలుక రాదు.

భారత దారిద్ర్య

భారతీయ మైన - దారిద్ర్య పంకాన,
పద్మ పుష్ప శోభ - పరిఢవిల్లు,
ఆంతరంగిక మగు అధ్యాత్మ రోచిస్సు;
విశ్వ మెల్ల వెల్లి విరియ జేయు.

పోతు తాడి

భ్రష్ట యోగి - సుకవి వరుడు జీవితములో !
ఒక మహా ప్రవక్త ఉర్వి లోన,
చెప్ప గలడు తాను చేయ లేనివి గూడ,
పోతు తాడి వోలె నేత నిలుచు.

సానుభూతి

నీతి విధి నిషేధ నిరతి చూడగ నేల ?
సానుభూతి మేలు - జాలి మేలు;
ఎవరి పైన గాని - ఏ దోషిపై గాని
కోప తాపములను చూప నేల ?

ప్రేమ

ప్రేమయె అహింస - యావద్
భూమీ స్థలి - భూత దయగ పూజ్యత నందున్,
ఈ మానవ లోకములో
ప్రేమయె సర్వ మతములకు పేరిమి గూర్చున్.

దానం

దానము కూర్చును - ధన్యత
దానమె చేకూర్చు - ప్రగతి - ధాత్రీ స్థలికిన్,
దానము చేయక యుండిన
మానవుడే దానవుండు - మహిలో సుమతీ.

కవిత

ప్రభుత - కూర్ప వచ్చు పంచభూతములపై,
నవ్య నాగరికత - నరుల కిపుడు !
సానుభూతి చూపు సంస్కార హృదయమ్ము
కలుగ జేయ గలదు - కవిత యొకటె.

సమయం

ఆడు నపుడు ఆడు - పాడు నప్పుడు పాడు;
విశ్రమింపు మాట విడుపు వేళ,
ప్రక్క చూపు వద్దు - పనిచేయు సమయాన
సమయ పాలనకు జయము జయము.

లోభి

ధనము పెంచ వచ్చు దాచి బ్యాంకుల లోన,
లోభి పొందు నట్టి లాభ మేమి ?
కాచ నేల ? ధనము కాపలా కుక్కగా,
జగతి కెల్ల కూర్చు ప్రగతి - దాత.

నేత

నేత కుండ వలయు నిత్య చైతన్యమ్ము,
బద్ధకమ్ము సుంత పనికి రాదు;
కార్యశూరు డెపుడు కార్య క్రమము లందు
ప్రజల కదిపి కుదిపి బ్రదుకు గాత.

సహనం

నిండి యుండు బ్రదుకు ఖండ సత్యాలతో;
సహన సానుభూతి సంస్కృతి యగు
సర్వ మతము కెల్ల సహ జీవము చేయ,
జనులు పొంద గలరు శాంతి - సుఖము.

వినయం

మనుజుల గుండెల లోపల
వినయమునే నింపు పెక్కు విరి పరిమళముల్,
జను లందరు పీల్చెద రా
ఘనసార భరితములౌ సుగంధానిలముల్.

భాష

నిజము కాని మాట - ప్రజల మేలును గోరి,
చాటి చెప్ప వచ్చు - జ్ఞాని యొకడు,
పలుకు బడులు వేరు - ప్రకరణార్థము వేరు,
ప్రజకు తెలియు భాష - వక్త - వాడు.

దేహశక్తి

జ్వరము వచ్చు తరచు - స్వాస్థ్య సంసిద్ధికై;
వేగ - వైద్యు కడకు - వెడల రాదు;
బాగు చేసి కొనెడె బల శక్తి సహజమ్ము
దేహమునకు వింత తెలివి గలదు.

గీటురాయి

ఏది గీటు రాయి ? ఎట్టి ప్రజ్ఞకు గాని ?
అవని మీద ప్రజల అభిమతమ్మె !
మేటి ప్రతిభ యైన - మెచ్చ కున్నను ప్రజల్,
రక్తి కట్ట బోదు - బ్రదుకు నందు.

ధార్మికుడు

ఎవడు - ప్రతిభ ప్రోత్సహించు ముందుకు వచ్చి ?
ఓటు నెవ్వ డిచ్చు యోగ్యు వెదకి ?
పరమ సహన మెవడు ప్రతివాదిపై చూపు ?
ధరణి మీద అతడు ధార్మికుండు.

అంతరాత్మ

తప్పు చేయ వచ్చు - దండింప బడకుండ,
కాని - అంతరాత్మ - కలదు లోన;
గుండె లోన - ముండ్లు - గ్రుచ్చు చుండును గదా,
'అంతరాత్మ' ఘోష అణచు టెట్లు ?

చుట్టు గుడిసె

"సగటు మనిషి" బ్రదుకు - సంతృప్తి - యున్నచో,
పరమ ధన్య తమము ధరణి మీద,
సాహస విజయాల - సంగ్రామ రంగాల,
చుట్టు గుడిసె లోని సుఖము లేదు.

నేత

చేయ వచ్చు పనులు జీవించుటకు - పెక్కు ;
కోటి విద్య లెల్ల కూటి కొరకె;
మనుజ హితము కొరకు మానవత్వమునకై,
నేత - ఒక్క పనిని చేయ దగును.

ఉద్యమాలు

పిచ్చి కొంత లేక - ప్రేమ భావము లేక
మంచి చేయ లేడు - మనుజు డెవడు;
వ్యసన మందు నుండు - ఆనంద సంతృప్తి
ఉద్యమాల లోన ఉండు కొంత.

భారతీయచరిత్ర

ప్రాకృతమ్ము లోన - పాండిత్యమే లేక,
సంతరింప కుండ సంస్కృతమ్ము;
భరత దేశ పూర్వ చరిత - అర్థము గాదు,
వదల వలెను చిలుక పలుకు లింక.

సూర్యుడు

సూర్యు డుదయ మందు - చూడ కన్నులు రెండు;
దిన దినమ్ము - తూర్పు దిక్కు నందు,
అరయ అది ఒక భ్రమ - అది యథార్థము కాదు,
పూర్ణ సత్య మేది పుడమి లేదు.

గుడిసె

ఉన్న - గుడిసె ఒకటి - ఉర్విపై - నరు లెల్ల,
శిరము వంచు కొనుత సిగ్గు చెంది;
పారద్రోల కుండ - దారిద్ర్య మవనిలో,
ప్రగతి కాదు - నరుని గగన యాత్ర,

సంధి

వైరి భావములకు పోరాటములు మాన్పి,
సామరస్య సంధి సలుపు - సుకవి ;
వెల్లి విరిసి పొంగు - విజ్ఞాన సంగీతి
తాళ లయలు తీర్చు తత్త్వ వేత్త.

ఉద్యమాలు

ఉద్యమాలు - రేగు ఉప్పెనల్ వంటివే,
బ్రదుకు తెరువు నెరిసి నిదుర రాదు,
చరితలో అవశ్య సన్నివేశము లవ్వి
సలుపు చుండు సంఘ సంగ్రహమ్ము.

తులాభారం

ఉండు వేత్త గుండె - ఒక తులాభారమ్ము !
వింగడించు కొనగ విలువ లెల్ల,
కూర్చు కొనుట మేలు క్రొత్త తూనిక రాళ్లు,
ప్రగతి కొరకు మారు జగతి లోన.

మంచితనం

నిత్య శంకితుడను నేను జ్ఞానిని కాను,
నేను నాస్తికుండ గాను - కాను;
నమ్మకము లేదు నాకే మతము మీద !
మంచితనము మీద మమత కలదు.

విచిత్ర విరోధాభాసం

బ్రదుకె - ఒక విచిత్ర వైరుధ్య సత్యమ్ము !
వేరు ధ్రువము లచట చేరు చుండు;
నా కవిత్వ మర్ధ నారీశు నృత్యమ్ము !
వెలుగు నీడ కలియు వింత సంజ.

భూత దయ

బ్రదుక లేదు కొంత పర పీడనము లేక,
ధరణి మీద నున్న - నరు డెవండు;
బ్రదుకు లోన పాప పరిహార మున్నదా ?
దాన గుణము భూత దయయు తప్ప.

నరుడు పెంచు కొనుత కరుణార్ద్ర హృదయమ్ము,
హింస - సృష్టి నెల్ల - ఏల వచ్చు;
ఎంచ - భూతదయయె - ఏకైక ధర్మమ్ము;
ఆస్తికులకు మరియు నాస్తికులకు.

నేల

నేల మీద వాస్తవాలు చూచుట మేలు;
బాట తెలియ నట్టి పయన మేల ?
కోరి వెడల నేల ? కుందేటి కొమ్ముకై ?
చిగురు టాకు చాలు ప్రగతి తెలుపు.

వాలఖిల్యులు

కనగ రాదు పైకి - మనసులో శ్రోత్రియుల్,
మసల గలరు వింత మడిని గట్టి;
వారు బ్రదుక గలరు - వాలఖిల్యుల వోలె;
భూత కాలికులుగ - భూమి మీద.

మనసు

మనసు మడత లందు - మూరు మూలల యందు,
పాచి - బూజు - తుప్పు పట్టు చుండు !
జ్ఞాన జాగృత మగు ధ్యాన మౌనము వల్ల,
మనసు లోని కిలుము మాప వచ్చు.

జ్ఞాన విప్లవం

ప్రతి మనిషికి ఉండు ప్రత్యేక మత మొండు,
వచ్చె - జ్ఞాన విప్లవమ్ము - నేడు,
గ్రుడ్డి బాట లేల ? గుడు లేల ? బడు లేల ?
అనుభవమ్ము మిగుల అవసరమ్ము.

నటరాజు

నాట్య మాడు చదల "నటరాజు" ప్రతిరోజు,
మాపు - బాల శవము వీపు మీద,
అందు కొనుత - సుకవి - ఆనంద లయ లీల;
కలిపి శ్రుతిని విశ్వ గానమునకు.

జ్ఞాని

కలి యుగమ్ములో - జగత్ వంచనము లేని,
వృత్తి యెచట కలదు పృథివి యందు ?
అసలు బ్రదుకు నెవ్వ డాత్మ వంచన లేక;
అతడె కర్మయోగి అతడె జ్ఞాని.

శిష్యుడు

'చిత్త శుద్ధి' తోడ - చేయ వచ్చును సేవ;
శిష్యు డైన యెడల - చిన్మయుండు
తాను చేయు చుండు తప్ప దంచును పూని,
కొడుకు చేయు సేవ గొప్ప కాదు.

వేడి - వెన్నెల

ఉండ వచ్చు - అపర చండ మార్తాండుండు,
సర్వ నిగమ శాస్త్ర సంగ్రహుండు,
చల్ల దనము జల్లు జాబిల్లి యొకడుండు;
వెన్నెల సిరి వేరు - వేడి వేరు.

మీగడ

పలుచ మజ్జిగ పయి - భావముల్ కవితలో,
తేలు వెన్న ముద్ద వోలె తరచు;
గడ్డ పెరుగు పైన - కట్టు దట్టమ్ముగా;
మేలి రచన యైన - మీగడ వలె.

రేపు

బ్రదుకు లోని గొప్ప వైచిత్రి - ఏదయా ?
నేడు - రేపు రూపు - చూడ లేము !
జరుగు నాటకీయ సన్నివేశము లెన్నొ,
ధరణి లోన ఊహ పరిధి దాటి.

అహము .

మనిషి - అహము పెంచు కొనుట అజ్ఞానమే;
విద్య - పండి నపుడు వినయ మగును;
అవసరమ్మె - అహము - వ్యవహార జగతిలో;
హృదిని చేర రాదు పెదవి దాటి.

అపజయం

ఓడి పోవు నపుడె - ఒక్కొక్క సమయాన,
ఉజ్జ్వల మగు తృప్తి యుండు దాగి,
విజయ మందు అహము విఱ్ఱవీగుట కద్దు,
అపజయ మెపుడు - వినయమును గూర్చు.

మధుర శాంతి

దివిని - భువిని బ్రోచు దేవుండు లేకున్న,
మనిషి కల డతనికి మనసు కలదు,
ఆస్తి కత్వ మొసగు అవనిపై జీవించు
మనిషి మనసు లోన - మధుర శాంతి.

ధైర్యం

దేహ బలము కంటె - తెలివి తేటలు మిన్న,
జయము నందు కొరకు జగతి లోన,
తరచు జయము కూర్చు ధైర్య సాహసములే !
చిత్ర మైన మనుజ జీవితమున.

పెద్ద మనిషి

తాను పెద్ద మనిషి యైనచో మన్నించు;
అతిథి ఎంత నీచు డైన గాని;
ఆత్మగౌరవమ్ము యన్నిష్ఠమై యుండు ?
స్వీయ సంస్కృతి వికసించు గాక.

అజాత శత్రువు

అల అజాత శత్రు నమృత పాత్రను గూర్చి,
సాహితీ చరిత్ర చదివినాము;
ఇల - కనుల యెదుటనె - ఈక్షించితిమి గదా,
మనుజు గాంధి రక్త మాంసలునిగ.

సంస్కృతి

పాప మనిన ఏమి ? పర పీడనమె సుమా,
ఉత్తమ కృషి యన పరోపకృతియ,
సంస్కృతి యనిన ఏమి ? సహన శీలమె గదా ,
విద్య యనిన నేమి ? వినయ గుణమె.

నాగరికత

నాగరికత పెరుగ నర జీవితాలలో,
"చిత్త శుద్ధి" తరుగు - శీల మందు,
శూన్య హస్తు లగుచు - శుష్క ప్రియాలతో,
బ్రదుకు గడుప గలరు - మెదడు పెంచి.

బొమ్మ - బొరుసు

ఎవ్వ రైన గాని - ఏ నాణెమున గాని,
"బొరుసు" చూడ వలెను "బొమ్మ" తోడ ;
పూని అరయ దగును పూర్ణ సత్యమ్మునే;
పక్షపాత దృష్టి పనికి రాదు.

వేత్త

కూర్చె రాయి చెక్కి - గుడిలోన భగవంతు;
సంఘ హితము కొరకు సజ్జనుండు;
స్రష్ట మీది భక్తి - సచ్చిదానందుడై !
వెల్లి విరియ జేయు వేత్త - వేరు.

హింస

చూప గలను సృష్టి లోపమ్ములను నీకె;
దేవ ! మంచి కవివి గావు నీవు,
సృష్టి యెల్ల - ఘోర హింసా జిఘాంసయే,
రక్త నిర్ఝరీ రిరంస యేల ?

యోగ విద్య

అరయ - ఎంత ? - ఇంద్రియాల సామర్థ్యమ్ము !
పరిమితమ్ము సగటు నరుల యందు,
పెంచ గలదు - యోగ విద్యా ప్రభావమ్ము
అవయవాల శక్తి - అద్భుతముగ.

పెన్న

పారు - లలిత కళల సారు - పెన్నేటిలో;
తెలుగు చరిత గుండె పులకరింప,
యుగ యుగాల హృదులు ఉఱ్ఱూత లూగించి ;
నేటి పెన్న - సలుపు నృత్య కేళి.

అహం

కనులు వీను లుండి - కన లేడు విన లేడు;
ధనము, కీర్తి చుట్టు కొనిన మనిషి;
విఱ్ఱ వీగ వచ్చు - విద్యాధికుడు గూడ,
అంతరంగ మందు అహము ముదిరి.

వంతెనలు

వాదములకు - వివిధ వేదాలకును మధ్య;
వంతెనలను కట్ట - వాంఛ నాకు,
సామరస్య శాంతి సంగీతములు పాడి;
కోరుకొందు మేలుకొలుప - ప్రజల.

పరిహాస రసికత

బ్రదుకు - తెచ్చి పెట్టు - పలు సమస్యల నెల్ల;
ఎవరు తీర్చ గలరు? పృథివి లోన??
వ్యథల మరచి పోవు - పరిహాస రసికుండు,
బొంది తోడ - "ముక్తి" పొంది తిరుగు.

బాష్పములు

నేను - కార్చినాడ - ఆనంద బాష్పముల్;
మనిషి లోని మంచితనము గాంచి;
నవ్వుకొంటి నేను - నాలోన - పలుమారు;
మనిషి లోని చెడ్డతనము గాంచి.

కన్ను లప్పగించి

మూసుకొనుచు నోరు - మోసమ్ము క్రౌర్యమ్ముల్;
కన్ను లప్పగించి - కాంచినాను.
ప్రస్తుతించినాను - పరవశత్వము నొంది;
మనిషి లోని మంచితనము గాంచి.

మానసిక సన్యాసం

నేను - సన్న్యసించి నాను - నా మనసులో !
బలము లెల్ల తగ్గె బ్రదుకు లోన ;
గడపు చుంటి నిపుడు కాలమ్ము కవితతో ;
లేవు వేరు మమత లేవి - నాకు.

అర్థం

అవసరమ్ము - మనిషి కర్థమ్ము - బ్రదుకులో;
తనను తాను చూచు కొనుట - కొరకు,
ప్రాణ మున్న - గొప్ప అర్థమ్ము - మేధావి
దొరకు గాత - హితుడు - గురు సముండు.

ఆలసించ - తరచు అమృతమ్ము విషమౌను !
వేగ మవసరమ్ము పెక్కు సార్లు;
కలవు కొన్ని పనులు - కాలమే నెరవేర్చు;
బ్రదుకు లోన - తొందరపడరాదు.

వచ్చె ముసలితనము - వ్యామోహములు హెచ్చె;
అప్రయోజకుండ నైతి - నేడు;
శక్తి యుక్తి - చతుర జవసత్వములు చచ్చె;
కవిత వ్రాయ దలతు కలము కదిపి.

సమయం

కానుపించు నెడల కాలమ్ము పక్వమై;
పురుషకారమునకు పూన దగును;
పొలము దున్న నేల? తొలకరింపక ముందు?
వెఱ్ఱి మొఱ్ఱి గాక - విత్త నేల?

ఖండ సత్యాలు

నమ్ము వార లెవరు? నల్ల బొంకులు పల్క ;
తేలి పోవు గాలి తెల్ల బొంకు ;
కలిసి మెలసి తిరుగు - ఖండ సత్యాలతో;
నరుడు చెలిమి చేసి - ధరణి మీద.

ధర్మ స్వరూపం

స్థావరములు కావు చైతన్య గమకముల్ !
నీతి నిష్ఠ ధర్మ నిర్ణయములు;
కవిత - ప్రస్తరించు - ధర్మ స్వరూపమ్ము ;
సూక్ష్మ దృష్టి తోడ చూడ గలదు.

నమ్మకము

ఆస్తికత్వ మనిన - అంధ విశ్వాసమే !
నాస్తికతయు కోరు నమ్మకమ్ము !
నమ్మకమ్ము లేదు - నాకు నమ్మకముపై !
మంచితనము చాలు మానవునకు.

ప్రమాదములు

దైవ నిర్ణయమ్ము కా వే ప్రమాదముల్ !
జనము తప్పు వలన సంభవించు,
పౌర నీతి మరచి - కారెక్కి తిరుగుచో,
స్వ పర హాని తరచు సంఘటిల్లు.

ముదుసలి

ముసలివాడు నోరు మూసుకో లేనిచో;
శాంతి యుండ దింట సుంత యైన,
జ్ఞాన మేమి తెల్పు - మౌన జాగృతి తప్ప ?
తార తమ్య ముండు తరము లందు.

కలియుగం

కలి యుగమ్ము లోన - కాలుష్యముల మధ్య;
పుట్ట వచ్చు జనము గిట్ట వచ్చు,
పరహితార్థ మొక్క పని నైన చేయాలి,
ధరణి నరుని జన్మ ధన్య మగును.

కవిత

సరస కవిత కవుల స్వగతముల్ కారాదు,
సహృదయుండు కడగి చదువ వలెను;
సరలమై నిఘంటు నిరపేక్షమై వేగ,
హృదిని చేర వలెను మెదడు నుండి.

పరిహాస రసికుడు

బ్రదుగు తెచ్చిపెట్టు పలు సమస్యల నెల్ల;
ఎవరు తీర్చ గలరు ? పృథివి లోన;
వ్యథలు మరచి పోవు పరిహాస రసికుండు;
నవ్వ గలడు తాను నొవ్వ కుండ;

నీతి

నిర్ణయింప దగును నీతి ధర్మము నెల్ల ,
దేశ కాల పాత్ర దృష్టి గలిగి;
నీతి యుండ దెచట - నిరపేక్ష సత్యమై !
ఊయెల వలె ధర్మ మూగు చుండు.

నవ్వు

నవ్వు వచ్చు తరచు నాకు - లోకము చూడ,
లేదు నాకు దేని మీద నిష్ఠ;
నీతి నవ్వు తెచ్చు - హేతు వాదము తథా;
నాకు మాతృభాష - నవ్వు సుమ్ము.

లోక మరయ నాకు ఏకైక రసముగా
హాస్య మొకటి తోచు అవని లోన,
విశ్వ మెల్ల వెదుక - వేదాంతి ఒక్కడే !
నవ్వ గలుగు నట్టి నర వరుండు.

# ఆస్తికత

పురిటి నేల వీడి - పరుగెత్తి నీటికై
బాతు పిల్ల లెల్ల ఈత గొట్టు;
గ్రుడ్డు పగిలి పుట్టి గూటిలో వర్ధిల్లి,
గగనమునకు పక్షు లెగిరి పోవు
దారి లేని కడలి తరి నీది తాబేళ్ల
పుట్టి నట్టి చోట పెట్టు గ్రుడ్లు,
మట్టి విత్తు నుండి - మహిత వృక్షము పుట్టి,
ఆకసమ్ము ప్రాకి - ఆవరించు
నిత్య ముదయ మంది నిర్ణీత సమయాన,
తూర్పు దిక్కు నందు - తోచు ఇనుడు.

పూవు పూవు తిరిగి వే వేగ ఋజు రేఖ
తేనె టీగ చేరు తేనె పట్టు;
లక్ష కోటి ప్రాణి లక్షణమ్ములు వేరు !
స్వీయ సృజన శక్తి - వృద్ధి సమము;
ప్రకృతి - శుద్ధ గణిత పారమ్య బద్ధమ్మ !
వ్యష్టిలో సమష్టి - సృష్టి యెల్ల;
విభ్రమమ్ము గొలుపు - విశ్వ విస్తీర్ణమ్ము,
మాట - మూగ వోవు - మనసు మరలు,
గగన గోళ వృత్త గాన విన్యాసముల్
శ్రుతులు లయలు సూక్ష్మ సూత్ర మితులు
ఈ విశాల విశ్వ మేకైక చైతన్య
నిత్య నిర్విశేష నిశ్చమ్ము!

కాదు - సృష్టి యెల్ల యాదృచ్ఛికము గాదు;
కలదు మీర రాని - క్రమ నిరూఢి,
అనుభవైక వేద్య మధ్యాత్మయోగమ్ము,
అహము తొలగ జ్ఞాన మవతరించు,
సృష్టి శిల్పమునకు - జేజేలు ఎదదలో
ధ్యాన రస సమాధి మౌన నిరతి.

* * * * * *

నీ కరమ్ము సోక - నేను - వేణువు నౌదు,
తాళ మౌదు; నవ మృదంగ మౌదు;
విశ్వ లయలు చిందు - వీణా నినద మౌదు;
నాద బిందు కళల నాట్య మౌదు.

నేను పరవశింతు నీ స్పర్శ సుఖముచే;
గాన మసృణ వాయు లీన మగుచు,
నింగి నేల కలుపు నేపథ్య కవితలో,
కమ్మ తెమ్మెర కెరటమ్ము నౌదు.

నే పునుగు జవాజి నెత్తావినై సదా;
కవన రసమ గుండె కదిపి కురిసి,
యుగ యుగాంతరముల ఒక చిరంజీవినై;
పులకరింప చేయ గలను - కడగి

చదల విరిసెడు మలి సంజ కెంజాయలో,
మబ్బు దొంతర తెర మాటు చేరి,
నంది నగుచు నేను నటరాజు పాదాలు
వీపు మీద సతము మోపు కొనెద.

## మరణ మంగళా శాసనం

మరణ సమయ మందు - మధుర గానము చాలు;
వద్దు - మందు లేవి వాడ వద్దు;
ఏ గతించి నప్పు దేద్వరా దెవ రేని
ఏడ్వు అనిన - నాకు - ఏవగింపు.

మైల పట్ట వద్దు - మంత్ర తంత్రము వద్దు;
స్నాన శౌచ నిరతి - చాలు చాలు !
జరుప వచ్చు - సుకవి సత్కార మొకనాడు,
దుఃఖ లవము సుంత దొరల కుండ.

జరుప వద్దు - నాకు - శ్రాద్ధ కర్మల నేవి,
వద్దు - పెట్ట వద్దు - తద్దినాలు;
బాల బాలికలకు - బహుమానములు తీర్చి,
ఏ దినమ్ము నైన - ఇవ్వ వచ్చు.

ఏది పూర్వ జన్మ ? ఎట పునర్జన్మ !
వసుధ - మనిషి - నీరు వంటి వాడు !
మంచు గడ్డ - నీరు - మరి అవిరియు వేరు !
ఒరుగు నట్టి దేమి ? ఒకటి యైన ??

భార్య - మ్రగ్గ రాదు - పసుపు కుంకుమ వీడి,
పదవ నాటి తంతు - వద్దు వద్దు;
భర్త చావు బాధ - భార్య - ఓర్చుట చాలు !
వికట కర్మ కాండ - వద్దు వద్దు.

నేను నాస్తికుడను గాను - జీవితములో,
మంచితనము మిద - మమత గలదు,
మతము మీద గాక - మానవత్వము పైన,
కలదు - గొప్ప నమ్మకమ్ము నాకు.

క్రొత్త పాతలకును - గుండె లోపల కోరి,
కూడలి గుడి - కట్టు కొంటి నేను;
హేతువాద సహిత సేతువై జీవించి,
సాహితీ తపస్సు - సలుప గలను.

అంతము చెందు ఈ భువి సమస్తము - సృష్టియె దిగ్దిగంత వి
శ్రాంత మశాశ్వతమ్ము రవిచంద్రుల తోడ - మనుష్య చావు - ఓ
వింత ఉదంతమా ? వికట వేదన లెందుకు ? సర్వ తాప ని
ష్క్రాంత మవశ్య మంగళము - చావొక స్వస్తి - వరప్రసాదమే.

"ఆలోచనము" నుండి.

# ముత్యాల గొడుగు అనుక్రమణిక

పుట

51 సహృదయాభినందనము, కానట, పెద్ద మనిషి
52 స్నేహము, రంగు గ్రుడ్డితనము, పదను, ప్రశ్న, జ్ఞాని
53 సమస్యలు, కోడిపుంజు, సేతు నిర్మాణము మేలి వస్తువు
54 అంగవైకల్యము, దారిద్ర్యము,
55 దాత, మంచితనము, మెదడు, అర్థము, మానవత్వం
56 కలహం, మంచితనము + ప్రతిభ మనన శీలి
57 రేవు, దాత, యశస్వి, మధ్య ఆహం సిరి
58 జాలి గుండె, స్నానం, రంగురాయి, ఆకర్షణము, మితభాషి
59 వేత, మంచిదనం, తృప్తి నిద్ర, మిథ్య
60 తథాగతుడు, కార్యచతురుడు, చిచ్చుబుడ్డి పొగడ్త
61 వేత్త, మనుజుడు, గృహము, బాలహృది
62 తెర ధనం, సందేశం, దొంగ నిద్ర, తొలి ఉషస్సు, అహం,
63 బొంకు, అతడు, జలప్రళయం, దొంగ, మొక్కలు,
64 ఆట లోని అరటి పండ్లు, తులసి, నిర్మాణకృషి, సేవ, అభ్యుదయం,
65 అంగ వైకల్యం, గడ్డిపోచ, టెంకాయ, మేలు మనిషి మనస్సు,
66 ముఖే ముఖే ప్రతిభా, రాజకీయం, నాలుక
67 స్వల్ప మిథ్య, మనసు మురికి, చిన్ని బుడగ
68 గ్రహాంతరయానం, సంధి, చరసాల, భావి చికిత్స, ధనం
69 గురువులు, చిరునవ్వు, పరిపక్వత, ఉడుత భక్తి, భావ వైరుధ్యము
70 కదలిక, మానస స్థాయి విక్రమాదిత్యుడు, సంతోషం, స్వేచ్ఛ
71 పరమ నీతి, నీతి, గురువు వేత్త,

పుట

72 దర్పణము, మంచిపనులు, కర్మకాండ, మారే జగతి, రణము
73 ముసుగు దొంతరలు, జ్ఞాన యజ్ఞం మేధావి, పెండ్లి
74 అజాత మిత్రుడు, బొమ్మ - బొరుసు, పాత్రదానం, అల్ప విషయాలు, సహాయం
75 స్వాగతం సేవ, కట్టు కథలు దీక్ష
76 దాత , ఆవేశి, మానవస్వభావం, బ్రదుకు, వైరుద్ధ్యములు
77 పెండ్లి , దాత, ముదుసలి,
78 పువ్వు, సేవ, పిన్న నవ్వు, హాస్యం,
79 అలతి నవ్వు, ప్రేమ, చుట్టు దారి,
80 మార్పు, మాతృహృదయం, శీలం, గాంధి, ముఖే ముఖే ప్రతిభ
81 పాపి, నరుడు సేతువు, సంప్రదాయాలు, దారిద్ర్యము,
82 త్రసరేణువు, యోగ యోజనము, మననశీలి, నాట్యరేఖ, కర్తవ్యం
83 చిన్న ఉద్యోగస్థులు, విధి విఘాతం, అవమానం, పాలవాడు, సత్యం,
84 నిజము - నీతి, నమ్మకం, రాక, అగ్ని
85 అవతారపురుషుడు, కాలం, చేదు నిజాలు, ఉదయం, శుంఠ
86 హృదయం, పరపరాగ సమ్యోగం, కోడలు
87 తెలివి, చర్య, ఋషులు, సహకార యోగం,
88 విశ్వరాజ్యసిద్ధి, అరబొంకు, పిరమిడ్లు, స్నేహం, స్వస్తి
89 భిన్న ధ్రువాలు, భగవంతుని నీడ, ఊహలు, స్థాయి, విద్య
90 మనుజుడు, మంచి పనులు, విద్య, పూనకం,
91 మైల, కావ్యం, హేతువాదం, జయము

పుట

92 దానం, దాత, మూలనిధులు, చర్చ, నేత

93. కుమన దారిద్ర్యం, హాని ముదుసలి, దాత,

94 సంజ జిలుగు, తుమ్ము, సానుభూతి, విశ్వశిల్పం, మెదడు

95 మెదడు, అవధి, వక్త, స్నేహం,

96 అనుభవం, తేనె సీసాలు, మనసు:, పందు, ఇంద్రియాతీత జ్ఞానం

97 స్నేహం, గురువు, ధనం, విద్యుత్ - తప్పు

98 దాత, తత్త్వమసి, సంగీత సాహిత్యాలు, అమెరికా - ఇంగ్లండు,

99 భ్రమలు, సంప్రదాయాలు, జ్ఞానం, మంచి, వేటు

100 ధర్మం, అగ్రహం, జాప్యం, కార్యదర్శి, క్రొత్త కాలమానములు,

101 దూరదర్శనం, మందులు, సంస్కారం, యుద్ధం

102 జయం, విజ్ఞుడు, పరమనోయానం, సంగరము, ఉత్పత్తి,

103 జాగృతి, సేవ ఆలోచనము , సున్న, దీనసేవ

104 మీట, యోగదృష్టి, ధనం,

105 అహం, మౌనం, పందు, పద్యం, వెలితి,

106 ఆచరణము, మౌనం, ఔచిత్యం, చిరువానజల్లు, జయము,

107 కాలం, కస్తూరి హరిణము, వెల విలువ, స్వేచ్ఛ, నవ్వు

108 సంతానం, రస సమాధి, గోష్ఠి, ప్రజాస్వామ్యము తులాభారం,

109 మధ్యసిరి, అశోకుడు, పాటీల ధాటి, జై జగతి,

110 విశ్వరాజ్యం, గర్వం, నేత, తేటి, త్రివిక్రముడు,

111 పాత్ర, శవ పరీక్ష, మమతలు, విశ్వాసం

112 నిజం, చప్పట్లు, హేతువాదము, బ్రదుకు, మౌనం

113 మతం, మార్పు, భాష, చుట్టుబల్ల , ఆత్మహత్య,

పుట

114 దూరదర్శనం, సమీక్ష, నేరము, మరణ శిక్ష

115 మనిషి, ప్రక్కపెరటి జామ, నీతి, భూతదయ

116 త్రికరణ శుద్ధి, కార్యశూరుడు, బ్రదుకు, వృద్ధుడు

117 విద్య, సన్మానములు,

118 సంధి, నాస్తికత, శుద్ధహేతువాదం, గోష్ఠి

119 యుద్ధం, చరిత్ర, మంచివాడు, నవ రసరుచిరం

120 ఫోను, త్రికరణశుద్ధి, మనస్సు, మావటీడు

121 బాల్యం, సమగ్రదృష్టి, రాజకీయ నేత

122 నేత, యుగళ యోగం, భావమేళన, ఎన్నికలు, అభాస - లాభం,

123 పరోపకారులు, బ్రదుకు, చిన్నతెర

124 ఘోర సంఘటనలు, సంప్రదాయములు

125 గుప్తదానం, చతుష్పథం, ఫోను, కృషి, విశ్వ వైశాల్యం

126 వైరం, సేవ, పరోపకారం, పగ, నిత్య జాగృతి,

127 పండితుడు, దానం, ఒప్పు తప్పులు, క్షమ

128 గింజ, శిఖరం, సహృదయత,

129 సాహితీవిమర్శ, గురుభక్తి, నిద్ర, యంత్ర నాగరికత,

130 స్నేహం, హేతువాదం, సంధి సానుభూతి, చేతగాని వాడు

131 చప్పట్లు, ఉద్దీపనములు , అగ్గి, అధికార కేంద్రీకరణం, అవకాశాలు,

132 ఇల్లు, ఏకభాష, మనిషి

133 నుంత వెఱ్ఱి, యంత్రనాగరికత, బ్రదుకు, భయం, స్వయంకృషి

134 వినోద కాలక్షేపం, జ్ఞానం, వాస్తవాలు, దూరదర్శనం,

135 అభ్యాగతుడు, సహృదయత, తొలిరేయి, పెండ్లి,

పుట

136 విజయము, మరపు, ప్రగతిశీలి, వక్త,

137 హాస్యం, మనసు, సంప్రదాయాలు, ఐహికం,

138 గుప్తదానం, అన్యోన్యసహకారం, కవిత, పనులు, కాలం,

139 మావటీడు, ధనం, తెలియరానిది, శాంతి,

140 హింస, స్వేచ్ఛ, రైతు, ఫోను, చందాలు,

141 పతితుడు, జ్ఞానం, ఉచితసమయం, నిగ్రహం, రూల్సు,

142 కరుణ, అమ్మ, ధనం, మెరుగు పెట్టుట,

143 చికిత్స, వసుధైక రాజ్యం, కాలిదారి, చిత్రవాక్పటిమ, ఘనత,

144 యుద్ధం, గోష్ఠి, దంపతులు,

145 ప్రేమ, సత్యం, సంగరం,

146 ఘనత, చదువు, తల్లి, తప్పు

147 జననీ జనకులు, దానం, మిత్రుడు, ముదుసలి,

148 మెదడు, సమత, స్థూల కాయుడు, కోతి చేతి కొబ్బరికాయ, సహృదయుడు,

149 చిత్తశుద్ధి, అంధభిక్షుకుడు, మిషనరీలు, నరకం - నాకం, ప్రవచనం

150 దూరదర్శనం, కూర్పు, ఆతిథ్యం, దాత, నిత్యనూతనము

151 చిరునవ్వు, మెదడు, విద్య, యోగి, రామాయణం

152 రేపు, రంగులు, పట్టు-విడుపు, చెకుముకి రాళ్ళు, లేని వాని దానం

153 అనుభవం, ధనం, స్వేచ్ఛ, చిరు దుర్గుణాలు

154 విప్లవ నేత, మంచి, ప్రౌఢ, నటుడు, నీరు పోయుట

155 మనిషి, ఆయుధాల మీద వ్యయం, వక్త, సూది మాటలు, పూజ

156 ముసలి వారు, పాత్ర దానం, ప్రాజ్ఞత, అంతరాత్మ, సమస్య

పుట

157 అనుభవం, వింతలు, మగవాడు, నటుడు, తుమ్ము

158 స్నేహం, వ్యయం, మంచితనము, శ్రీ కృష్ణ మురళి, హృదయ వైశాల్యం

159 గోపిక, వక్త, మతం, రాజకీయం, బరువు

160 భావ దారిద్ర్యం, ధీయుతుడు, వ్యాఖ్యాత, శీలం, ఈత,

161 ఇంద్రియములు, స్వాగతం, షష్ఠి పూర్తి, విశ్వహితం

162 నయ వంచకుడు, గురుభక్తి, శిష్యుడు, మయాపరణం,

163 కలలు, మనిషి-మనిషి, ధైర్యసాహసాలు, గులాబి ముళ్ళు స్నేహం

164 మధ్యవర్తి, నరమేధం, పురిటి నొప్పులు, విద్య, కష్టాలు

165 ప్రేమ, జన సంఖ్య, ప్రగతి, అప్పుడు, జీవితం

166 విజ్ఞాన నయనములు, అంతరాత్మ, సజ్జనుడు, ప్రగతి శీలి, దాత,

167 కర్తవ్యం, ముఖం, భార్యా భర్తలు, కవిత, స్వప్నభోజనుడు

168 నిదుర, గానం, సంకల్ప - శుద్ధి, ఎన్నికలు, భరత వాక్యం

169 మౌన బిందు కళలు, గొప్ప విద్య, సత్య సంధుడు, చలన చిత్రములు, సంధ్య

170 బేకు, అనుభవం, అధిక ప్రసంగాలు, సమగ్రదృష్టి,

171 సూక్తి, సహనం, గొప్పవాడు, దూత. సత్సంగం

172 వేత్త, గర్భవతి, మార్పు, పెండ్లి

173 విజయం, స్వరం, మంచి మనిషి, వృద్ధుడు

174 నిషా, సహనం, సంధి, దాత, రెండు ధ్రువములు

175 సభ, జయము, గర్భవతి, మధ్యసిరి

176 ప్రపంచ పార్లమెంటు, వివేకం, నాయికా నాయకులు, విశ్వశిల్పి , చిరునవ్వు

పుట

177 మాట, శిష్యుడు, వసుధైక కుటుంబము, ప్రక్కవారు, ఋణము

178 అనుష్ఠాన వేదాంతి, అతిథి, భారత దారిద్ర్యం, పోతు తాడి సానుభూతి

179 ప్రేమ, దానం, కవిత, సమయం, లోభి

180 నేత, సహనం, వినయం, భాష, దేహశక్తి

181 గీటురాయి, ధార్మికుడు, అంతరాత్మ, చుట్టు గుడిసె, నేత

182 ఉద్యమాలు, భారతీయ చరిత్ర, సూర్యుడు, గుడిసె, సంధి

183 ఉద్యమాలు, తులాభారం, మంచితనము, విచిత్రవిరోధాభాసం, భూతదయ

184 నేల, వాలఖిల్యులు, మనసు, జ్ఞాన విప్లవం

185 నటరాజు, జ్ఞాని, శిష్యుడు, వేడి - వెన్నెల, మిగడ

పుట

186 రేపు, అహము, అపజయం, మధుర శాంతి, ధైర్యం

187 పెద్ద మనిషి, అజాత శత్రువు, సంస్కృతి, నాగరికత, బొమ్మ - బొరుసు

188 వేత్త, హింస , యోగవిద్య, పెన్ను, అహం

189 వంతెనలు, పరిహాస రసికత, బాష్పములు, కన్ను లప్పగించి, మానసిక సన్యాసం

190 అద్దం, సమయం, ఖండ సత్యాలు

191 ధర్మ స్వరూపం, నమ్మకము, ప్రమాదములు, ముదుసలి, కలియుగం

192 కవిత, పరిహాసరసికుడు, నీతి, నవ్వు,

193 ఆస్తికత,

195 మరణ మంగళా శాసనం

# ముత్యాల గొడుగు - కృతి భర్త



శ్రీ భైర్రాజు సత్య నారాయణ రాజు గారు